


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



## ఏపీ మోడల్ స్కూల్స్ ఉద్యోగులకు శుభవార్త

ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంపు

- వివరాలు 10 లో..

# రాష్ట్ర పురోగతి, రాజధాని వికాసం

## స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా కేబినెట్ కీలక నిర్ణయాలు



3

*రాష్ట్ర పురోగతి, రాజధాని వికాసమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన అమరావతిలోని సచివాలయంలో గురువారం జరిగిన మంత్రిమండలి సమావేశం అనేక సంస్కరణలు, భారీ ప్రాజెక్టులకు ఆమోదముద్ర వేసింది. మొత్తం 34అజెండా అంశాలపై సుదీర్ఘంగా చర్చించింది. పరిశ్రమలను ఆకర్షించేలా 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఆమ్నిబస్ యాక్ట్-2026'తో పాటు నూతన 'ఏపీ పీపీపీ పాలసీ-2026' ముసాయిదాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అమరావతి క్వాంటమ్ వ్యాలీలో రూ.1002.49 కోట్లతో చేపట్టే ట్విన్ టవర్స్ నిర్మాణ బాధ్యతలను ఎల్అండ్‌టీ సంస్థకు అప్పగించేందుకు అంగీకరించింది. కేంద్రంలో నూతన నేర చట్టాలు అమల్లోకి వచ్చిన నేపథ్యంలో పాత 'దిశ' చట్టం ఉపసంహరణకు నివేదికను ఆమోదించింది. రాజధానికి కొత్త రైల్వే లైన్ ల్యాండ్ పూలింగ్, ఆక్వా విద్యుత్ రాయితీ పొడిగింపు, 15 కొత్త డీఈవో పోస్టుల భర్తీ వంటి ప్రతిపాదనలకు మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. ఈ అంశాలను సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి మీడియాకు వెల్లడించారు.*

## డిజిటల్ విప్లవానికి రాజధానిగా విశాఖ

- డేటా సెంటర్ల నగరంగా గుర్తింపు
- 51వేలకు పైగా ఉద్యోగాల సృష్టి
- 2.33 కోట్ల చదరపు అడుగుల రియల్ ఎస్టేట్ డిమాండ్
- ఏపీ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఇంధనం
- 'స్క్వేర్ యార్డ్స్' తాజా నివేదికలో వెల్లడి

13



*"డేటానే కొత్త చమురు" అని నమ్ముతున్న నేటి ప్రపంచంలో.. రేపటి భవిష్యత్తుకు కేంద్ర బిందువుగా 'సాగర తీర నగరం' విశాఖపట్నం వేగంగా రూపుదిద్దుకుంటోంది. ఒకప్పుడు కేవలం పోర్ట్ సిటీగా పేరొందిన విశాఖ నేడు దేశంలోనే అతిపెద్ద 'డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హబ్'గా కొత్త రూపాన్ని సంతరించుకుంటోంది. ప్రపంచవ్యాప్త రియల్ ఎస్టేట్ విశ్లేషణలకు పేరొందిన 'స్క్వేర్ యార్డ్స్' తాజాగా విడుదల చేసిన "ది ఇండియా డేటా సెంటర్ రివ్యూషన్ రీరైటింగ్ రియల్ ఎస్టేట్" నివేదిక విశాఖ భవిష్యత్తుపై అత్యంత ఆశాజనకమైన అంచనాలను వెలువరించింది. విశాఖలో రూపుదిద్దుకోనున్న డేటా సెంటర్ ప్రాజెక్టుల ద్వారా ఏకంగా 51,840 ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని తెలిపింది. ఈ విప్లవాత్మక అభివృద్ధితో నగరంలో 2.33 కోట్ల చదరపు అడుగుల నివాస రియల్ ఎస్టేట్‌కు భారీ డిమాండ్ ఏర్పడనుందని స్పష్టం చేసింది.*

# చేనేతకు చేయూత

- 'నేతన్న సేవలో' పథకం కింద ఒక్కో కుటుంబానికి రూ.25 వేలు
- జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేడు చీరాలలో నిధులు విడుదల చేయనున్న సీఎం
- రూ.179 కోట్లతో 71,536 కుటుంబాలకు లబ్ధి



2

*రాష్ట్రంలోని చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం మరో బృహత్తర అడుగు వేసింది. 12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం చీరాల నియోజకవర్గంలో 'నేతన్న సేవలో' నూతన పథకానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టనున్నారు.*

*ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇవ్వకపోయినప్పటికీ చేనేత వృత్తి వారసత్వాన్ని రక్షించాలనే సంకల్పంతో ఈ పథకం కింద అర్హత కలిగిన ప్రతి చేనేత కుటుంబానికి రూ.25వేలు వంతున ఆర్థిక సాయం అందించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 71,536 చేనేత కుటుంబాలకు లబ్ధి చేకూరుస్తూ ప్రభుత్వం మొత్తం రూ.179 కోట్ల నిధులను నేరుగా వారి ఖాతాల్లో జమ చేయనుంది.*



## దేశానికి గర్వకారణంగా నిలిచారు

2

కామన్వెల్త్ గేమ్స్ రజత పతక విజేత అజయ్‌బాబుకు మంత్రి నారా లోకేష్ ప్రశంస

### ఆయుష్ వైద్య సేవల అభివృద్ధికి రూ.257 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు

- జీరో వేకెన్సీ కింద ఖాళీల భర్తీ కోసం సీఎంతో చర్చిస్తా
- వైద్యుల సదస్సులో మంత్రి సత్యకుమార్ యాదవ్



7



## జగన్‌రెడ్డి అడుగు బయటపెడితే విధ్వంసమే

- పరామర్శల పేరుతో గొడ్డలి పార్టీ అరాచకాలు
- బయటకొస్తే మహిళలకు రక్షణ ఉండదు
- సామాన్య ప్రజలు ఇబ్బంది పడుతున్నారు
- రెండేళ్ల ఆయన పర్యటనల్లో అమాయక పేదల బలి
- హోం మంత్రి అనిత

- వివరాలు 11 లో..



## మత్స్యకారులకు శ్రీరామరక్ష 'సమూహ బీమా'

- రూ.5 లక్షల వరకు ఉచిత బీమా ధీమా
- పైసా భారం లేకుండా ప్రభుత్వమే ప్రీమియం చెల్లింపు
- వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

- వివరాలు 5 లో..

చైతన్యరథం

# చేనేతకు చేయూత

- 'నేతన్న సేవలో' పథకం కింద ఒక్కో కుటుంబానికి రూ.25 వేలు
- జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేడు చీరాలలో నిధులు విడుదల చేయనున్న సీఎం
- రూ.179 కోట్లతో 71,536 కుటుంబాలకు లబ్ధి
- నేతన్నల కుటుంబాలతో ముఖాముఖి కానున్న చంద్రబాబు



అమరావతి(చైతన్యరథం): నేతన్నల కుటుంబాలకు ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఇప్పటికే ఉచిత విద్యుత్, రాయితీలు, 50 ఏళ్లకే పింఛను అందిస్తూ దన్నుగా ఉంటున్న ప్రభుత్వం... తాజాగా వారి సంక్షేమానికి మరో అడుగు ముందుకేసింది. 'నేతన్న సేవలో' పథకం కింద ఒక్కో చేనేత కుటుంబానికి రూ.25వేలు చొప్పున ప్రభుత్వం జమ చేయనుంది. 12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని 'నేతన్న సేవలో' పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం ప్రారంభించనున్నారు. ఈ పథకంలో భాగంగా అర్హత కలిగిన ప్రతి నేతన్న కుటుంబానికి రూ.25వేలు సాయం దక్కనుంది. రాష్ట్ర వ్యాప్తంగా 71,536 కుటుంబాలకు రూ.179 కోట్లను ప్రభుత్వం అందించనుంది. మేనిఫెస్టోలో హామీ ఇవ్వక పోయినా చేనేతల సంక్షేమాన్ని, వృత్తి వారసత్వాన్ని పరిరక్షించే లక్ష్యంతో సర్కారు సాయం అందిస్తోంది.

## చేనేత రంగం బలోపేతం దిశగా...

తాజాగా ప్రవేశపెడుతున్న 'నేతన్న సేవలో' పథకమే కాకుండా ఇప్పటికే అనేక విధాలుగా ప్రభుత్వం లబ్ధి చేకూరుస్తోంది. చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్‌కు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తోంది. దీంతో 62,541 చేనేత కుటుంబాలు, 10,032 పవర్‌లూమ్ యూనిట్లకు ప్రయోజనం కల్పిస్తోంది. దీనికి ఏటా రూ.150 కోట్లు ఖర్చు కానుంది.

అంతే కాకుండా ఏళ్లు నిండిన 85వేల మంది చేనేతలకు రూ.4వేలు చొప్పున ఏడాదికి రూ.420 కోట్లు ఖర్చు చేస్తోంది. 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ ద్వారా రూ.79 కోట్లు అందించింది. ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు, మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్కుతో పాటు అమరావతిలోని శాఖమూరులో చేనేత, హస్తకళల మ్యూజియం కూడా ఏర్పాటు చేస్తోంది. విశాఖపట్నంలో రూ.4,200 కోట్ల పెట్టుబడితో సుస్థిర టెక్స్‌టైల్ రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు కానుంది.


## ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన వివరాలు

చీరాల నియోజకవర్గంలో పర్యటించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు క్యాంపు కార్యాలయం నుంచి బయల్దేరి వేటపాలెం మండలం కొత్తపేట గ్రామానికి 10.50 గంటలకు చేరుకుంటారు. 11.05 గంటలకు ప్రజా వేదిక సభలో పాల్గొని ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 1.35 గంటలకు జాండ్రపేటలో చేనేతల వర్క్‌షాప్‌లో లబ్ధిదారులతో ముఖాముఖి అవుతారు. కొత్తపేటలో 4.10 గంటలకు టీడీపీ శ్రేణులతో సమీక్షిస్తారు. సాయంత్రం 4.45 గంటలకు సీఎం క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు.

# వికసిత్ భారత్-స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యం

### ముఖ్యమంత్రి చంద్రబాబుతో 20 సూత్రాల కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ లంక దినకర్ భేటీ

### జిల్లాల్లో నిర్వహించిన సమీక్షల నివేదిక అందజేత



అమరావతి (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని ఇరవై సూత్రాల కార్యక్రమాలు (వికసిత్ భారత్-స్వర్ణ ఆంధ్రప్రదేశ్) అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ గురువారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుపై రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో రెండు దశలుగా నిర్వహించిన సమావేశాలకు సంబంధించిన నివేదిక సమర్పించారు. రాష్ట్రస్థాయిలో వివిధ అంశాలపై నిర్వహించిన సమీక్షలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలును అధ్యయనం చేసేందుకు వివిధ రాష్ట్రాల్లో చేపట్టిన అధ్యయన పర్యటనల వివరాలను కూడా ముఖ్యమంత్రికి అందజేశారు. కొడుమూరు, మదనపల్లి పర్యటనల్లో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలపై గతంలో తాను లేఖ ద్వారా చేసిన సూచనలను గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వాటిని సంబంధిత శాఖలకు పరిశీలన కోసం పంపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. చేనేత కార్మికుల ఆరోగ్య రక్షణ కోసం ప్రత్యేక చర్యలు, గృహ నిర్మాణ పథకాల్లో స్థలానికి సంబంధించిన నిబంధనల్లో అవసరమైన వెసులుబాట్లు, స్వయం సహాయక సంఘాల తరహాలో సూక్ష్మ చేనేత గ్రూపుల ఏర్పాటు చేసి రివాల్వింగ్ ఫండ్ రుణ సదుపాయం కల్పించడం, టీటీడీ వంటి ప్రభుత్వ సంస్థల వస్త్రాల కొనుగోళ్లలో ఈ సూక్ష్మ గ్రూపులకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి అంశాలను ముఖ్యమంత్రికి మరోసారి వివరించారు.

రాష్ట్ర భవిష్యత్ నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకుఅదనపు సామ ర్థ్యంతో కొత్త రిజర్వాయర్ల నిర్మాణం... ఇప్పటికే ఉన్న రిజర్వాయర్లలో పూడిక తొలగింపు (డీసిల్టింగ్) కార్యక్రమాలను జాతీయ స్థాయి మిషన్‌గా చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలని ముఖ్య మంత్రికి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపాదించిన తూర్పు-పశ్చిమ భారతదేశ రహదారి, రైల్వే, జలమార్గాల ద్వారా అనుసంధానించే సమగ్ర మౌలిక సదుపాయాల ప్రణాళిక దేశ ఆర్థికాభి వృద్ధికి కొత్త దిశను చూపుతుందన్నారు. ఈ ప్రతిపాదన ద్వారా విశాఖపట్నం-ముంబై మధ్య పారిశ్రామిక, వాణిజ్య అనుసంధానం బలోపేతమవుతుందన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్య సాధనతో పాటు ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పించిన వికసిత్ భారత్-2047 దిశగా కీలకమైన ముందడుగు పడుతుందన్నారు.

ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌వే ఇప్పటికే దేశ ఆర్థిక ప్రగతికి బలమైన పునాది వేస్తోందని, రాయలసీమ మీదుగా నిర్మాణంలో ఉన్న సూరత్-చెన్నై ఎక్స్‌ప్రెస్ వే పూర్తయిన తర్వాత ఢిల్లీ నుంచి చెన్నై వరకు ఉత్తర, దక్షిణ భారతదేశాల మధ్య వేగవంతమైన అనుసంధానం ఏర్పడుతుందని దినకర్ చెప్పారు. అదే స్ఫూర్తితో ముఖ్యమంత్రి ప్రతిపాదించిన తూర్పు-పశ్చిమ భారత అనుసంధాన ప్రణాళిక దేశవ్యాప్తంగా సమతుల్య పారిశ్రామికాభివృద్ధికి, రవాణా సామర్థ్యం పెంపునకు, పెట్టుబడుల ఆకర్షణకు, ఉపాధి అవకాశాల విస్తరణకు దోహదపడుతుందని వివరించారు.

# దేశానికి గర్వకారణంగా నిలిచారు

### కామన్వెల్త్ గేమ్స్ రజత పతక విజేత అజయ్‌బాబుకు మంత్రి నారా లోకేష్ ప్రశంస



ఉండవల్లి (చైతన్యరథం): ప్రతిష్టాత్మక గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల్లో వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రజత పతకం సాధించిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వల్లూరి అజయ్‌బాబు.. కుటుంబ సభ్యులతో కలిసి గురువారం విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను ఉండవల్లిలోని ఆయన నివాసంలో కలిశారు. ఇటీవల గ్లాస్గోలో జరిగిన కామన్వెల్త్ క్రీడల్లో విజయనగరం జిల్లా కొండవెలగాడ గ్రామానికి చెందిన అజయ్‌బాబు వెయిట్ లిఫ్టింగ్ 79 కేజీల విభాగంలో రజత పతకం కైవసం చేసుకుని చరిత్ర సృష్టించారు. అద్భుత ప్రదర్శన కనబరిచిన అజయ్‌బాబును మంత్రి లోకేష్ అభినందించారు. రజత పతకం సాధించి దేశానికి, రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని కొనియాడారు. 2010లో ఢిల్లీలో జరిగిన కామన్వెల్త్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో తండ్రి కాంస్య పతకం సాధించగా.. 16 ఏళ్ల తర్వాత కుమారుడు రజత పతకం సాధించి రికార్డు సృష్టించారని ప్రశంసించారు. వచ్చే ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే లక్ష్యంగా అజయ్‌బాబు ముందుకు సాగాలని మంత్రి ఆకాంక్షించారు. అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం అజయ్‌బాబును మంత్రి శాలువాతో సత్కరించి, ప్రత్యేక జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో 'శాప్' చైర్మన్ అనిమిని రవినాయుడు, ఎండీ ఎస్.భరణి పాల్గొన్నారు.



చైతన్యరథం



# రాష్ట్ర పురోగతి, రాజధాని వికాసం

## స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా కేబినెట్ కీలక నిర్ణయాలు

### వెల్లడించిన సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి

అమరావతి (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో 1391వ (54వ) మంత్రిమండలి సమావేశం గురువారం జరిగింది. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పలు కీలక అంశాలపై చర్చించి, ప్రతిష్ఠాత్మక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. అనంతరం కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వెల్లడించారు.

**పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ:**

విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్ కార్యక్రమం కింద జీవీఎంసీ పరిధిలోని జోన్-4, వార్డు నెం.35లో ఉన్న వెలంపేట మురికివాడ పునరాభివృద్ధిని డిజైన్, బిల్డ్, ఫైనాన్స్ అండ్ ట్రాన్స్‌ఫర్ పద్ధతిలో చేపట్టేందుకు జీవీఎంసీ కమిషనర్‌కు అనుమతి ఇచ్చే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. జీవీఎంసీ యాజమాన్యంలోని 1,986.45 చ.మీ. స్థలంలో ప్రస్తుతం నివసిస్తున్న 177 ఈడబ్ల్యుఎస్ కుటుంబాలకు అక్కడికక్కడే పునరావాసం కల్పించేందుకు షేర్‌వాల్ టెక్నాలజీతో స్టిల్ట్+12 అంతస్తుల భవనం నిర్మించనున్నారు. పీపీపీ/డీబీఎఫ్‌టీ విధానంలో 24 నెలల్లో ప్రాజెక్ట్ పూర్తి చేయడంతో పాటు టీడీఆర్ ద్వారా రూ.17.07 కోట్ల నిధుల కొరతను భర్తీ చేస్తారు. ఈ ప్రాజెక్టును 'వీఈఆర్' కార్యక్రమం కింద ఇతర మురికివాడల పునరావాసానికి పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయనున్నారు.

ఆంధ్రప్రదేశ్ పెడెస్ట్రియన్ (పాదచారులు) సేఫ్టీ, యునివర్సల్ ఆక్సెస్సిబిలిటీ పాలసీ-2026ను, దాని ఆపరేషనల్ మార్గదర్శకాలను ఆమోదించే ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఈ పాలసీ ప్రకారం పాదచారుల మరణాలను పూర్తిగా నివారించే లక్ష్యంతో జీరో టాలరెన్స్ విధానం అమలు చేసి, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించి అవరోధరహిత, సురక్షిత పాదచారి మార్గాలను ఏర్పాటు చేయాలి. అన్ని పట్టణ రహదారులపై శాస్త్రీయ రోడ్ సేఫ్టీ ఆడిట్‌లు నిర్వహించి గత 2-3 సంవత్సరాల ప్రమాద డేటా ఆధారంగా అధిక ప్రమాదాలు నమోదైన 15-20 బ్లాక్‌స్పాట్‌లు, కూడళ్లు, పాఠశాలలు, అధిక పాదచారుల రద్దీ ప్రాంతాలకు ప్రాధాన్యత ఇస్తారు. ఐఆర్‌సీ ప్రమాణాలకు అనుగుణంగా ఫుట్‌పాత్‌లు, క్రాసింగ్‌లు, సబ్‌వేలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, లైటింగ్ తదితరాలను భద్రతాపరంగా మెరుగుపర్చాలి. ఆక్రమణల నియంత్రణకు జీఐఎస్ మ్యాపింగ్, సీసీటీవీ, కెమెరా ఆధారిత పర్యవేక్షణ చేపట్టి ఏడాదిలో కనీసం 20% రోడ్లను దశలవారీగా సర్వే చేసి గుర్తించిన లోపాలను వేగంగా పరిష్కరించాలి. ప్రజల్లో రహదారి భద్రతపై అవగాహన పెంచేందుకు ఐఈసీ ప్రచారాలు, సామాజిక పోలీసింగ్, ఆర్‌డబ్ల్యుఎ/టీ, పౌరుల భాగస్వామ్యం ద్వారా ప్రవర్తనా మార్పు తీసుకురావాలి.

అలాగే సీఅండ్‌డీ వ్యర్థాలను శాస్త్రీయంగా రీసైకిల్ చేసి ఫుట్‌పాత్ టైల్స్, కర్బ్‌లు, బొల్లార్డులు, వీధి ఫర్నిచర్ వంటి మౌలిక వసతుల తయారీలో వినియోగించేలా రాష్ట్రస్థాయి సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేయాలి. మౌలిక వసతుల వైఫల్యాలకు వ్యక్తిగత బాధ్యత నిర్ధారించి, సెక్షన్ 198(ఎ) కింద అవసరమైన శిక్షలు, రూ.లక్ష వరకు జరిమానాలు విధించేలా చర్యలు చేపట్టాలి.

**న్యాయ-హోం శాఖ:**

ఆంధ్రప్రదేశ్ దిశ బిల్లు-క్రిమినల్ లా (ఆంధ్రప్రదేశ్ సవరణ) బిల్లు, 2019ను ఉపసంహరించుకునేందుకు చేసిన ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలపై వేగవంతమైన దర్యాప్తు, విచారణ కోసం ఉద్దేశించిన "ఆంధ్రప్రదేశ్ దిశ బిల్లు-క్రిమినల్ లా (ఆంధ్రప్రదేశ్ సవరణ) బిల్లు, 2019"ను రాష్ట్రపతి ఆమోదం కోసం గతంలో పంపిన ఈ బిల్లును పరిశీలించిన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ.. పలు నిబంధనలపై వివరణలు కోరడంతో పాటు కేంద్ర ప్రభుత్వ శాఖల సూచనలు పొందుపరిచి కొత్త బిల్లును సమర్పించేలా ప్రస్తుత బిల్లును వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది.

మరోవైపు పాత ఐపీసీ-1860, సీఆర్‌పీసీ-1973 చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన 'భారతీయ న్యాయ సంహిత-2023', 'భారతీయ నాగరిక్ సురక్షా సంహిత- 2023' చట్టాలు 01.07.2024 నుంచి దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చాయి. దిశ బిల్లు ద్వారా సాధించాలనుకున్న మహిళలు, చిన్నారుల రక్షణ లక్ష్యాలను, కఠిన చట్టపరమైన నిబంధనలను ఈ కొత్త కేంద్ర చట్టాలు ఇప్పటికే బలోపేతం చేశాయి. కేంద్ర హోం శాఖ సూచనలు, నూతన క్రిమినల్ చట్టాల అమలు నేపథ్యంలో దిశ బిల్లును ఉపసంహరించుకోవడమే సబబు అని రాష్ట్ర డీజీపీ, న్యాయ శాఖ ఇచ్చిన స్పష్టమైన అభిప్రాయం మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ బిల్లును వెనక్కి తీసుకునే ప్రతిపాదనకు కేబినెట్ అధికారికంగా ఆమోదముద్ర వేసింది.

**ఇంధన శాఖ:**

ఆక్వాకల్చర్ ఫామ్‌లకు యూనిట్‌కు రూ.1.50 చొప్పున ఇస్తున్న విద్యుత్ టారిఫ్ రాయితీని 1.6.2026 నుంచి పొడిగించే ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో ఆక్వా రైతులకు దాదాపు రూ.1,150 కోట్ల మేర విద్యుత్ రాయితీని అందిస్తారు.

పారిశ్రామిక పార్కుల్లో విద్యుత్ మౌలిక సదుపాయాల కల్పనకు ఏపీఐఐసీ ఫెసిలిటేటర్‌గా మూలధన వ్యయాన్ని భరిస్తున్న పనులన్నింటికీ ఏపీ ట్రాన్స్‌కో-ఏపీ డిస్కమ్ విధించే పర్యవేక్షణ ఛార్జీలను 2.5 శాతానికి తగ్గించేందుకు, అభివృద్ధి ఛార్జీలను మినహాయించేందుకు చేసిన ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.



**రెవెన్యూ (భూములు) శాఖ:**

కండలేరు రిజర్వాయర్ నుంచి శ్రీసిటీలోని పారిశ్రామిక క్లస్టర్లకు నీటి సరఫరా కోసం డీఐ నీటి పైప్‌లైన్ నిర్మాణానికి తిరుపతి జిల్లా రిజర్వ్ ఫారెస్టులో 1.76 హెక్టార్ల అటవీ భూమిని మళ్లించారు. దీనికి ప్రత్యామ్నాయంగా శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రాపూరు మండలం పంగిలి గ్రామంలో ఎల్‌పీఎం నెం.1570లో ఉన్న 8.70 ఎకరాల ప్రభుత్వ భూమిని అటవీ శాఖకు కేటాయించేందుకు వీలుగా, సాధారణ నిబంధనలకు లోబడి ఏపీఐఐసీ జోనల్ మేనేజరు, నెల్లూరుకు బదిలీ చేసేందుకు రెవెన్యూ (భూములు) శాఖ చేసిన ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

**రెవెన్యూ (భూములు) శాఖ:**

పీఎం-కుసుమ్ ఫీడర్ లెవల్ సోలరైజేషన్ పథకం కింద సోలార్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటు కోసం వైఎస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల మండలం చెర్లోపల్లి గ్రామంలో 49.67 ఎకరాల భూమిని లీజు ప్రాతిపదికన NREDCAP వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌కు బదిలీ చేసేందుకు రెవెన్యూ (భూములు) శాఖ చేసిన ప్రతిపాదనకు ఆమోదం.

పీఎం-కుసుమ్ ఫీడర్ లెవల్ సోలరైజేషన్ పథకం కింద సోలార్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటు కోసం వైఎస్సార్ కడప జిల్లా వేముల (గ్రామం, మండలం)లో 51.37 ఎకరాల భూమిని లీజు ప్రాతిపదికన NREDCAP వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌కు బదిలీ చేసేందుకు రెవెన్యూ (భూములు) శాఖ చేసిన ప్రతిపాదనకు ఆమోదం.

శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి మండలం కప్పలబండ గ్రామంలో 2.00 ఎకరాల భూమిని జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో టీడీపీ జిల్లా కార్యాలయ నిర్మాణం కోసం లీజు ప్రాతిపదికన టీడీపీకి బదిలీ చేసేందుకు రెవెన్యూ (భూములు) శాఖ చేసిన ప్రతిపాదనకు ఆమోదం.

శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం ఏదుల ముస్తూరు గ్రామంలో 19.56 ఎకరాల భూమిని ఎకరానికి రూ.30.00 లక్షల మార్కెట్ విలువ చెల్లింపుపై, ఎస్‌డీఆర్ అందిన అనంతరం సాధారణ షరతులకు లోబడి ఏపీఐఐసీకి బదిలీ చేసేందుకు రెవెన్యూ (భూములు) శాఖ చేసిన ప్రతిపాదనకు ఆమోదం.

అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం వలసపల్లె గ్రామంలో 2.00 ఎకరాల భూమిని జిల్లా కేంద్రంలో జిల్లా టీడీపీ కార్యాలయ నిర్మాణం కోసం లీజు ప్రాతిపదికన టీడీపీకి బదిలీ చేసేందుకు రెవెన్యూ (భూములు) శాఖ చేసిన ప్రతిపాదనకు ఆమోదం.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం (గ్రామం, మండలం) నడిపూడి గ్రామ పంచాయతీలో రెండెకరాల ప్రభుత్వ భూమిని జిల్లా టీడీపీ కార్యాలయ భవన నిర్మాణం కోసం లీజు ప్రాతిపదికన టీడీపీకి ఇచ్చేందుకు రెవెన్యూ (భూములు) శాఖ చేసిన ప్రతిపాదనకు ఆమోదం.

చిత్తూరు జిల్లా చిత్తూరు మండలం తిమ్మసముద్రం గ్రామంలో 13.47 ఎకరాల భూమిని లేఔట్ అభివృద్ధి కోసం సాధారణ నిబంధనలకు లోబడి చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్‌కు బదిలీ చేసేందుకు రెవెన్యూ (భూములు) శాఖ చేసిన ప్రతిపాదనకు ఆమోదం

నెల్లూరు జిల్లా కండలేరు రిజర్వాయర్ నుంచి శ్రీసిటీలోని పారిశ్రామిక క్లస్టర్లకు నీటి సరఫరా కోసం డీఐ నీటి పైప్‌లైన్ నిర్మాణానికి నెల్లూరు డివిజన్ రిజర్వ్ ఫారెస్టులో 1.30 హెక్టార్ల అటవీ భూమిని మళ్లించారు. దీనికి ప్రత్యామ్నాయంగా 6.42 ఎకరాల ప్రభుత్వ భూమిని అటవీ శాఖకు కేటాయించేందుకు వీలుగా, సాధారణ నిబంధనలకు లోబడి జోనల్ మేనేజరు, ఏపీఐఐసీకి బదిలీ చేసేందుకు రెవెన్యూ (భూములు) శాఖ చేసిన ప్రతిపాదనకు ఆమోదం.

**పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ:**

నూతనంగా పునర్వ్యవస్థీకరించిన జిల్లాల పరిధికి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్‌లోని పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థలను పునర్వ్యవస్థీకరించేందుకు ప్రతిపాదనకు ఆమోదం. ఆంధ్రప్రదేశ్ మెట్రోపాలిటన్ రీజియన్, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీస్ చట్టం 2016లోని సెక్షన్ 3 ప్రకారం ఈ పునర్వ్యవస్థీకరణ చేపట్టనున్నారు.

**పరిశ్రమలు, వాణిజ్య శాఖ:**

విజయవాడ జవహర్ ఆటోనగర్‌లోని ఏపీఐఐసీ హౌసింగ్ కాలనీలో 404 గృహ యూనిట్లకు (MIG--64, LIG--108, EWS--232) అర్హులైన కేటాయింపుదారులు, తదుపరి కొనుగోలుదారులు, వారి చట్టబద్ధ వారసులు, వారసులు/సక్సెసర్లు, ప్రస్తుత యజమానులకు సమాన ప్రాతిపదికన భూమి అవిభాజ్య వాటా, ఉమ్మడి స్థల హక్కులను క్రమబద్ధీకరించడం/కన్వేయన్స్ చేయడం, అర్హత కలిగిన కేటాయింపుదారులు, చట్టబద్ధ వారసులు, సక్సెసర్లు, ప్రస్తుత యజమానుల విషయంలో

- (మిగతా వివరాలు 4లో)

# రాష్ట్ర పురోగతి, రాజధాని వికాసం

*(3వ పేజీ తరువాయి)*

అవసరమైన ర్యాటిఫికేషన్ డీడ్లను అమలు చేయడానికి ప్రతిపాదనకు ఆమోదం.

ఆమోదిత ప్రాజెక్టు ఆర్థిక వనరుల సమీకరణలో భాగంగా రుణ వాటా కోసం HUDCO మంజూరు చేసిన రూ.680.21 కోట్ల టర్మ్ లోన్‌ను ఏపీ బల్క్ డ్రగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా పొందేందుకు ప్రతిపాదనకు ఆమోదం.

G.O.Ms.No.89, I&C శాఖ 11.12.2024 ద్వారా నోటిఫై చేసిన ఆంధ్రప్రదేశ్ టెక్స్‌టైల్స్, అపారెల్, గార్మెంట్స్ పాలసీ (4.0) 2024-29లో ఉపాధి ఆధారిత ప్రోత్సాహకానికి సంబంధించిన క్లాజ్ 5.3(5)ను సవరించేందుకు చేసిన ప్రతిపాదనకు ఆమోదం.

## న్యాయ శాఖ:

రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన, వాణిజ్య కార్యకలాపాల నిర్వహణను మరింత సులభతరం చేసే ఉద్దేశ్యంతో పలు చట్టాలను ఏకకాలంలో సవరించే లక్ష్యంతో ప్రతిపాదించిన "ఆంధ్రప్రదేశ్ ఆమ్నిబస్ (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) చట్టం, 2026" రూపకల్పనకు ఆమోదం.

రాష్ట్రంలో పెట్టుబడిదారులకు మరింత అనుకూలమైన పారిశ్రామిక వాతావరణాన్ని సృష్టించడం, వ్యాపారాలకు ఆటంకంగా ఉన్న పాత నిబంధనలను సరళీకృతం చేయడం, అనుమతుల ప్రక్రియలో ఉన్న అడ్డంకులను తొలగించడం ఈ చట్టం ప్రధాన ఉద్దేశ్యం. ఒకే బిల్లు (ఆమ్నిబస్) ద్వారా వివిధ చట్టాల్లో అవసరమైన సంస్కరణలను తీసుకురావడం ద్వారా ప్రభుత్వ విధానాలను మరింత పారదర్శకంగా మార్చనున్నారు. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోకి భారీగా జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక ప్రగతిని వేగవంతం చేసి యువతకు విశేషంగా ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరనుంది.

## రెవెన్యూ శాఖ:

చిత్తూరు జిల్లా కుప్పం మండలంలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ ప్రాజెక్టు కోసం భూసేకరణ ప్రక్రియను సజావుగా, వేగవంతంగా పూర్తి చేసేందుకు, డి-ఫారం పట్టాలు లేకుండా భూములను దీర్ఘకాలంగా సాగు చేస్తూ స్వాధీన అనుభవంలో ఉన్న రైతులు/సాగుదారులు భూముల అభివృద్ధికి చేసిన గణనీయ పెట్టుబడులు, భూసేకరణ వల్ల వారి జీవనోపాధిపై పడే ప్రభావాన్ని పరిగణలోకి తీసుకుని, ఎకరాకు రూ.12.44 లక్షల చొప్పున నష్ట పరిహారం చెల్లించేందుకు చేసిన ప్రతిపాదనకు ఆమోదం. ఈ చెల్లింపు భవిష్యత్ క్లెయిమ్‌లకు ఎటువంటి పూర్వనిదర్శనంగా పరిగణించ కుండా... ఒకేసారి, కేసు-ప్రత్యేక చర్యగా అమలు చేయనున్నారు.

## పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ:

2026-27 ఆర్థిక సంవత్సరానికి రైతులకు యాన్యుటీల చెల్లింపు కోసం ఆంధ్రప్రదేశ్ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ నుండి రూ.300 కోట్ల రుణాన్ని పొందేందుకే ఏపీసీఆర్డీఏ కమిషనర్ తీసుకున్న చర్యను ధ్రువీకరించే ప్రతిపాదనకు ఆమోదం.

అమరావతి క్యాపిటల్ సిటీలో అమరావతి ఐ అభివృద్ధిని PPP-డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ పద్ధతిలో చేపట్టేందుకు టెండర్‌ను తిరిగి పిలిచేందుకు అనుమతించే ప్రతిపాదనకు ఆమోదం.

సీఆర్డీఏ ప్రాంతంలోని వివిధ సంస్థలకు కొత్త భూ కేటాయింపులు, గతంలో జరిపిన కేటాయింపుల సమీక్షకు సంబంధించిన కొత్త ప్రతిపాదనలపై జీఓఎం 28వ సమావేశం చేసిన సిఫార్సులను అథారిటీ తీర్మానం సీఆర్డీఏ నెం.690/2026 ద్వారా ఆమోదించిన ప్రతిపాదనకు ఆమోదం. జీఓఎం ప్రతిపాదనలు....

***జీఎస్ఐ కొత్త అనుమతులు:*** అనంతవరం సర్వే నం.221(P)లో 1.50 ఎకరాలు రాష్ట్ర ప్రధాన కార్యాలయం, ల్యాబొరేటరీ, మ్యూజియం కోసం ఎకరాకు రూ.4.1 కోట్ల చొప్పున 30 ఏళ్ల లీజుకు, మరో 0.57 ఎకరాలు అభివృద్ధి, పార్కు నిర్వహణ కోసం లీజుకు ప్రతిపాదించారు.



***సీఏజీ అనుమతి సవరణ:*** ఐనవోలులో గతంలో కేటాయించిన 12 ఎకరాల నుంచి 5 ఎకరాలను ఫ్రీహోల్డ్ పద్ధతిలో స్థల మార్పిడితో స్టాఫ్ క్వార్టర్స్ కోసం కేటాయించేందుకు ప్రతిపాదన.

***ఏపీఐఐసీ కన్వెన్షన్ సెంటర్:*** ఐనవోలులో కేటాయించిన భూమిని 8 ఎకరాల నుంచి 5.09 ఎకరాలకు తగ్గించి, స్థల మార్పిడితో ఏపీసీఆర్డీఏ పరిధిలో కేటాయించేందుకు ప్రతిపాదన.

***APIIC--HUDCO జాయింట్ వెంచర్:*** గతంలో హడ్కోకు కేటాయించిన 9.17 ఎకరాల ఫ్రీహోల్డ్ కేటాయింపును రద్దు చేసి, ఎంఐసీ మౌలిక వసతుల కోసం 10.20 ఎకరాలను సీఆర్డీఏకు పూర్తి హక్కులతో స్థల మార్పిడి ద్వారా కేటాయించేందుకు ప్రతిపాదన.

## పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ:

G.O.Ms.No.330, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ, 11.10.2018 మేరకు రెండో దశ భూ సమీకరణ పథకం కింద పల్నాడు జిల్లా వైకుంఠపురం గ్రామంలోని దేవదాయ ఇనాం భూములకు సంబంధించిన పరస్పర వివాద దావాలను పరిష్కరించేందుకు దేవదాయ శాఖకు రూ.122.20 కోట్ల పరిహారం చెల్లించే ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం.

అమరావతి క్వాంటమ్ వ్యాలీ టెక్ పార్క్‌లోని క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్‌కు ఇరువైపులా T1, T2 ట్విన్ ఆఫీస్ టవర్స్ నిర్మాణానికి సంబంధించి ఎడ్జ్ అడ్వాన్స్‌డ్ సర్టిఫికేషన్ ప్రమాణాలకు అనుగుణంగా షెల్-కోర్ నిర్మాణ పనులను డిజైన్ అండ్ బిల్డ్ లంప్‌సమ్ కాంట్రాక్ట్ విధానంలో చేపట్టేందుకు ఎల్1 బిడ్డర్‌ను ఖరారు చేసే ప్రక్రియను నిర్వహించడానికి AGICL మేనేజింగ్ డైరెక్టర్‌కు అధికారం కల్పించే ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

హైకోర్టు భవనం నిర్మిత విస్తీర్ణం పెరగడం వల్ల విస్తరించిన కన్సల్టెన్సీ సేవల పరిధికి, తదనుగుణంగా పెరిగిన కన్సల్టెన్సీ ఫీజుకు, అలాగే శాసనసభ, హైకోర్టు భవనాల కోసం అదనపు స్పెషలిస్ట్ కన్సల్టెంట్లను నియమించేందుకు, వారికి సంబంధించిన అదనపు కన్సల్టెన్సీ ఫీజు చెల్లింపునకు జీఎస్టీతో కలిపి రూ.206.59 కోట్లు మొత్తానికి సవరించిన పరిపాలనా అనుమతి ఇచ్చే ప్రతిపాదనకు ఆమోదం.

***శాసనసభ-హైకోర్టు భవనాల కన్సల్టెన్సీ:*** APCRDA, Hafeez Contractor, Foster + Partners (UK), Foster + Partners India కన్సార్టియంను 10.07.2025న నియమించింది. హైకోర్టు కోర్టు హాళ్లు 40 నుంచి 52కు పెరగడంతో 87,543.36 చ.అ. అదనపు బిల్ట్-అప్ ఏరియా, కన్సల్టెన్సీ పరిధి, నిపుణుల వనరులు పెరిగాయి. వేగవంతమైన నిర్మాణ షెడ్యూల్‌కు అదనపు వనరులు వినియోగించాల్సి రావడంతో పాటు, GBP మారకపు రేటు 109 నుంచి 128.215కు పెరగడం వల్ల 1,910,177 చెల్లింపులకు అదనపు బడ్జెట్ అవసరం ఏర్పడింది.

## ఆర్థిక శాఖ:

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్య విధానం-2026 ముసాయిదా బిల్లును ఆమోదించే ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

రాష్ట్రాన్ని పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చే లక్ష్యంగా రవాణా, లాజిస్టిక్స్, పోర్టులు, విమానాశ్రయాలు, పట్టణ మౌలిక వసతులు, వైద్యం, విద్య, పారిశ్రామికాభివృద్ధి, పునరుత్పాదక ఇంధనం, పర్యాటకం తదితర కీలక రంగాల్లో భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈ నూతన పాలసీని తీసుకొస్తున్నారు.

ప్రస్తుతం రాష్ట్రంలో రూ.1.23 లక్షల కోట్ల విలువైన పీపీపీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పైప్‌లైన్‌లో ఉండగా ప్రైవేట్ పెట్టుబడిదారులను ఆకర్షించి ఈ ప్రాజెక్టులను త్వరితగతిన పట్టాలెక్కించేందుకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.1,500 కోట్లు కేటాయించింది. ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రకటించిన స్టేట్ వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ తో పాటు ప్రారంభ దశలో లాభదాయకంగా లేకపోయినా భవిష్యత్తులో ఆదాయం వచ్చే అవకాశమున్న ప్రాజెక్టులకు వడ్డీ లేని రుణాలు అందించేందుకు ఒక ప్రత్యేకమైన 'బ్రిడ్జ్ ఫండ్'ను కూడా ఈ పాలసీలో పొందుపరిచారు. పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంచే పారదర్శక విధానాల ద్వారా భారీ ఎత్తున ప్రైవేట్ పెట్టుబడుల సమీకరణ, పీపీపీ ప్రాజెక్టుల సత్వర అమలు, ప్రాజెక్టుల పర్యవేక్షణ, ప్రజలకు మెరుగైన నాణ్యమైన సేవలందించడం ఈ పాలసీ ప్రధాన ఉద్దేశం.

## ఉన్నత విద్యా శాఖ:

ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ యూనివర్సిటీల (స్థాపన, నియంత్రణ) చట్టం, 2016 (2016 నాటి చట్టం నం.3)లోని షెడ్యూల్‌కు సవరణలు చేసి, "ఆర్‌వీఎస్ యూనివర్సిటీ", "ప్రగతి యూనివర్సిటీ" పేర్లను చేర్చడంతో పాటు సంబంధిత స్పాన్సరింగ్ బాడీలకు బ్రౌన్‌ఫీల్డ్ కేటగిరీ కింద ఈ రెండు ప్రైవేట్ యూనివర్సిటీలను స్థాపించేందుకు అనుమతిస్తూ ఆర్డినెన్స్ జారీ చేయాలన్న ప్రతిపాదనకు ఆమోదం.

## పాఠశాల విద్యా శాఖ:

నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లాలకు అనుగుణంగా 15 జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) పోస్టులను సృష్టించడంతో పాటు మొత్తం పోస్టుల్లో 50 శాతం పోస్టులను ప్రత్యక్ష నియామకం ద్వారా భర్తీ చేయడానికి, రాబోయే గ్రూప్-1 నోటిఫికేషన్‌లో 14 ఖాళీలను చేర్చి భర్తీ చేసేందుకు అవసరమైన ఏపీ ఎడ్యుకేషనల్ సర్వీస్ రూల్స్-1998లో తగిన సవరణలు చేయాలన్న ప్రతిపాదనకు ఆమోదం. జిల్లా విద్యాశాఖాధికారి పోస్టుల్లో 50 శాతం పోస్టులను రాబోయే ఏపీపీఎస్సీ గ్రూప్-1 నోటిఫికేషన్‌లో జాబ్ క్యాలెండర్‌లో భాగంగా భర్తీ చేయనున్నారు.

## జలవనరుల శాఖ:

రాబోయే గోదావరి పుష్కరాలు-2027 దృష్ట్యా తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, పోలవరం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, ఏలూరు జిల్లాల్లో 238 "స్నాన ఘట్టాల పనులు, ఇతర పనుల కోసం రూ.210.06 కోట్లకు పరిపాలనా అనుమతి ఇచ్చే ప్రతిపాదనకు ఆమోదం.

***ఐ.టి.ఇ & సి:***

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా మొబైల్ టవర్లు, అనుబంధ టెలికాం మౌలిక వసతుల ఏర్పాటుకు ప్రభుత్వ భూమిని అద్దె రుసుము లేకుండా అందించడంతో పాటు రాయితీతో కూడిన విద్యుత్ సరఫరా కల్పించేందుకు ప్రతిపాదనకు ఆమోదం.

## పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ:

గుంటూరు జిల్లా తాడికొండ మండలం మోతడక గ్రామంలోని మొత్తం 2344.12 ఎకరాల భూమిలో అమరావతి మీదుగా ఎర్రుపాలెం-నంబూరు మధ్య కొత్త బ్రాడ్ గేజ్ రైల్వే లైన్ (ఇరువైపులా 50 మీటర్ల చొప్పున మొత్తం 100 మీటర్ల బఫర్ జోన్‌తో) నిర్మాణం, ఇన్నర్ రింగ్ రోడ్ ఏర్పాటు కోసం గ్రామసభ తీర్మానానికి అనుగుణంగా ల్యాండ్ పూలింగ్ స్కీమ్ చేపట్టేందుకు ఏపీసీఆర్డీఏ కమిషనర్‌కు అనుమతినిచ్చే ప్రతిపాదనకు రాష్ట్ర ఆమోదం.

రైల్వే మంత్రిత్వ శాఖ రూ.2,047.40 కోట్ల అంచనా వ్యయంతో 56.53 కి.మీ. మేర ఈ కొత్త రైల్వే లైన్‌ను ప్రతిపాదించింది. అయితే భూసేకరణకు బదులుగా ల్యాండ్ పూలింగ్ విధానంలో తమ భూములను స్వచ్ఛందంగా ఇచ్చేందుకు మోతడక గ్రామ సభ తీర్మానించడం విశేషం. ఈ ప్రాజెక్టుల ద్వారా రాజధాని అమరావతికి నేరుగా రైలు, రోడ్డు అనుసంధానం ఏర్పడి ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది. అంతే కాకుండా పారిశ్రామిక, వాణిజ్య, ఐటీ, విద్య, వైద్య, పర్యాటక రంగాల్లో భారీగా పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా ఆర్థిక వృద్ధికి, శాటిలైట్ టౌన్ల అభివృద్ధికి ఇది విశేషంగా దోహదపడుతుంది. ఈ పథకం కింద స్వచ్ఛందంగా భూములిచ్చిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు, యాన్యుటీ, ఒకేసారి వ్యవసాయ రుణ మాఫీ, పెన్షన్లు తదితర ప్రయోజనాలు ఎల్‌పీఎస్ నిబంధనల ప్రకారం అందనున్నాయి.

## జలవనరుల శాఖ:

శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో "హంద్రీ-నీవా సుజల స్రవంతి ప్రాజెక్ట్ ఫేజ్-2" కింద 400.500 కి.మీ నుంచి 485.300 కి.మీ వరకు ఉన్న ప్రధాన కాలువకు సంబంధించిన మిగిలిపోయిన పనులకు (5 పనులు) రూ.600.48 కోట్ల అంచనా వ్యయంతో పరిపాలనా అనుమతి మంజూరు చేసే ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

మీడియా సమావేశంలో రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ సంచాలకుడు కేఎస్ విశ్వనాథన్ పాల్గొన్నారు.

# చేనేత కుటుంబాలకు ఆర్థిక చేయూత..

# “నేతన్న సేవలో”!





మన దేశంలో వ్యవసాయం తర్వాత ఎక్కువ మందికి ఉపాధి కల్పించేది చేనేత రంగమే. రెడీమేడ్ వస్త్రాలు మార్కెట్లను చుట్టుముట్టిన ఈ రోజుల్లో మన దేశంలో సుమారు 35 లక్షల కుటుంబాలు ఈ రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నాయంటే మామూలు విషయం కాదు. మన రాష్ట్రంలోనైతే సుమారు 1.22 లక్షల కుటుంబాలు చేనేతే ప్రథమ వృత్తిగా చేసుకుని జీవనం సాగిస్తున్నాయి. ఇందులో 70శాతం వరకు మహిళలే ఉండటం మరో గొప్ప విశేషం. చేతితో ప్రతి దారపు పోగును ఒడిసి పడుతూ అందమైన వస్త్రాలు మనకందించే నేతన్నలు సంతోషంగా ఉంటేనే దేశం ఆనందిస్తుందనేది అక్షర సత్యం.

చేనేత కుటుంబాలు ఆర్థికంగా బలంగా ఉంటేనే సమాజ సౌభాగ్యమని భావించిన గొప్ప నాయకుల్లో చంద్రబాబు నాయుడు ఒకరు. అందుకే రాష్ట్రంలో నేడు ఆర్థిక ఇబ్బందులు ఉన్నా చేనేత దారుల కళ్లలో ఆనందం కోసం “ నేతన్న సేవలో” అనే మహోత్తర కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేతకు బాగా ప్రసిద్ధి చెందిన చీరాలలో ఈ పథకం ప్రారంభించడం ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే. ప్రతి చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.25,000 ఆర్థిక సాయం అందించి వారిని వృద్ధిలోకి తీసుకురావడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశ్యం. ఈ పథకం కోసం ప్రభుత్వం రూ.179 కోట్లు ఖర్చు చేస్తుండగా 71,536 చేనేతకు టుంబాలు లబ్ది పొందనున్నాయి. ఇది కేవలం సంక్షేమం మాత్రమే కాదు.. చేనేతల శ్రమకు దక్కిన గొప్ప గౌరవం, ఆర్థిక భరోసా. గత వైసిపి సీపీ ప్రభుత్వంలో అరకొర నిధులతో “నేతన్న నేస్తం” పథకం కింద ఏడాదికి రూ.24,000 ఇచ్చినా అనేక ఆంక్షలు పెట్టి సగం మందికి నిధుల్లో కోత పెట్టింది. కరెంట్ బిల్లులు, అధిక వాహనాలు, కాంట్రాక్టు ఉద్యోగులు ఇలా అనేక కారణాలు చూపడమే కాకుండా ఆ పార్టీకి వ్యతిరేకంగా పని చేసిన వారి పట్ల వివక్ష చూపించింది. నేడు అలాంటి పరిస్థితులన్నీ అధిగమించి అర్హతే కొలమానంగా “నేతన్న సేవలో” పథకం అమలు చేయడానికి కూటమి ప్రభుత్వం ముందుకు వచ్చింది.

చేనేతలకు మొదటి నుంచి తోడుగా నిలిచిన ఏకైక పార్టీ తెలుగుదేశం. ఆనాడు స్వర్గీయ నందమూరి తారక రామారావు పార్టీ స్థాపించిన నాడే కూడు, గూడు, గుడ్డ అనే నినాదం తీసుకొచ్చి అందులో నేతన్నకు గౌరవం కల్పించారు. జనతా వస్త్రాల పేరుతో పేదలకు తక్కువ ధరకే వస్త్రాలు అందించారు. దీంతో మార్కెట్లో చేనేత వస్త్రాలకు డిమాండ్ పెంచి నేతన్నలకు నిండుగా పని కల్పించారు. పార్టీ వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న నేటి సీఎం చంద్రబాబు నాయుడు అదే ఒరవడిని కొనసాగించడం చాలా సంతోషకరమైన విషయం.

చేనేత ఉత్పత్తులను విశేషంగా ప్రోత్సహిస్తూ డిజిటల్ వేదికల ద్వారా మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తున్నారు. 365 రోజులూ చేనేతలకు ఉపాధి కల్పించాలన్నదే మా ప్రభుత్వ ధ్యేయం. కూటమి అధికారంలోకి రాగానే నూతన ఆంధ్రప్రదేశ్ టెక్స్‌టైల్స్ అప్పారెల్, గార్మెంట్స్ 2024-29 పాలసీని తీసుకొచ్చింది. ఈ రంగానికి అత్యంత అవసరమైన విద్యుత్‌ను చేతిమగ్గాల వారికి 200 యూనిట్ల వరకు ఉచితంగా ఇవ్వడం గొప్ప వరంగా భావించాలి. పవర్‌లూమ్‌లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించి ప్రభుత్వం చేదోడుగా నిలుస్తోంది.

మంగళగిరి, వెంకటగిరి, ఉప్పాడ, శ్రీకాళహస్తి, రాజాం ప్రాంతాల్లో కొత్త చేనేత క్లస్టర్లను అభివృద్ధి చేసి మహిళా చేనేత కార్మికులకు ఉపాధితో పాటు ఆర్థిక ప్రయోజనం చేకూర్చుతున్నారు. చేనేత ఉత్పత్తులపై చెల్లించే 5శాతం జీఎస్టీ చెల్లింపు బాధ్యతను ప్రభుత్వమే తన భుజాలపై వేసుకుంటోంది. ఈ రంగంలో పనిచేసే వాళ్లు మగ్గం, రాట్నాల దగ్గర గంటల కొద్ది కూర్చోవడం, తదేకంగా చూస్తూ దారాలను ఒడిసి పట్టడంతో ఎక్కువ మందిలో కళ్ల సమస్యలతో పాటు దీర్ఘకాలిక వ్యాధులు వచ్చే అవకాశాలు అధికం. ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం 50ఏళ్లు నిండిన వారికి నెలకు రూ.4,000, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి రూ.6,000 నుంచి రూ.15,000 వరకు పింఛన్ రూపంలో ఇచ్చి కుటుంబానికి ఆసరాగా ప్రభుత్వం నిలబడుతోంది. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, చేనేత కార్మికుల హక్కుల కోసం పోరాడిన ప్రగడ కోటయ్య జయంతిని ప్రతి ఏటా జూలై 26న రాష్ట్ర పండుగగా అధికారికంగా నిర్వహించడం చేనేత వర్గానికి దక్కిన గొప్ప గౌరవం. అలానే ఈ రంగాన్ని ప్రోత్సహించేలా వర్క్ షెడ్ల నిర్మాణం, కొత్త మగ్గాలు, దారాలు, ఇతర సామగ్రి కొనుగోలుకు ప్రత్యేక రాయితీలు ఇస్తోంది. ఈ ఏడాది జనవరిలో త్రిఫ్ట్ ఫండ్ నిధులను విడుదల చేసి 133 చేనేత సహకార సంఘాలను ఆదుకుంది. ఆప్కో సంస్థకు జగన్ ప్రభుత్వం పెట్టిన పాత బకాయిలను చెల్లిస్తూనే ఎప్పటికప్పుడు కొత్త నిధులు మంజూరు చేస్తోంది. చేనేత దారులకు ఏడాది పొడవునా పని లభించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ఆ రంగం పట్ల ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రేమ చూపించడం నేతన్నలకు దక్కిన గొప్ప గౌరవం.

**- పంచుమర్తి అనురాధ**
**చీఫ్ విప్, ఆంధ్రప్రదేశ్ శాసనమండలి**

## మత్స్యకారులకు ‘సమూహ బీమా’ శ్రీరామరక్ష



- **రూ.5 లక్షల వరకు ఉచిత బీమా ధీమా**
- **పైసా భారం లేకుండా ప్రభుత్వమే ప్రీమియం**
- **వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

శ్రీకాకుళం/కోటబొమ్మాళి (చైతన్యరథం): ప్రధాని మత్స్య సంపద యోజన కింద అమలు చేస్తున్న సమూహ ప్రమాద బీమా పథకం ద్వారా మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం కొండంత అండగా నిలుస్తోందని వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. సముద్రం, జలాశయాలపై వేటపైనే ఆధారపడి జీవించే మత్స్యకారులపై పైసా భారం పడ కుండా ప్రతి సభ్యునికి చెల్లించాల్సిన రూ.79.96 ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే పూర్తిగా భరిస్తుందని స్పష్టం చేశారు. 18 నుంచి 70 ఏళ్ల వయసు గల మత్స్యకారులు, చేపల రైతులు, వేట వృత్తి అనుబంధ వర్గాల వారందరికీ ఈ ఉచిత బీమా సౌకర్యం వర్తిస్తుందని వివరించారు. గతంలో 18 నుంచి 60 సంవత్సరాల వారికి అర్హత ఉండగా ప్రస్తుతం వీటిని 60 నుంచి 70 సంవత్స రాల వరకు పొడిగించడం జరిగిందని తెలిపారు. వేట సమయంలో లేదా ఇతర రూపాల్లో జరిగే ప్రమాదాల బారిన పడి మరణించినా, శాశ్వత సంపూర్ణ వైకల్యం పొందినా ఆ కుటుం బానికి రూ.5 లక్షల చొప్పున పరిహారం అందుతుందని తెలిపారు. అలాగే శాశ్వత పాక్షిక వైకల్యానికి రూ.2.50 లక్షలు, ప్రమాదం వల్ల ఆసుపత్రి పాలైతే చికిత్స నిమిత్తం రూ.25,000 వరకు బీమా సాయం అందుతుందని పేర్కొన్నారు. రోడ్డు, రైలు, అగ్ని ప్రమా దాలు, నీటిలో మునిగిపోవడం, విద్యుత్ షాక్, యంత్రాల ప్రమా దాలు, పాము కాటు, విషకీటకాల కాటు, అడవి జంతువుల దాడులు వంటి పలు రకాల అపశ్రుతులకు ఈ బీమా వర్తిస్తుందని వెల్లడించారు. ప్రమాదం జరిగిన నాటి నుంచి 120 రోజుల్లోగా క్లెయిమ్ సమాచారాన్ని అందించి, 180 రోజుల్లోగా దరఖాస్తుతో పాటు సంబంధిత పత్రాలు సమర్పిస్తే 90 రోజుల్లోనే క్లెయిమ్‌ను పరిష్కరించి బాధితులకు ఆర్థికసాయం అందిస్తారని తెలిపారు. మత్స్యకారులు, వారి కుటుంబసభ్యులు ఈ పథకం వివరాల కోసం టోల్ ఫ్రీ నంబరు 1800-425-1660, ల్యాండ్‌లైన్ 040-24000109 లేదా ఱఱఱ.స్త్రబఅఱఎఎం.ఱీవ వెబ్‌సైట్ ద్వారా పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు.

## విజయవాడలో ప్రైమ్ వాలీబాల్ లీగ్ ట్రయల్స్ ప్రారంభించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

విజయవాడ(చైతన్యరథం): ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రైమ్ వాలీబాల్ లీగ్ సెలెక్షన్ ట్రయల్స్ అండర్-21ను విజయ వాడ వీఆర్ సిద్ధార్థ కాలేజీ ఇండోర్ స్టేడియంలో హైదరాబాద్ బ్లాక్ హాక్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మంత్రి మండిపల్లి రాం ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ అండర్-21 ఓపెన్ వాలీబాల్ ట్రయల్స్ నిర్వహించడం అభినందనీయమని ప్రశంసించారు. ట్రయల్స్‌లో ప్రతిభ కనబర్చి ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో ఆడే అవకాశాన్ని ప్రతి క్రీడాకారుడు అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమం లో పాల్గొన్న పెనమలూరు టీడీపీ నాయకులు వెంకట, ద్రోణాచార్య అవార్డు గ్రహీత రమణ, బ్లాక్ బాక్స్ వ్యవస్థాపకులు అభిషేక్‌రెడ్డి, టెక్నికల్ ఆర్గనైజర్ తులసిరెడ్డి, సిద్ధార్థ కాలేజ్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్ పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి క్రీడాకారులు ట్రయల్స్‌కు వచ్చారు.






చైతన్యరథం



## ఏపీలో మూడురోజుల పాటు వర్షాలు

*విశాఖపట్నం (చైతన్యరథం): రాష్ట్రవ్యాప్తంగా మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని తుపాను హెచ్చరికల కేంద్రం డైరెక్టర్ మూర్తి తెలిపారు. ఉపరితల ఆవర్తనం కారణంగా గురువారం నుంచి వరుసగా మూడురోజుల పాటు వర్షాలు కురవనున్నట్లు వెల్లడించారు. వాయువ్య బంగాళాఖాతం, ఉత్తర ఒడిశాపై ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని, ఇది సముద్రమట్టానికి 900 మీటర్ల ఎత్తులో కొనసాగుతోందని పేర్కొన్నారు. ఉపరి తల ఆవర్తన ప్రభావంతో ఏపీలోని పలు ప్రాంతాల్లో వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించారు. ఉత్తర, దక్షిణ కోస్తా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నట్లు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని చెప్పారు. ఉరుములతో కూడిన జల్లులు పడే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ముఖ్యంగా రైతులు, వ్యవసాయ కూలీలు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.*

# చేనేతలకు చంద్రన్న పాలన స్వర్ణయుగం

- హామీ ఇవ్వకున్నా 'నేతన్న సేవలో' అమలు
- ఆర్థిక మేలు చేకూర్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యం
- ఏటా రూ.25 వేలు పథకానికి నేడు శ్రీకారం
- చేనేత జౌళి శాఖ మంత్రి సవిత
- చీరాలలో 12 జాతీయ చేనేత దినోత్సవం
- మంత్రి అనగానితో కలిసి ఏర్పాట్ల పరిశీలన



చీరాల/బాపట్ల(చైతన్యరథం): నేతన్నల బాగుకోరే ప్రభుత్వం తమదని, ఎన్నికల్లో హామీ ఇవ్వకున్నా చేనేతలకు ఆర్థిక మేలు కలుగజేయాలన్న ఉద్దేశంతో నేతన్న సేవలో పథకానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుడుతున్నారని చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఏటా రూ.25 వేల ఆర్థిక సహాయమం దిస్తూ చేనేత కుటుంబాల్లో వెలుగులు నింపనున్నారని పేర్కొన్నా రు. సీఎం చంద్రబాబు పాలన చేనేతలకు ఎప్పుడూ స్వర్ణయుగమే నన్నారు. జగన్ పాలనలో నేతన్నలు కష్టాల పాలయ్యారని, 2014 -19 మధ్య చేనేత రంగ అభివృద్ధి కోసం అమలు చేసిన పథకా లను నిలిపేశారని మండిపడ్డారు.

చీరాలలో 12 జాతీయ చేనేత దినోత్సవ వేడుకల ఏర్పాట్లను రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్ర సాద్, స్థానిక ఎమ్మెల్యే మద్దులూరు మాలకొండయ్యతో కలిసి మంత్రి గురువారం పరిశీలించారు. అనంతరం తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. నేతన్నలకు వ్యక్తిగత ఆర్థిక లబ్ధి కలిగే లా సంక్షేమ పథకాలను సీఎం చంద్రబాబు అమలు చేస్తున్నారు. 50 ఏళ్లు నిండిన నేతన్నలకు రూ.4 వేల పెన్షన్ అందజేస్తు న్నారు. ఉచిత విద్యుత్ పథకం ద్వారా మగ్గం నేసే నేతన్నలకు 200 యూనిట్లు, మర మగ్గం నేతన్నలకు 500 యూనిట్లు అందజేస్తున్నామని తెలిపారు.

కూటమి మేనిఫెస్టోలోనూ హామీ ఇవ్వకపోయినా చేనేతలు గౌరవప్రదమైన జీవనం సాగించాలన్న ఉద్దేశంతో నేతన్న సేవలో పథకాన్ని శుక్రవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రారంభించను న్నారని వివరించారు. జగన్‌రెడ్డి గత ప్రభుత్వంలో అన్ని రంగాల మాదిరిగా చేనేతను భ్రష్టుపట్టించారని మండిపడ్డారు.

అంతకుముందు చీరాలలో జరిగే 12 చేనేత జాతీయ దినోత్సవ వేడుకల ఏర్పాట్లను మంత్రి అనగాని సత్యప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే మద్దులూరు మాలకొండయ్యతో పరిశీలించారు. వేదికను, ప్రాంగణాన్ని సందర్శించారు. చేనేతలు, స్థానికులు పెద్దఎత్తున కార్యక్రమానికి తరలొచ్చే అవకాశముందని, పార్కింగ్‌కు, ట్రాఫిక్ కు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారు లకు దిశా నిర్దేశం చేశారు. వీఐపీ, వీవీఐపీ గ్యాలరీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, చేనేత, జౌళి శాఖాధికారులు, పోలీసు ఉన్నతాధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ నేతల అండతో భూమి కబ్జా

- ఆస్తి కోసం తోడబుట్టిన వాడే రౌడీలతో బెదిరింపులు
- రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై భూమి కబ్జా
- న్యాయం చేయాలని ప్రజావినతుల్లో బాధితుల గోడు
- అర్జీలు స్వీకరించిన పంచుమర్తి అనురాధ, పిల్లి మాణిక్యాలరావు

మంగళగిరి (చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో వైసీపీ నేతల దందాపై ఫిర్యాదులు అందాయి. అనంతపురం జిల్లా గార్లదిన్నె గ్రామానికి చెందిన సుంకన్న తన గోడు చెప్పుకుంటూ గుంతకల్లు మండలం కదిరిపల్లి గ్రామంలో సర్వే నెంబర్లు 55లో 9.86 సెంట్లు, 56లో 12.58 సెంట్లు, 111లో 8.17 సెంట్లు, 112లో 10.97 సెంట్లు మొత్తం 41.58 ఎకరాలు తమ కుటుంబానికి చెందిన భూములు ఉన్నాయి. ఈ భూమికి సంబంధించి అనం తపురం ఆర్డీవో కోర్టులో కేసు నడవగా, 11-03-2020న తనకు అనుకూలంగా ఆర్డర్ వచ్చింది. 2021లో మ్యుటేషన్ చేసి 1-బీ అడంగల్‌లో పేరు ఎక్కిస్తామని అధికారులు చెప్పినప్పటికీ నేటికీ తగిన చర్యలు తీసుకోలేదు. తన భూమిని కబ్జా చేసిన శంకరయ్య, లక్ష్మన్న, హేమలత, సోమ్లాబాయి, లక్ష్మీదేవి, నారాయణమ్మ తదిత రులు స్థానిక వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఒత్తిడి తెచ్చారు. కోర్టు ఆర్డర్ ఉన్న భూమిని గుంతకల్లు నాటి తహసీల్దార్ సదరు ఆక్రమణదారుల పేర్ల మీద ఆన్‌లైన్ రికార్డుల్లో ఎక్కించా రు. వారిపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరా రు. శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ, ఏపీ లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు అర్జీలు స్వీకరించారు.

**భూమి ఆక్రమణకు యత్నం**

పల్నాడు జిల్లా నకరికల్లు మండలం చల్లాగుండ్ల అడ్డరోడ్డుకు చెందిన వి.సంపూర్ణబాయి తన సమస్యను వివరిస్తూ పాపిశెట్టి పాలెం గ్రామం పరిధిలో తనకు పుట్టింటి వారి నుంచి సంక్రమిం చిన భూమి ఉంది. అయితే తన తమ్ముడు బావత్ గోవింద్ నాయక్ ఆ భూమిని తన ప్రమేయం లేకుండా వేరే వ్యక్తి అయిన జరపలకొండ నాయక్‌కు అమ్మి వారి పేరిట ఆన్‌లైన్‌లో నమోదు చేయించేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఈ సమస్యపై ఇప్పటికే పల్నాడు జిల్లా కలెక్టరుకు రెండుసార్లు అర్జీలు సమర్పించిన ఎలాంటి న్యాయం జరగలేదు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

**తహసీల్దారు కార్యాలయ సిబ్బందితో కుమ్మక్కు..భూ విక్రయం**

అనకాపల్లి జిల్లా చోడవరం మండలం అంబేరుపురం గ్రామానికి చెందిన వెంకట అప్పారావు సమస్యను వివరిస్తూ తమ గ్రామంలో వారసత్వంగా వచ్చిన 2.75 ఎకరాల జిరాయితీ మెట్ట భూమి ఉంది. అందులో ఎకరం భూమిని నరసింహమూర్తి, శ్రీనివాస రావు, బత్యాల నాయుడు అనే వ్యక్తులు ఏకమై చోడవరం తహసీ ల్దార్ కార్యాలయ సిబ్బందితో కుమ్మక్కై దౌర్జన్యంగా ఆ భూమిని తమ పేర్లతో ఆన్‌లైన్‌లో ఎక్కించుకుని పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందారు. అలాగే వెంకన్నపాలెం రెవెన్యూ పరిధిలో 3.60 ఎకరాల భూమి నరసింహనాయుడు, తన తమ్ముడు ముత్యాల నాయుడులకు ఉమ్మడి ఆస్తిగా ఉంది. ఎలాంటి భాగ పరిష్కారాలు చేయకుండా కనీసం సమాచారం కూడా ఇవ్వకుండా వేగి శ్రీని వాసరావు అనే వ్యక్తి ఆ భూమిని సొంతంగా తాకట్టు పెట్టడమే కాకుండా ఇతరులకు అమ్మేశారు. ఈ అక్రమాలపై వారిని ప్రశ్నిస్తే తనపై గొడవకు దిగుతూ భౌతిక దాడికి ప్రయత్నిస్తున్నారు. గతంలో అనేకసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

**తండ్రి ఆస్తిలో వాటా రాకుండా అడ్డుపడుతున్నారు**

అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన దంపెట్ల మునిరెడ్డి సమస్యను వివరిస్తూ తన తండ్రికి ఇద్దరు భార్యలు. మొదటి భార్యకు ఇద్దరు కుమారులు కాగా, తాను రెండవ భార్య కుమారుడిని. తన తండ్రి జీవనోపాధి కోసం మర్రిగుంట్ల గ్రామంలోని ఖాతా నెంబర్ 589, సర్వే నెంబర్ 637లో ఉన్న 4.15 ఎకరాల భూమిని తనకి ఇచ్చారు. అయితే తండ్రి సంపాదించిన మిగతా విస్తారమైన ఆస్తులలో తన కు తగిన భాగం దక్కలేదు. ఈ సర్వే నెంబర్లలో 622, 583, 635, 699, 655/2, 632, 637, 630, 684, 589/2, 590, 518/2, 499 భూములు ఉన్నాయి. ఈ భూములలో కూడా తనకు చట్టబద్ధంగా వాటా రావాలి. కానీ వారు తనకు వాటా రాకుండా చేస్తున్నారు. వారిపై చర్యలు తీసుకుని సమస్యను పరి ష్కరించాలని కోరాడు.

**స్థలం వదిలేయాలని ఒత్తిడి తెస్తున్నారు**

నంద్యాల జిల్లా రుద్రవరం మండలం ఆలమూరు గ్రామానికి చెందిన కె.రామచంద్రుడు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో తమకు ఉన్న నాలుగు సెంట్ల భూమిలో పాత ఇంటిని కూల్చివేసి కొత్త ఇల్లు నిర్మించుకుంటున్నాను. అయితే పక్కనే ఉన్న సుయలమ్మ గుడిని గతంలో ఉన్న దానికంటే పెద్దగా విస్తరించి పునర్నిర్మించారు. ఆ నెపంతో గ్రామానికి చెందిన చేపాటి నారాయణ అనే వ్యక్తి తనకి ఉన్న నాలుగు సెంట్ల స్థలాన్ని వదిలేయాలంటూ నిర్మాణం జరగకుండా రకరకాలుగా అడ్డుపడుతున్నాడు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి న్యాయం జరగలేదు. వారిపై చర్యలు తీసుకొని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.



తండ్రి ఆస్తిలో వాటా ఇప్పించండి

అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం బీ.కొత్తపల్లి గ్రామానికి చెందిన బండి రమేష్‌బాబు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ తాము మొత్తం నలుగురు అన్నదమ్ములు. తమ తండ్రి ఉన్న భూమిని మిగతా ముగ్గురు అన్నదమ్ములకు మాత్రమే పంచి ఇచ్చి తనకు రూపాయి ఆస్తి, సెంటు భూమి కూడా ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేశాడు. పొదరాళ్ల రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 2-2: 2.60 ఎకరాలు, సర్వే నంబరు 13-1బీ: 1.34 ఎకరాలు, మరొక ఖాతాలో 1.50 సెంట్ల భూమి ఉంది. తనకు తెలియ కుండా తన హక్కులను కాలరాస్తూ ఈ భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్లు జరిపించారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యా దు చేసినా ఎలాంటి న్యాయం జరగలేదు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

**భూమిని మంజూరు చేయాలి**

పల్నాడు జిల్లా మాచర్ల మండలం హస్నాబాద్ తండాకు చెందిన కేతావత్ గుండు రామ్‌నాయక్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ తమ గ్రామ పరిధిలో తమ కుటుంబానికి 38 ఎకరాల వ్యవసాయ భూమి ఉండేది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణం సమయంలో అప్పటి ప్రభుత్వం ఆ భూమిని ప్రాజెక్టు కోసం సేకరించింది. భూములు పోవడంతో జీవనాధారం కోల్పోయి అప్పటినుంచి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. భూమి కోల్పోయి నందుకు ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి ప్రత్యామ్నాయ పరిహారం అందలేదు. నాగార్జునసాగర్ రైట్ బ్యాంక్ వద్ద ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమికి సంబంధించి గతంలో పల్నాడు జిల్లా మాజీ కలెక్టర్ లోకేటి శివశంకర్‌కి విన్నవించగా ఆయన సానుకూ లంగా స్పందించి భూమి కేటాయించాలని మాచర్ల తహసీల్దార్‌ను ఆదేశించారు. అయితే తహసీల్దార్ గారు కలెక్టర్ ఆదేశాలను సైతం బుట్టదాఖలు చేశారు. దయవుంచి నాగార్జునసాగర్ రైట్ బ్యాంక్ వద్ద ఉన్న ప్రభుత్వ భూమిని మంజూరు చేసి న్యాయం చేయాలని కోరాడు.

చైతన్యరథం

# ప్రాజెక్టుల సందర్శన పేరుతో వైసీపీ నాటకాలు

- ఏ పనీ చేయని మీకు సందర్శించే హక్కు లేదు
- సీమ ప్రజల పాలిట నయవంచకుడు జగన్‌రెడ్డి
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు



మంగళగిరి (చైతన్యరథం): రాయలసీమ స్థితిగతులను మార్చే గొప్ప ప్రయత్నాలు గత రెండేళ్లుగా నిర్విరామంగా జరుగుతుంటే ఓర్వలేని వైసీపీ నాయకులు ప్రాజెక్టుల సందర్శన యాత్రల పేరు తో సరికొత్త రాజకీయ నాటకాలకు తెరలేపారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు మండిపడ్డారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఏ పనీ చేయరు..చేసే వాళ్లను చూస్తే కడుపుమంట గొడ్డలి పార్టీ నాయకుల విధానం. చంద్రబాబు నాయకత్వంలో రాయలసీమ ప్రాజెక్టులకు ఒక కొత్త కళ వచ్చింది. 2014-19 మధ్యకాలంలో దాదాపు రూ.68 వేల కోట్లు సాగునీరు, అనుబంధ రంగాల కోసం ఖర్చు చేస్తే ఒక్క రాయలసీమ ప్రాజెక్టులకే రూ.12,500 కోట్లు ఖర్చు పెట్టామని వివరించారు. ఐదేళ్ల జగన్‌రెడ్డికి అధికా రం ఇస్తే రాయలసీమ బిడ్డనని నమ్మించి రాయలసీమ భవిష్యత్తు ను నాశనం చేశాడు. ఆ ప్రాంత ప్రజల పాలిట నయవంచకుడిగా మిగిలిపోయారు. మేము 2014-19లో రూ.12,500 కోట్లు ఖర్చు పెడితే, 2019-24 మధ్య జగన్‌రెడ్డి కేవలం రూ.2,000 కోట్లే ఖర్చు చేశారని గుర్తు చేశారు. దాంట్లో కర్నూలు, అనం తపురం, చిత్తూరు జిల్లాలకు అత్యంత ప్రధానమైన హంద్రీ-నీవా కోసం కనీసం రూ.500 కోట్లు కూడా ఖర్చు పెట్టలేదని వివరించారు.

**రెండేళ్లలో సీమ ప్రాజెక్టుల కోసం రూ.12,484 కోట్లు ఖర్చు**

మేము అధికారంలోకి వచ్చాక ఒకే సంవత్సరంలో రూ.3,870 కోట్లు ఒక్క హంద్రీ-నీవా ప్రాజెక్టు పైనే ఖర్చు చేశాం. ఈ రెండేళ్ల కాలంలో రాయలసీమ ప్రాజెక్టుల కోసం ఏకంగా రూ.12,484 కోట్లు ఖర్చు చేశాం. రాయలసీమ చరిత్రలో ఇదొక సువర్ణ అధ్యా యంగా మిగిలిపోతుంది. అలాంటి చంద్రబాబుపై ఈరోజు అవాకులు, చవాకులు పేలుతూ పనిలేనోళ్లంతా కలిసి ప్రాజెక్టుల ను సందర్శిస్తున్నారు. ఒక పనికిమాలిన బృందంగా వైసీపీ నాయ కులను ప్రజలు భావిస్తున్నారు. ప్రాజెక్టులు సందర్శించే హక్కు మీకు ఎక్కడ ఉంది? మీరేమైనా ప్రాజెక్టులు కట్టారా? మీ హయాంలో ప్రాజెక్టుల గురించి అసలు మాట్లాడారా? ఆ రోజు జగన్‌రెడ్డిని ఇదే రాయలసీమ ఎమ్మెల్యేలు, ఎంపీలు, వైసీపీ నాయకులు ఎందుకు ప్రశ్నించలేదు అని మండిపడ్డారు.

**సీమకు మరణశాసనం రాసింది మీరు కాదా?**

వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ముందు కృష్ణా జలాల్లో మిగులు జలాల ఆధారిత ప్రాజెక్టులకు భవిష్యత్తులో నీటి కేటాయింపులు కోరబోమని లిఖిత పూర్వకంగా లేఖ ఇచ్చిన మాట వాస్తవం కాదా? ఆ రకంగా రాయలసీమ ప్రాజెక్టులకు ఒక మరణశాసనం లాంటి లేఖ ట్రిబ్యునల్‌కు ఇస్తున్నప్పుడు.. ఈ రాయలసీమ కాంగ్రెస్ నాయకులు ఎందుకు మాట్లాడలేదు అని ప్రశ్నించారు. జగన్ రెడ్డి ఐదేళ్లలో అనేక హామీలు ఇచ్చి రాయలసీమ ప్రాజెక్టుల గురించి ఏ మాత్రం శ్రద్ధ కనబరచనప్పుడు అసెంబ్లీలో, పార్టీ సమావేశాలలో, కనీసం ఒంటరిగానో వెళ్లి జగన్‌రెడ్డిని "నిన్ను నమ్మి రాయలసీమ ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తే రాయలసీమకు నువ్వు ఏమి చేయక పోతే ఎట్లా? అని ఏనాడైనా ఏ ఒక్కరైనా ప్రశ్నించారా? అధికారంలో ఉన్నప్పుడు అడగని వాళ్లు ఈరోజు తగుదునమ్మా అంటూ రాయలసీమ ప్రాజెక్టుల సందర్శన పేరుతో పనికిమాలిన బ్యాచ్ అంతా వెళ్లి ప్రజలకు అసత్యాలు చెప్పే ప్రయత్నం చేస్తే మిమ్మల్ని ఎట్లా నమ్ముతారు? అని ప్రశ్నించారు.

**ఏ ఒక్క ప్రాజెక్టునైనా పూర్తి చేశారా?**

ఐదేళ్ల మీ పరిపాలనలో ఏ ఒక్క ప్రాజెక్టు ముందుకుపోలేదు. హంద్రీ-నీవా, గాలేరు-నగరి.. వీటికి మీరు చేసిన ఖర్చు ఎంత? ఏమీ చేయని మీరు, రాయలసీమ ప్రయోజనాలను కాపాడలేని అసమర్థులు, దద్దమ్మలందరూ గుంపుకట్టి ఈరోజు రాయలసీమ ప్రాజెక్టుల సందర్శన యాత్రలు చేస్తుంటే ఇంత పనికిమాలిన బ్యాచ్ ఎక్కడైనా ఉంటుందా అని ప్రజలందరూ నవ్వుకుంటు న్నారు. ఐదేళ్ల కాలంలో ఒక తట్టడు మట్టి ఎత్తిన పాపాన పోలేదు. ఒక సెంటీమీటర్ కాలువ తవ్విన పాపాన పోలేదు. ఇవి చేయ కుండా 102 ప్రాజెక్టులకు ప్రీ-క్లోజర్ కింద జీవో 365 ఇచ్చి రద్దు చేశారు. ఐదేళ్ల పాలనలో ఏ ఒక్క ప్రాజెక్టయినా పూర్తి చేశా రా? ఒక్క ఎకరానికైనా నీళ్లు ఇచ్చారా? కనీసం హంద్రీ-నీవా కరెంట్ బిల్లులు కూడా కట్టలేని పనికిమాలిన ప్రభుత్వం కాదా జగన్ రెడ్డి ప్రభుత్వం? ఈ రోజు మేము బిల్లులు చెల్లిస్తున్నాం, పనులు చేస్తున్నాం, కాలువలు వెడల్పు చేస్తున్నాం, వందల కిలో మీటర్ల మేర కాలువలు పారిస్తున్నాం. ఎండాకాలంలో కూడా చెరువుల్లో నీటి కళకళలు కనిపించే విధంగా చంద్రబాబు చర్యలు తీసుకుంటుంటే.. మీరు ఈ రోజు ప్రాజెక్టుల సందర్శన యాత్రలు పెట్టడం అంటే ఆత్మహత్య సదృశ్యమైన చర్య తప్ప మరొకటి కాదని హితవుపలికారు.

**మూడేళ్లలో 36 ప్రాజెక్టుల పూర్తికి కార్యాచరణ**

రాష్ట్రవ్యాప్తంగా మూడేళ్లలో 36 ప్రాజెక్టులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుని వాటికోసం రూ.35,313 కోట్లు ఖర్చు పెట్టా లని ఒక నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నాం. అందులో14 ప్రాజెక్టులు రాయలసీమ ప్రాజెక్టులే ఉన్నాయి. వాటి కోసం రూ.19,108 కోట్లు ఖర్చు చేయబోతున్నాం. చంద్రబాబుకి రాయలసీమ పట్ల ఉన్న చిత్తశుద్ధికి ఇదే నిదర్శనం. రాయల సీమలో పుట్టిన బిడ్డగా తల్లి రుణం తీర్చుకుంటున్న కొడుకుగా చంద్రబాబు నిలిచారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండుగా విడిపోయి నప్పుడు నదీ జలాల పంపకంలో ఉమ్మడి రాష్ట్రానికి ఉన్న 811 టీఎంసీల కృష్ణా జలాల వాటాలో 512 టీఎంసీల నీటిని రాష్ట్రా నికి అధికారికంగా సాధించిన నాయకుడు చంద్రబాబు అని గర్వంగా చెప్పుకుంటున్నాం. చంద్రబాబు చాణక్యం వలనే నదీ జలాల విషయంలో రాజీపడని దృఢచిత్తం వలనే 512 టీఎంసీ లను ఏపీకి తెచ్చుకోగలిగామని వివరించారు.

**కూటమి పాలనలో సీమ ముఖచిత్రం మారుతోంది**

రాయలసీమ పండ్ల తోటల రైతులకు అత్యంత ప్రధానమైనది డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్టు. ఐదేళ్లు బిందు సేద్యం పథకాన్ని మూలన పడేసిన జగన్‌రెడ్డిని ఏ ఒక్క వైసీపీ నాయకుడైనా అడిగాడా? మా రైతులకు మీరు డ్రిప్ రాయితీపై ఎందుకు ఇవ్వడం లేదు? ఎందుకు ఆపేశావు? అని ఏ ఒక్క వైసీపీ ఎమ్మెల్యే అయినా, ఎంపీ అయినా ఐదేళ్లలో ప్రశ్నించారా? ఈ ప్రశ్నకు గొడ్డలి పార్టీ నాయ కులు సమాధానం చెప్పాలని నిలదీశారు. రాయలసీమ ఈరోజు పారిశ్రామికంగా, సాగునీటి రంగంలో అద్భుతమైన పురోగతి సాధిస్తోంది. లక్ష కోట్లతో రాయలసీమలో పండ్ల తోటల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఒకవైపు నీళ్లిస్తూ.. మరోవైపు పండ్ల తోటలను ప్రోత్సహిస్తూ బిందు సేద్యాన్ని విరివిగా అమలు చేస్తు న్నాం. ఇన్ని చేస్తున్నాం కాబట్టే రాయలసీమ వ్యవసాయ ముఖ చిత్రం మారుతోంది. ప్రపంచ మార్కెట్‌లో రాయలసీమ పండ్లకు ప్రత్యేక గుర్తింపు రాబోతోంది. అధికారంలో ఉన్న ఐదేళ్లు అరాచకా లు చేయడానికి, అన్యాయాలు చేయడానికి, రైతు గొంతు కోయ డానికి, రాయలసీమ భవిష్యత్తుకు సమాధి కట్టడానికి ప్రయత్నిం చారు. గొడ్డలి పార్టీ వల్ల రాయలసీమకు నష్టం తప్ప ఎలాంటి లాభం లేదు. విజ్ఞులైన రాయలసీమ ప్రజలు చంద్రబాబుకి తమ సంపూర్ణ మద్దతును అందిస్తున్నారని స్పష్టం చేశారు.

## ఆయుష్ వైద్యసేవల అభివృద్ధి కోసం

# రూ.257 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు

- జీరో వేకెన్సీ కింద ఖాళీల భర్తీ కోసం సీఎంతో చర్చిస్తా
- ధర్మవరం, పిఠాపురంలో ఆయుర్వేద వైద్యకళాశాలలు, ప్రొద్దుటూరులో యునాని కళాశాలకు స్థల సేకరణ పూర్తి
- రూ.90 కోట్లతో ఆరు చోట్ల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ స్పెషాలిటీ ఆసుపత్రుల ఏర్పాటుకు చర్యలు
- వైద్యుల సదస్సులో మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి



విజయవాడ(చైతన్యరథం): రాష్ట్రంలో ఆయుష్ వైద్యసేవల విస్తృతికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ క్రమంలోనే ఆయుష్ సేవల అభివృద్ధి కోసం 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.257 కోట్లు మంజూరు చేయాలని వార్షిక ప్రణాళిక కింద నేషన్ ఆయుష్ మిషన్‌కు ప్రతిపాదన పంపించామని తెలిపారు. అలాగే వైద్యారోగ్య శాఖలో మాదిరిగానే ఆయుష్, ఫుడ్ సేఫ్టీ శాఖల్లో జీరో వేకెన్సీ కింద నియామకాలు చేపట్టేందుకు ముఖ్య మంత్రి చంద్రబాబుతో చర్చిస్తామని వెల్లడించారు. విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రంలో గురువారం ప్రభుత్వ ఆయుర్వేద, హోమియో, యునాని, సిద్ధ వైద్యులకు రాష్ట్రస్థాయి సదస్సు నిర్వ హించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి పాల్గొన్నారు. జాతీయ ఆయుష్ కమిషన్ నుంచి వార్షిక ప్రణాళిక కింద నిధులు పొందడంలో ఆనాటి గత వైకాపా ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. 2024-25లో రూ.85 కోట్లు, 2025-26లో రూ.166 కోట్లు చొప్పున కూటమి ప్రభుత్వానికి మంజూరయ్యాయని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ భారీగా కేంద్రం నుంచి నిధులు మంజూరయ్యే అవకాశం ఉందని చెప్పారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం రూ.100 కోట్లతో గుంటూరు సమీపంలో కేంద్ర యోగా, ప్రకృతి వైద్యానికి సంబంధించిన పరిశోధన సంస్థను ఏర్పాటు చేసేందుకు కూటమి ప్రభుత్వం 15 ఎకరాలను కేటాయించిందని చెప్పారు. గత ప్రభుత్వం ఈ సంస్థ ఏర్పాటు కోసం కేటాయించిన భూమిని ఇళ్ల స్థలాలకు మళ్లించ డంతో తదుపరి చర్యలు స్తంభించాయని మండిపడ్డారు.

**అవగాహన తర్వాతే ఆయుర్వేదలో శస్త్రచికిత్సలు**

తిరుపతి, గిద్దలూరు, నందిగామ, తెనాలి, టెక్కలి, రంపచోడ వరంలలో ఒక్కొక్కటి రూ.15 కోట్లు చొప్పున వ్యయం చేసి సమగ్ర ఆయుష్ ఆసుపత్రులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ధర్మవరం, పిఠాపురంలలో ఆయుర్వేద, ప్రొద్దుటూరులో యునాని వైద్య కళా శాలల ఏర్పాటుకు రూ.70 కోట్లు చొప్పున రూ.210 కోట్లు ఖర్చు చేయబోతున్నామని చెప్పారు. అలాగే విశాఖలోరూ.70 కోట్లతో తలపెట్టిన నేచురోపతి వైద్యకళాశాల నిర్మాణం పనులు ముగింపు దశకు చేరుకున్నాయని తెలిపారు. అలాగే ఆయుష్ ఆరోగ్య మంది రాలకు పూర్తిస్థాయిలో కొత్త భవనాలను నిర్మించే పనులు చివరిదశకు వచ్చాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు వివిధ హోదాల్లో కలిపి 216 మంది ఆయుష్ వైద్యులను నియమించిందన్నారు. ఆయుర్వేదంలోని శల్యతంత్ర, శాకల్య తంత్ర విభాగాలకు సంబంధించి 58 రకాల శస్త్ర చికిత్సలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చిందని తెలిపారు. సంబంధిత వర్గాలతో చర్చించి, ఈ చికిత్స విధానాలపై పూర్తి అవగాహన కల్పించిన తర్వాత అమలు చేస్తామని చెప్పారు. ఆయుష్‌కు ప్రాధాన్యతనివ్వడ మంటే అల్లోపతి వైద్యాన్ని తగ్గించడం కాదని స్పష్టం చేశారు. అత్యవసర చికిత్స, శస్త్ర చికిత్సల్లో అల్లోపతి వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఉందని చెప్పారు. ఆహారపు అలవాట్లు, జీవన శైలిలో మార్పులు చేసుకోవడం, యోగా, ప్రకృతి వైద్య విధానాలను అవలంబించడం వల్ల వ్యాధులకు దూరంగా ఉండొచ్చని చెప్పారు. ఈ సదస్సులో వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి జి.వీరపాండియన్, రోణంకి గోపాలకృష్ణ, కేంద్ర ప్రభుత్వ హోమియోపతి సలహాదారు ప్రీతా కిజక్కుట్టిల్, ఆయుష్ అదనపు డైరెక్టర్లు శేఖర్, సాయి సుధాకర్, డిప్యూటీ డైరెక్టర్ ధనుంజయరావు, ఆయుష్ వైద్యులు 550 మంది పాల్గొన్నారు.

**సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ పేరుతో కాల్..**

## రూ.1.43 కోట్లు కాజేసిన కేటుగాళ్లు



కృష్ణాజిల్లా (చైతన్యరథం): మచిలీపట్నంలో సైబర్ కేటుగాళ్లు మరోసారి రెచ్చిపోయారు. ఢిల్లీ పోలీసులమంటూ వృద్ధురాలికి వాట్సాప్ కాల్ చేశారు. వృద్ధురాలి అకౌంట్ నుంచి రూ.1.43 కోట్లు మాయం చేశారు. గత రెండు నెలలుగా ఢిల్లీ పోలీసుల మంటూ వృద్ధురాలికి సైబర్ నేరగాళ్లు వాట్సాప్ వీడియో కాల్ చేశారు. 'మీరు మనీ లాండరింగ్ కేసులో ఇరుక్కున్నారు' అంటూ వృద్ధురాలిని వాట్సాప్ కాల్‌లో బెదిరించారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ పేరుతో కూడా సైబర్ నేరగాళ్లు వీడియో కాల్ మాట్లాడా రు. ఆస్తులు, అకౌంట్లలోని డబ్బులకు కోర్టుకు అటాచ్ చేయాలని నేరగాళ్లు నమ్మబలికారు. దీంతో మూడువిడతలుగా తన అకౌంట్‌లోని రూ.1.43 కోట్ల నగదును వృద్ధురాలు ట్రాన్స్‌ఫర్ చేశారు. ఆస్తులు కూడా అమ్మి నగదు జమ చేయాలని చెప్పడం తో ఆమెకు అనుమానం వచ్చింది. భయంతో వెంటనే స్థానిక పోలీసులను వృద్ధురాలు ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చైతన్యరథం

# ఏపీకి విదేశీ పెట్టుబడుల ప్రవాహం

- రెండేళ్లలో ఆరు రెట్లు ఎఫ్‌డీఐల పెరుగుదల
- పెట్టుబడిదారుల తొలి ఎంపికగా రాష్ట్రం
- నాయకత్వంపై విశ్వాసానికి నిదర్శనం

అమరావతి(చైతన్యరథం): ఒక రాష్ట్ర అభివృద్ధిని కొలిచే ప్రమా ణాల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) అత్యంత కీలకం. పెట్టుబడిదారులు విశ్వసించే రాష్ట్రంలోనే పరిశ్రమలు వస్తాయి. పరిశ్రమలు వస్తే ఉపాధి పెరుగుతుంది. ఉపాధి పెరిగితే ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. ఇదే దిశగా ఆంధ్రప్రదేశ్ గత రెండేళ్లలో విశేషమైన పురోగతి సాధించింది. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో వెల్లడించిన అధికారిక గణాంకాలు ఇప్పుడు ఒక స్పష్టమైన చిత్రా న్ని చూపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో కనిష్ఠ స్థాయికి పడిపోయిన విదేశీ పెట్టుబడులు.. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వేగంగా పుంజుకున్నాయి.

**ఆరు రెట్లు పెరిగిన విదేశీ పెట్టుబడులు**

కేంద్ర ప్రభుత్వ సమాచారం ప్రకారం 2023-24 (వైసీపీ ప్రభుత్వ చివరి పూర్తి ఆర్థిక సంవత్సరం)లో ఎఫ్‌డీఐలు 92.13 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి. 2024-25 (కూటమి ప్రభుత్వ తొలి సంవత్సరం) 233.14 మిలియన్ డాలర్లు విదేశీ పెట్టుబడు లు వచ్చాయి. 2025-26 (రెండో సంవత్సరం) 608.59 మిలియన్ డాలర్లు పెట్టుబడులు వచ్చాయి. అంటే కేవలం రెండేళ్ల వ్యవధిలోనే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఆరు రెట్లకు పైగా పెరి గాయి. తొలి ఏడాదిలో రెండింతలు... రెండో ఏడాదిలో దాదాపు మూడు రెట్లు పెరుగుతూ పెట్టుబడుల ప్రవాహం మరింత వేగం అందుకుంది.

**పెట్టుబడిదారుల నమ్మకాన్ని గెలుచుకున్న ఏపీ**


పెట్టుబడులు కేవలం ప్రకటనలతో రావు. ప్రభుత్వ విధానాలు, పారదర్శకత, వేగవంతమైన అనుమతులు, మౌలిక సదుపాయా లు, స్థిరమైన పాలనపై పెట్టుబడిదారులకు నమ్మకం ఏర్పడితేనే వస్తాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, సింగిల్ విండో క్లియరెన్స్, వేగవంతమైన అనుమతులు, పారిశ్రామిక మౌలికవసతుల అభివృద్ధి, గ్లోబల్ ఇన్వెస్టర్లతో ప్రత్యక్ష భాగ స్వామ్యాలు వంటి చర్యలతో పెట్టుబడులకు అనుకూల వాతా వరణాన్ని సృష్టించింది.

**వివిధ రంగాల్లో భారీ పెట్టుబడులు**

2025-26లో వచ్చిన విదేశీ పెట్టుబడులు ఒకే రంగంలో కాకుండా పలు కీలక రంగాలకు విస్తరించడం విశేషం. వాటిలో మెటలర్జికల్ పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, సిమెంట్/జిప్సం, ఆటోమొబైల్ రంగం, కెమికల్స్, ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్, ఎలక్ట్రానిక్స్, సర్వీస్ రంగం ఉన్నాయి. విభిన్న రంగాల్లో పెట్టుబ డులు రావడం రాష్ట్ర పారిశ్రామిక వైవిధ్యాన్ని మరింత బలోపేతం చేస్తోంది.

**జాతీయ విధానాలకు రాష్ట్ర దూకుడు తోడైంది**

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రొడక్షన్ లింక్‌డ్ ఇన్సెంటివ్, సెమికాన్ ఇండియా, బయోఈ3, తయారీ, పరిశోధన, ఆవిష్కర ణలకు సంబంధించిన జాతీయ విధానాలు వంటి కార్యక్రమాలను సమర్థంగా వినియోగించుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడులను ఆకర్షించడంలో ముందంజలో నిలుస్తోంది.




**ఉపాధి-అభివృద్ధి-ఆర్థిక బలం**

ప్రతి విదేశీ పెట్టుబడి వెనుక కొత్త పరిశ్రమ, కొత్త ఉద్యోగాలు, స్థానిక వ్యాపారాలకు అవకాశాలు, మౌలికవసతుల విస్తరణ, పన్నుల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం దాగి ఉంటాయి. అందుకే ఎఫ్‌డీఐ పెరుగుదల కేవలం గణాంకం కాదు.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలపడుతున్నదనే దానికి సంకేతం.

**పెట్టుబడుల గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్**

రెండేళ్ల క్రితం విదేశీ పెట్టుబడుల్లో వెనుకబడిన రాష్ట్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్... నేడు పెట్టుబడిదారుల విశ్వాసాన్ని గెలుచుకుని వేగంగా ఎదుగుతున్న రాష్ట్రంగా మారుతోంది. 92 మిలియన్ డాలర్ల నుంచి 608.59 మిలియన్ డాలర్ల వరకు చేరిన ఈ ప్రయాణం.. ఒక ప్రభుత్వ మార్పు మాత్రమే కాదు, పాలనా విధా నంలో వచ్చిన మార్పుకు నిదర్శనం. పెట్టుబడులు పెరుగుతు న్నాయి..పరిశ్రమలు వస్తున్నాయి..ఉపాధి అవకాశాలు విస్తరిస్తు న్నాయి. ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి కొత్త దిశగా అడుగులు వేస్తోంది.

## పెట్టుబడులపై గొడ్డలి పార్టీ దుష్ప్రచారానికి

# పార్లమెంట్ సాక్షిగా కేంద్రం చెక్

- డీపీఐఐటీ/ఇన్వెస్ట్ ఇండియా పరిధిలో ట్రాక్ చేసిన వివరాలే ఆధారం చేసుకుని నీలిమీడియా అబద్ధాలు
- ఏపీ బ్రాండ్‌ను దెబ్బతీసేలా గొడ్డలిపార్టీ విధానం
- 2023-24లో 92 మిలియన్ డాలర్లు ఉంటే.. 2025-26లో 608.59 మిలియన్ డాలర్లకు ఎఫ్‌డీఐలు
- చంద్రబాబు విజన్, లోకేష్ కార్యాచరణతో పెట్టుబడులకు స్వర్గధామంగా ఆంధ్రప్రదేశ్
- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో పెట్టుబడులు రావడం లేదని, ఉన్న పరిశ్రమలు కూడా రాష్ట్రం నుంచి వెళ్లిపోతున్నాయని గొడ్డలి పార్టీ చేస్తున్న దుష్ప్రచారానికి పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం చెక్ పెట్టిందని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహం గణనీ యంగా పెరిగిందని, చంద్రబాబు విజన్, నారా లోకేష్ కార్యాచరణతో ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు స్వర్గధామంగా మారు తోందని తెలిపారు. 2014లో రాష్ట్ర విభజన తర్వాత పెట్టుబ డులను ఆకర్షించేందుకు అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని, ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పెట్టుబ డుల వాతావరణాన్ని దెబ్బతీసిందని విమర్శించారు. 2024లో చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి న నాటి నుంచి పెట్టుబడిదారుల్లో రాష్ట్రంపై విశ్వాసం పెరిగిందని వివరించారు.

**పెరిగిన విదేశీ పెట్టుబడులు**

రాష్ట్రానికి వచ్చిన విదేశీ పెట్టుబడుల వివరాలు తెలపాలని వైసీపీ ఎంపీ గురుమూర్తి పార్లమెంట్‌లో అడిగిన ప్రశ్నకు కేంద్రం ఇచ్చిన సమాధానం కూటమి ప్రభుత్వ విజయాన్ని, గత వైసీపీ ప్రభుత్వ వైఫల్యాన్ని స్పష్టం చేసింది. 2023-24లో ఆంధ్రప్రదేశ్‌కు 92



మిలియన్ డాలర్లుగా ఉన్న ఎఫ్‌డీఐ ఈక్విటీ ఇన్‌ఫ్లో.. 2025-26లో ఏకంగా 608.59 మిలియన్ డాలర్లకు పెరిగింది. రాష్ట్రం లో పెట్టుబడులు రావడం లేదని చెప్పే గొడ్డలి పార్టీ నేతలకు ఈ గణాంకాలు చెంపపెట్టు. ఇప్పుడు విదేశీ పెట్టుబడులపై కేంద్రం ఇచ్చిన సమాధానం కూడా తప్పంటారా? దానిని కూడా వక్రీకరి స్తారా? అని ప్రశ్నించారు. వాస్తవాలను వక్రీకరించడం తాడేపల్లి ప్యాలెస్‌కు కొత్తేమీ కాదని ధ్వజమెత్తారు.

**డీపీఐఐటీ/ఇన్వెస్ట్ ఇండియా సమాధానాన్ని వక్రీకరించాయి**

**డీపీఐఐటీ/ఇన్వెస్ట్ ఇండియా సమాధానాన్ని వక్రీకరించిన వైసీపీ**

"మొన్న పార్లమెంట్‌లో వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి డీపీఐఐటీ/ ఇన్వె స్ట్ ఇండియా సహకారంతో రాష్ట్రంలో ఏర్పాటైన పరిశ్రమలు, పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనపై ప్రశ్న అడిగారు. ఆ ప్రశ్నకు సమాధానంగా కేంద్ర ప్రభుత్వం డీపీఐఐటీ/ఇన్వెస్ట్ ఇండియా పరిధిలో ఉన్న ఆ సంస్థలు ట్రాక్ చేస్తున్న కంపెనీల వివరాలను మాత్రమే వెల్లడించింది. ఆ పరిధిలో 10 కంపెనీలు ఉండగా వాటిలో రెండు ఇప్పటికే గ్రౌండ్ అయ్యాయని, ఈ ప్రాజెక్టుల పెట్టుబడి విలువ రూ.6,962 కోట్లు అని కేంద్రం తెలిపింది. అయితే ఈ సమాధానం డీపీఐఐటీ/ఇన్వెస్ట్ ఇండియా పరిధిలోని ప్రాజెక్టులకు మాత్రమే పరిమితమైనదని స్పష్టంగా ఉన్నప్పటికీ దానిని రాష్ట్రానికి వచ్చిన మొత్తం పెట్టుబడులుగా చిత్రీకరించి వైసీపీ, సాక్షి దుష్ప్రచారం చేశాయి. ఒక నిర్దిష్ట ప్రశ్నకు, నిర్దిష్ట పరిధిలో కేంద్రం ఇచ్చిన సమాధానాన్ని మొత్తం రాష్ట్ర పెట్టుబడుల గణాంకాలుగా చూపించడం ప్రజలను తప్పుదోవ పట్టించడమే. రాష్ట్రంలో పెట్టుబడులు రావడం లేదంటూ తప్పుడు ప్రచారం చేయడం ద్వారా బ్రాండ్ ఏపీని దెబ్బ తీయడానికి అవి ప్రయత్నిస్తు న్నాయి. ఇలాంటి తప్పుడు ప్రచారం రాష్ట్ర భవిష్యత్తుకు నష్టం కలిగించే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

**రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులకు కార్యాచరణ**

సీఐఐ సమ్మిట్‌తో పాటు సింగపూర్, అమెరికా, ఆస్ట్రేలియా, ముంబై, ఢిల్లీ తదితర ప్రాంతాల్లో పర్యటిస్తూ చంద్రబాబు, లోకేష్ పెట్టుబడిదారులను ఆకర్షించే చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చా యి. విశాఖపట్నంలో గూగుల్ సంస్థ 15 బిలియన్ డాలర్ల పెట్టు బడితో భారీస్థాయి ప్రాజెక్టుకు ముందుకు వస్తోంది, ఆర్సెలార్ మిట్టల్, అదానీ, రిలయన్స్, బ్రూక్‌ఫీల్డ్ వంటి సంస్థలు కూడా రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నాయి. గతంలో హైదరాబాద్‌ను ఐటీ రంగానికి కేంద్రంగా అభివృద్ధి చేసిన విధంగానే భవిష్యత్‌లో అమరావతిని ప్రపంచస్థాయి గ్రీన్‌ఫీల్డ్ నగరంగా తీర్చిదిద్దేందుకు చంద్రబాబు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. పోర్టులు, విమా నాశ్రయాలు, లాజిస్టిక్ మౌలికవసతులు, పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధితో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే కీలక పెట్టుబడి కేంద్రంగా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు.

**ఈజ్ కాదు..స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ మా విధానం**

దేశంలోని ఇతర రాష్ట్రాలు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై దృష్టి పెడుతుంటే, ముఖ్యమంత్రి చంద్రబాబు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నినాదంతో ముందుకువెళుతున్నారు. పెట్టుబడిదారులు రాష్ట్రంలో పెట్టుబడి పెట్టాలనే ఆలోచన చేసిన వెంటనే వారికి అవసరమైన రాయితీలు, శరవేగంగా అనుమతులు, మౌలిక వసతులు కల్పించే విధానాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. పెట్టుబడులకు అనుకూలమైన విధానాలు, వేగవం తమైన నిర్ణయాలు, పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వ సహకారం కారణంగానే జాతీయ, అంతర్జాతీయ స్థాయి కంపెనీలు ఆంధ్ర ప్రదేశ్ వైపు చూస్తున్నాయి. రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు, 20 లక్షల ఉద్యోగాల లక్ష్యం గాల్లో లెక్కలు కావు. రాష్ట్రంలో పెట్టుబడుల వాతావరణాన్ని మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు కేంద్రం వెల్లడించిన ఎఫ్‌డీఐ గణాంకాలు కూడా బలం చేకూరుస్తున్నాయి. దేశానికి రూ.100 పెట్టుబడులు వస్తే అందులో 25 శాతం ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్నాయి, రాష్ట్రానికి చంద్రబాబు తీసుకొచ్చిన బ్రాండ్ ఏపీని దుష్ప్రచారంతో దెబ్బ తీయడం మానుకోవాలని వైసీపీ నేతలకు హితవుపలికారు.

**ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టిన కూటమి ప్రభుత్వం**

వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి వెళ్లింది. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై విడుదల చేసిన ప్రోగ్రెస్ రిపోర్ట్ ద్వారా గత ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొన్న పరిస్థితులు స్పష్టమయ్యాయి. ఒకవైపు సంక్షేమం.. మరోవైపు అభివృద్ధి అనే విధానంతో కూటమి ప్రభుత్వం ముందు కుసాగుతోంది. ఇందులో భాగంగా సంక్షేమ పథకాల కోసం రూ.1.49 లక్షల కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం మాది. గత ప్రభుత్వం పెట్టిపోయిన బకాయిలను చెల్లించడంతో పాటు ఉద్యో గులకు ఇవ్వాల్సిన బకాయిలను కూడా చెల్లిస్తూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నాం. పెట్టుబడులను ఆకర్షించడం, ఉద్యోగాలు కల్పించడం, అభివృద్ధి చేయడం, సంక్షేమాన్ని కొనసా గించడం.. ఈ నాలుగు లక్ష్యాలతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇప్పటికైనా రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు, శర వేగంగా రాష్ట్రం అభివృద్ధి చెందడంపై వైసీపీ, సాక్షి చేస్తున్న తప్పు డు ప్రచారాన్ని మానుకోవాలని హితవుపలికారు.

# నేతన్నది, చంద్రన్నది పోగు బంధం





**ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా...**

దేశంలో వ్యవసాయం రంగం తరవాత ఎక్కువ ఆధారపడే రంగం చేనేత రంగం. ఆంధ్రప్రదేశ్ నుంచి ఐదు లక్షల కుటుం బాలకు పైగా కుటుంబాలు చేనేత రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. బీసీల అభ్యున్నతే లక్ష్యంగా ఏర్పడిన తెలుగుదేశం పార్టీ ఆది నుంచి కులవృత్తులకు అండగా నిలుస్తూ వస్తోంది. ముఖ్యంగా చేనేత రంగ అభివృద్ధికి, చేనేతల గౌరవ ప్రద జీవనా నికి అధిక ప్రాధాన్యమిస్తూ వస్తోంది. ఆనాడు అన్న ఎన్టీఆర్ కూడు, గూడు, గుడ్డ నినాదంతో చేనేత రంగానికి అండగా నిలిచా రు. జనతా వస్త్రాల పథకం పేరుతో సగం ధరలకే చేనేత వస్త్రాల ను అందుబాటులోకి తీసుకొచ్చారు. దీనివల్ల అటు పేదలకు తక్కువ ధరలకు నాణ్యమైన చేనేత వస్త్రాలు లభిస్తే... పెరిగిన అమ్మకాలతో నేతన్నల కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించింది. ఆనాడు అన్న ఎన్టీఆర్ చేనేత రంగ అభివృద్ధికి అడుగులు వేస్తే... ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న గౌరవ ముఖ్యమంత్రి చంద్ర బాబు నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపేలా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ వస్తున్నారు. ముఖ్యమంత్రిగా సీఎం చంద్రబాబు అధికారం చేపట్టిన ప్రతిసారీ నేతన్నలకు స్వర్ణ యుగమే. నూతన టెక్స్ టైల్స్ పాలసీలు అమలు చేయడం, మెగా క్లస్టర్లు, టెక్స్‌టైల్స్ పార్కులు ఏర్పాటు చేయడంతో పాటు నేతన్నల కు వ్యక్తిగత లబ్ధి కలిగేలా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తు న్నారు. 2014-19 మధ్య కాలం రాష్ట్రంలో చేనేత రంగానికి స్వర్ణయుగంగా గడిచింది. త్రిఫ్ట్ పథకాన్ని అమలు చేసి ప్రభుత్వం అందించే వాటాను పెంచారు. పవర్ టారిఫ్‌లో 50 శాతం రాయి తీ ఇచ్చారు. 2014-19లో రూ.50.15 కోట్లతో 54 క్లస్టర్లు ఏర్పాటు చేశారు. తరవాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం చేనేతల బతుకుల్లో చీకటి నింపింది. చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌక ర్యం కల్పించడంలో విఫలమైంది. సంక్షేమ పథకాలకు, అభివృద్ధి కార్యకలాపాలకు తిలోదకాలిచ్చి..నేతన్న నేస్తంతో సరిపెట్టింది.

చీకటిని చీల్చుకుంటూ వెలుగులు నింపే సూరీడులా 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం విజయం సాధించి ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించారు. దాంతో మరోసారి చేనేత రంగానికి ఊపిరి వచ్చింది. గౌరవ ముఖ్యమంత్రి దిశా నిర్దేశంలో అధికారులతో కలిసి చేనేత, జౌళి శాఖ మంత్రిగా ఎన్నో పథకాలు రూపొందించాను. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కింద 50 ఏళ్లు నిండిన 85,678 మంది చేనేతలకు అందజేసే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచాం. నెలకు రూ.34.36 కోట్ల చొప్పున చేనేతలకు పెన్షన్ల రూపంలో ఏడాదికి రూ.413.53 కోట్లు చెల్లిస్తున్నాం. చేనేతలకు త్రిఫ్ట్ ఫండ్ పథకం ద్వారా అందజేసే ప్రభుత్వ వాటాను 8 నుంచి 16 శాతానికి పెంచాం. ఈ పథకం కింద ప్రతి బడ్జెట్ లోనూ రూ.5 కోట్లు చొప్పున కేటాయిస్తూ వస్తున్నాం. క్యాష్ క్రెడిట్ పథకం కింద సహకార సంఘాలకు బ్యాంకు రుణాలు అందజేస్తున్నాం. చేనేత కార్మికులకు డైయింగ్ ఛార్జీలు, బ్లీచింగ్ ఛార్జీల వేతనాలు పెంచాం.

12 జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆగస్టు ఏడో తేదీన మరో బృహత్తరమైన పథకానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుడుతున్నారు. నేతన్నలకు మరింత ఆర్థిక భరోసా కలించేలా నేతన్న సేవలో పథకాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నారు. అర్హులైన నేతన్నలకు ఏటా రూ.25 వేలు అందజేసేలా ఈ పథకానికి రూపకల్పన చేశారు. ఈ పథకం అమలుపై ఎన్నికల్లో హామీ ఇవ్వకున్నా, మేనిఫెస్టోలో పేర్కొనకపోయినా నేతన్నలకు ఆర్థిక మేలు కలుగజేయాలన్న ఉద్దేశంతో సీఎం చంద్రబాబు నేతన్న సేవలో పథకాన్ని ప్రారంభిస్తున్నారు. ఈ పథకం ద్వారా చేనేతలకు మరింతగా ఆర్థిక భరోసా కలుగనుంది. 50 ఏళ్లు నిండిన మగ్గం నేతన్నలకు నేతన్న సేవలో పథకం ద్వారా వచ్చే రూ.25 వేలు, పెన్షన్ రూ.4 వేల చొప్పున ఏడాదికి రూ.48 వేలు, ఉచిత విద్యుత్‌తో రూ.8,640లు మొత్తం రూ.81,640 లు, మరమగ్గం నేతన్నలకు రూ.25 వేలు, పెన్షన్ రూ.4 వేల చొప్పున ఏడాదికి రూ.48 వేలు, ఉచితవిద్యుత్ కింద రూ. 21,600లు.. ఇలా ఏడాదికి రూ.94,600 ప్రత్యక్ష నగదు లబ్ధి కలుగుతోంది.

రాష్ట్రంలో నేతన్నల ఆదాయంతో పాటు చేనేత ఉత్పత్తుల పెంపు దలకు జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ (ఎన్ఆర్ఎల్ఎం) కింద రూ.14.00 కోట్లతో చీరాల, ఎమ్మిగనూరు, రాజాం-పొందూరులలో క్లస్టర్లు ప్రతిపాదించాం. జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం(ఎన్‌హెచ్‌డీపీ)లో భాగంగా ధర్మవరంలో రూ.38.31 కోట్లతో మెగా చేనేత క్లస్టర్ ఏర్పాటు చేస్తున్నాం. పిఠాపురంలో రూ.15.01 కోట్లు, మంగళగిరిలో రూ.22.35 కోట్లతో ప్రత్యేక ప్రాజెక్టుల ఏర్పాటు చేయబోతున్నాం. రాష్ట్రంలో చిన్న క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం (ఎస్‌సీడీపీ)లో భాగంగా రూ.10.44 కోట్లతో పది క్లస్టర్లను మంజూరు చేశాం. సహాయక క్లస్టర్లతో పాటు ఇతర క్లస్టర్లకు కూడా ఆర్థిక సాయం చేస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నాం. విశాఖలో రూ.172 కోట్లతో పీఎం ఏక్తా మాల్ నిర్మిస్తున్నాం. చేనేత రంగ అభివృద్ధి కోసం ముడిసరుకులపై సబ్సిడీ, ఆధునిక డిజైన్లపై శిక్షణ అందిస్తున్నాం. ఆధునిక పనిముట్ల కొనుగోలుకు 90 శాతం వరకు సబ్సిడీ కల్పించడం ద్వారా కార్మికుల ఉత్పాదకతను పెంచుతు న్నాం.

చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచేలా ఆద్యం, టాటా తనేరియా, కో ఆప్టెక్స్ వంటి సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నాం. తిరుమల తిరుపతి దేవస్థానంతో కూడా ఒప్పందం చేసుకున్నాం. చేనేత వస్త్రాలు, హస్త కళారూపాలు ఒకే చోట విక్రయించేలా షో రూమ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. కూటమి ప్రభుత్వ ప్రోత్సాహంతో రాష్ట్రంలో చేనేత రంగం అభివృద్ధి పథంలో దూసుకెళుతోంది. 'ఒక జిల్లా ఒక ఉత్పత్తి' పథకం కింద రాష్ట్రానికి వచ్చిన 10 ఓడీ ఓపీ 2025 అవార్డులలో 4 అవార్డులు చేనేత రంగానికే దక్కడం విశేషం. ఆప్కోలో ఫోన్ పే ద్వారా వస్త్రాలు కొనుగోలు, విధుల్లో పారదర్శకతకు ముఖాధారిత హాజరు, కొనుగోలు చేసిన వస్త్రాలకు కంప్యూటర్ బిల్లింగ్ వంటి సాంకేతికతలను ప్రవేశపెట్టాం. ఈ కామర్స్ సంస్థల ద్వారా వినియోగదారుల ఇళ్లకు నేరుగా చేనేత వస్త్రాలను ఆప్కో ద్వారా డోర్ డెలివరీ చేస్తున్నాం. ఆప్కో చేపట్టిన సంస్కరణలతో చేనేత అమ్మకాలు పెరిగాయి. ఈ నేపథ్యంలో ఆప్కో చేపట్టిన సంస్కరణలు (డిజిటిలైజేషన్)కు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు లభించింది.

ప్రచారం ఆర్భాటంలో మునిగిపోయిన గత ప్రభుత్వం తీరు చేనేతలకు వ్యక్తిగతంగా తీవ్ర ఇబ్బందులు కలుగజేస్తే... చేనే త రంగాన్ని భ్రష్టుపట్టించింది. ప్రభుత్వ నిధులను ఇష్టారాజ్యాంగా దారి మళ్లిస్తూ అన్ని వ్యవస్థలను నాశనం చేసింది. చివరికి ఆప్కో ను కూడా ఆనాటి జగన్ ప్రభుత్వం విడిచిపెట్టలేదు. ఆప్కో పేరుతో కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.120 కోట్లను తీసుకొచ్చి, పక్కదారి పట్టించింది. దీనివల్ల ఆప్కో సంస్థ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరు కుపోయింది. నేతన్నలకు చెల్లించాల్సిన బకాయిలు పేరుకుపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత ఆప్కోను గాడిలో పెడుతోంది. చేనేత సహకార సంఘాల బకాయిలను చెల్లిస్తున్నాం. చేనేత వస్త్రాలపై ఆప్కో, చేనేత సంఘాలకు జీఎస్టీ మినహాయింపు చేయాలనే ప్రతిపాదనను పరిశీలిస్తున్నాం. చేనేత వస్త్రాల అమ్మ కాలు పెంచేలా ప్రత్యేక ఎగ్జిబిషన్లు నిర్వహించి 40 శాతం, 50 శాతం డిస్కౌంట్లలో చేనేత ఉత్పత్తులు విక్రయిస్తున్నాం. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ఆప్కో షోరూమ్‌లలో అమ్మ కాలు పెరిగాయి. సీఎం చంద్రబాబుది, నేతన్నలది విడదీయరాని పోగు బంధం. అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ నేతన్నలకు మేలు చేసేలా నిర్ణయాలు తీసుకుంటారు. భవిష్యత్తుపై బెంగ పోయేలా పథకాలు అమలు చేస్తూ నేతన్నల మోములో చిరునవ్వులు పూయిస్తారు. చంద్రన్న మా పెద్దన్న అని నేతన్నలు గర్వంగా చెప్పుకునేలా వెన్నుదన్నుగా నిలుస్తారు. సీఎం చంద్రబాబు లక్ష్య ప్రభుత్వ లక్ష్యం ఒక్కటే.. చేనేత ఉత్పత్తుల అమ్మకాలు పెంచడం, నేతన్న కుటుంబాలు ఆర్థిక భరోసాతో కూడిన జీవనం సాగించ డం. ఆ దిశ కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది.

*నేతన్నల కుటుంబాల్లో వెలుగులు నింపేలా సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసు కుంది. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేసింది. మగ్గంపై నేసే నేతన్నలకు 200 యూనిట్లు, పవర్ లూమ్ మగ్గాల నేతన్నలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేస్తోంది. ఈ పథకం ద్వారా ఏడాదికి మగ్గం నేతన్నలకు రూ.8,640లు, మర మగ్గం నేతన్నలకు రూ.21,600లు ఆదా అవుతుంది. జూలై 30వ తేదీ నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 62,541 మంది చేనేత కుటుంబాలు ఉచిత విద్యుత్ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నాయి. ఈ పథకం అమలుతో నేతన్నలకు ఆర్థిక వెసులుబాటు కలుగుతుందనడంలో సందేహం లేదు. నేతన్నలకు మేలు చేసేలా ఇప్పటికే పలు పథకాలు అమలు చేస్తున్నాం. చిన్న క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం(ఎస్‌సీడీపీ) కింద 10 చిన్న క్లస్టర్లను మంజూరు చేశాం. 15 శాతం రాయితీపై ముడి సరుకు రాయితీ పథకం అమలు చేస్తున్నాం. 2,640 మంది చేనేత కార్మికులకు ముద్ర పథకం ద్వారా ప్రస్తుత ఆర్థిక సంత్సరంలో జూలై నెలాఖరు వరకూ 343 మందికి రూ.29.96 కోట్లు అందజేశాం. చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా చేనేత వస్త్ర ప్రదర్శనలు ఏర్పా టు చేస్తున్నాం. 2024 ఏప్రిల్ నుంచి 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు రూ.78.73 కోట్ల నగదు పరపతి సౌకర్యం కల్పించాం. నేతన్నల ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. దీనిలో భాగంగా యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా నేతన్నల ఆరోగ్య రక్షణకు చర్యలు తీసుకుంటున్నాం.*

**- ఎస్.సవిత,**
**చేనేత, జౌళి శాఖ మంత్రి**



చైతన్యరథం

# అల్లికలతో అలసిన కళ్లకు వెలుగులు

***హస్త కళాకారుల ఆరోగ్యానికి ప్రత్యేక చర్యలు - పవన్ చొరవతో 141 మందికి కళ్లజోళ్లు***



అమరావతి(చైతన్యరథం): నిరంతర ఒత్తిడితో కుంగిపోయిన వారి జీవితాల్లోకి ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కొత్త వెలుగును తీసుకువస్తున్నారు. కేవలం వైద్యపరీక్షలు నిర్వహించి అక్కడితో ఆగకుండా ఆయన 141 మందికి కళ్లజోడు అందజేశారు. గత నెలలో విజయవాడలో ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ నిర్వహించిన హస్తకళల మహోత్సవ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరైన విషయం తెలిసిందే. కళాకారులతో గాఢమైన అనుబంధాన్ని ఏర్పరచుకున్నారు. ఈ సందర్భంగా పలువురు హస్తకళాకారులు తమ వృత్తిలో నిమగ్నమైనప్పుడు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. నరసాపురం నియోజకవర్గంలోని పసలదివికి చెందిన క్రోచెట్ లేస్ కళాకారిణి మహాలక్ష్మి తన ఆరోగ్య సమస్యలను వివరించారు. గంటల తరబడి చిన్న చిన్న నమూనాలను చూస్తూ ఉండటంతో తన కంటిచూపు క్షీణిస్తోందని వివరించారు. తనకు కంటి పరీక్షలు చేయాలని ఆమె అభ్యర్థించారు. దీంతో స్పందించిన పవన్‌కళ్యాణ్ ఏపీ వ్యాప్తంగా హస్తకళాకారుల కోసం క్లస్టర్ల వారీగా ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గత నెల నరసాపురంలో క్రోచెట్ లేస్ కళాకారుల కోసం నిర్వహించిన కంటి సంరక్షణ శిబిరంలో 141 మందికి కళ్లద్దాలు అవసరమని వైద్యులు గుర్తించారు. ఆ 141 మందికి కళ్లద్దాలను అందజేశారు. అలాగే మరిన్ని కంటి సంరక్షణ శిబిరాలకు సన్నాహాలు కొనసాగుతున్నాయి. అలాగే పోలవరం ప్రాంతంలోని యలమంచిలి, అత్తిలిలో మరో రెండు శిబిరాలు పూర్తి అయ్యాయి. ఈ రెండు శిబిరాల్లో దృష్టి లోపాలతో గుర్తించిన మరో 350 మందికి కూడా ఉప ముఖ్యమంత్రి కళ్లద్దాలు అంద జేస్తున్నారు. 20 మందికి పైగా వ్యక్తుల్లో శుక్లాల సమస్యలను వైద్యులు గుర్తించారు. వారికి శస్త్రచికిత్స చికిత్సలు అందిస్తున్నారు. క్రోచెట్ లేస్ కళాకారుల కోసం అచాంట్, నరసాపురంలో మరో రెండు కంటి సంరక్షణ శిబిరాలను నిర్వహించాలని యోచిస్తున్నారు.

## ఏపీ మోడల్ స్కూల్స్ ఉద్యోగులకు శుభవార్త


**పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంపు**

అమరావతి (చైతన్యరథం): ఏపీ మోడల్ స్కూల్స్ ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 సంవత్సరాల నుంచి 62 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్థిక శాఖ జారీ చేసిన జీవోఎంఎస్ నెం.45కు అనుగుణంగా పాఠశాల విద్యాశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ జీవో 18ను విడుదల చేసింది. మోడల్ స్కూల్స్‌లోని ప్రతి ఉద్యోగికి ఈ పెంపు వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఈ ఉత్తర్వుల అమలుకు సంబంధించి తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో మోడల్ స్కూల్స్ సిబ్బంది సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## ఇక డబుల్ ఎంట్రీల వంతు

- **ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి**
- **మరో నాలుగైదురోజుల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన ఓటర్ల జాబితాలు**
- **ఫొటోల ఆధారంగా గుర్తింపు ప్రక్రియ**
- **ఇప్పటికే అందుకు సంబంధించిన విధివిధానాలపై కసరత్తు**

ఒంగోలు(చైతన్యరథం): ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణలో భాగంగా డబుల్ ఎంట్రీలు (ఒకే వ్యక్తికి రెండు ఓట్లు)పై ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటివరకు 'సర్' జరిగిన ప్రాంతాల్లో ఆ జిల్లా పరిధిలోనే డబుల్ ఎంట్రీలను పరిశీలించగా ఇప్పుడు ఇతర రాష్ట్రాలకు చెందిన ఓటర్ల జాబితాలను కూడా జిల్లాలకు కేంద్ర ఎన్నికల సంఘం పంపనుంది. వాటిని మన జిల్లా ఓటర్ల జాబితాలతో సరిచూసి డబుల్ ఎంట్రీలు ఉంటే గుర్తించనున్నారు. అందుకోసం నూతన సాంకేతిక విధానాన్ని అనుసరించనున్నారు. ఫొటో మ్యాచ్ సిమిలర్ ఎంట్రీస్ (డబుల్ ఎంట్రీలు) ద్వారా ఓట్లను గుర్తించనున్నారు. ఒకే వ్యక్తికి సంబంధించి ఇతర రాష్ట్రాల్లో, మన జిల్లాలో ఓటు ఉంటే అటువంటి వారిని గుర్తించే పనిలో పడ్డారు. ప్రధానంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి రాజధాని హైదరాబాద్‌లో, తెలంగాణలోని ఇతర జిల్లాల్లో ప్రస్తుత విభజిత రాష్ట్రానికి చెందిన ప్రజలు స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. దీర్ఘకాలంగా అక్కడే ఉంటూ ఎన్నికల సమయంలో మన రాష్ట్రాని కి పెద్దఎత్తున వచ్చి ఓట్లు వేసి వెళ్తుంటారు. అలాగే ఇతర రాష్ట్రాల్లోనూ కొందరు జీవిస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో కూడా 'సర్' ప్రక్రియ ముగిసి ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా అక్టోబరు 3వతేదీన తుది ఓటర్ల జాబితాను ప్రకటించే విధంగా ఎన్నికల సంఘం షెడ్యూల్ ఇచ్చింది. ఆ లోపు దేశంలో ఒక వ్యక్తికి ఒక ఓటు అనే విధానంతో ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంది. ఆంధ్రప్రదేశ్‌కు సమీప రాష్ట్రాల్లో ఎక్కువ మంది ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో ఇప్పుడు అటువంటి వారి ఓట్లపై ప్రత్యేక దృష్టి సారించింది. మరో నాలుగైదు రోజుల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఫొటోలతో కూడిన ఓటర్ల జాబితా లను ఇతర రాష్ట్రాల నుంచి పంపనున్నట్లు సమాచారం. ఆ ఓటర్ల జాబితాలు వచ్చిన వెంటనే ప్రస్తుతం మన జిల్లాలో ప్రకటించిన ముసాయిదా ఓటర్ల జాబితాలతో సరిచూసి ఒకే వ్యక్తికి రెండు ప్రాంతాల్లో ఓట్లు ఉంటే ఫొటో ఆధారంగా గుర్తించి తొలగించనున్నారు.



## ఎంఎస్ఎంఈలకు రుణ ప్రక్రియ వేగవంతం

- **సీఎం సంకల్పానికి అనుగుణంగా పనిచేయండి**
- **మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచనలు**
- **బ్యాంకర్లు, ఎంఎస్ఎంఈ అసోసియేషన్లతో సమావేశం**



అమరావతి(చైతన్యరథం): ఎంఎస్ఎంఈలకు రుణ ప్రక్రియ సులభతరం చేయాలని బ్యాంకర్లకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్లు, ఎంఎస్ఎంఈ అసోసియే షన్లతో గురువారం సచివాలయం 5వ బ్లాక్ కాన్ఫరెన్స్ హాలులో సమీక్ష నిర్వహించారు. సీఎం చంద్రబాబు ఒక కుటుంబం – ఒక పారిశ్రామికవేత్త ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లే క్రమంలో ఎంఎస్ఎంఈల ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకోవా లని సూచించారు. రుణ ప్రక్రియ సులభతరం చేయాల్సిన అవస రాన్ని వివరించారు. ఇదే అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు బ్యాంకు అధికారులతో చర్చించి ఎస్ఎల్‌బీఎస్‌లో చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. సీఎం లక్ష్యానికి అనుగుణంగానే ఈ రోజు ఈ సమావేశం ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎంఎస్ఈ సీడీపీ, పీఎంఈజీపీ పథకాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఏపీ క్లస్టర్ డవలప్‌మెంట్ ప్రోగ్రామ్, ఏపీ చీఫ్ మినిస్టర్ ఎంటర్ ప్రెన్యూర్ ప్రోగ్రామ్ అమలు చేసేం దుకు వివిధ బ్యాంకర్ల సహాయ సహకారాలు కోరుతున్నామని తెలిపారు. రుణాలను సీజీటీఎంఎస్ఈ (క్రెడిట్ గ్యారెంటీ ట్రస్ట్ ఫర్ మైక్రో అండ్ స్మాల్ ఎంటర్‌ప్రైజెస్)లో కవర్ చేయడంలో మన రాష్ట్రం దేశంలోనే 4వ స్థానంలో ఉందని.. దీనిని గౌరవ ముఖ్యమంత్రి కోరిక మేరకు మొదటి స్థానంలోకి తీసుకువచ్చేం దుకు బ్యాంకర్లు సహకారం అందించాలని కోరారు. ఎంఎస్ఎం ఈ అధారిత అసోసియేషన్ల సందేహాలను బ్యాంకర్లు నివృత్తి చేసి బ్యాంకు ద్వారా లభ్యమయ్యే సదుపాయాలు వారికి వివరించారు. ఎంఎస్ఎంఈ ఔత్సాహికులకు రుణం దరఖాస్తు కోసం ప్రభుత్వం యూనీఫైడ్ పోర్టల్ తయారు చేసి వాళ్లకు అందుబాటులోకి తీసు కురావాలని పరిశ్రమల శాఖ కార్యదర్శికి సూచించారు. ఈ సమా వేశంలో ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ శ్రీధర్‌బాబు, ఇండస్ట్రీస్ సెక్రటరీ డాక్టర్ ఎన్.యువరాజ్, ఎంఎస్ఎంఈ డవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో విశ్వమనోహరన్, ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎగ్జిగ్యూటివ్ డైరెక్టర్ సుధాకర్, ఎంఎస్ఎంఈ జాయింట్ డైరెక్టర్ విజయరత్నంతో పాటు ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ పొట్లూరి భాస్కరరావు, క్రెడాయ్ జీఎస్ మోహన్‌రావు, ఫుడ్ ప్రాసెసింగ్ సాంబశివరావు, రాజశేఖర్, కోవై రాధిక, ఏపీ టెక్స్‌టైల్స్ మిల్స్ అసోసియేషన్ సెక్రటరీ యూఎం. కుమార్, వివిధ రాష్ట్రస్థాయి బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

## రెన్యువబుల్ ఎనర్జీ జోన్‌కు తొలి అడుగు

- **అద్దంకి నియోజకవర్గంలో**
- **భూసేకరణ ప్రక్రియ ప్రారంభం**
- **37 మందికి పరిహారం పంపిణీ**
- **పూర్తయితే మరింత పారిశ్రామికాభివృద్ధి**
- **యువతకు ఉద్యోగ అవకాశాలు**



అద్దంకి (చైతన్యరథం): దేశంలోనే మొట్టమొదటగా రెన్యువబుల్ ఎనర్జీ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్ (ఆర్ఈఎంజడ్) ఏర్పాటుకు తొలి అడుగు పడింది. దీంతో అద్దంకి నియోజకవర్గం రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. దీనిపై విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక దృష్టి సారించటంతో పరిశ్రమల ఏర్పాటులో కీలక భూమిక అయిన భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైంది. తొలుత 37 మంది రైతులకు సంబంధించి 175.41 ఎకరాల భూసేకరణ పూర్తిచేసి బుధవారం 31,57,38,000 రూపాయల చెక్కులను అందజేశారు. ఆర్ఈఎంజడ్ ఏర్పాటుకు బల్లికురవ మండలంలోని ఎస్ఎల్.గుడిపాడు, ముక్తేశ్వరం, సంతమాగు లూరు మండలంలోని ఈస్ట్ కుందుర్రు రెవెన్యూ పరిధిలో 1,036.93 ఎకరాల భూమిని గుర్తించారు. ఇందులో 116.85 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా ఇప్పటికే 114 ఎకరాలు నెడ్‌క్యాప్‌కు అప్పగించారు. సుమారు 920 ఎకరాల రైతుల పట్టా భూములు ఉన్నాయి. జిల్లా అధికారులు పలు దఫాలు ఆయా గ్రామాల రైతులతో చర్చలు నిర్వహించి ఎకరాకు రూ.18 లక్షల చొప్పున పరిహారం చెల్లించేలా నిర్ణయించారు.

ఈ నేపథ్యంలో తొలి విడతగా ముక్తేశ్వరానికి చెందిన 8 మంది, ఎస్ఎల్ గుడిపా డుకు చెందిన 13 మంది, ఈస్ట్ కుందుర్రుకు చెందిన 16 మంది రైతులకు పరిహారం అందజేశారు. మిగిలిన రైతులకు కూడా త్వరలో పరిహారం అందజేసేందుకు అధికారులు కసరత్తు చేస్తు న్నారు. ఆర్ఈఎంజడ్ ఏర్పాటుకు భూసేకరణ జరుగుతుండటం తో త్వరలో తయారీ యూనిట్‌లు ఏర్పాటయ్యే అవకాశం ఉంది. నిర్మాణ పనులు ప్రారంభమైనప్పటి నుంచి స్థానికులకు ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. రాయలసీమ, పశ్చిమ ప్రకాశంలో ఆర్ఈఎంజడ్‌కు అవకాశాలు మెండుగా ఉన్నప్పటికీ అద్దంకి నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో మంత్రి రవికుమార్ పట్టుబట్టి ఇక్కడ ఏర్పాటు చేయిస్తున్నట్లు తెలుస్తోంది. జాతీయ రహదారులు అందుబాటులో ఉండటం, రామాయపట్నం ఫోర్ట్ కూడా సమీపంలో ఉండటంతో ఆర్ఈఎంజడ్ ఏర్పాటుకు మార్గం మరింత సుగమమైంది. అద్దంకి నియోజకవర్గంలో ఇప్పటికే ఇటుక, గ్రానైట్ పరిశ్రమలతో గుర్తింపు ఉండగా, ఆర్ఈఎంజడ్ ఏర్పాటుతో దేశంలోనే మరింత గుర్తింపు రానుంది.

# జగన్‌రెడ్డి అడుగు బయటపెడితే విధ్వంసం




- పరామర్శల పేరుతో గొడ్డలి పార్టీ అరాచకాలు
- బయటకొస్తే మహిళలకు రక్షణ ఉండదు
- సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు
- రెండేళ్ల ఆయన పర్యటనల్లో అమాయక పేదల బలి
- ప్రజలకు ఉపయోగపడే ఒక్క పనైనా చేస్తున్నారా
- భస్మాసురుడికి పట్టిన గతే పడుతుంది
- యువతను గొడ్డలి పార్టీకి దూరంగా ఉంచాలి
- హోంమంత్రి వంగలపూడి అనిత

అమరావతి (చైతన్యరథం): వైసీపీ అధినేత జగన్‌రెడ్డిపై హోం మంత్రి వంగలపూడి అనిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత నుంచి పరామర్శల పేరుతో జగన్ సృష్టించిన విధ్వంసాన్ని మీడియా సమావేశంలో ఎండగట్టారు. ఆయన పర్యటనల్లో సృష్టించిన అరాచకాల వీడియోలను ప్రదర్శిం చారు. తన రాజకీయం కోసం పేదలను గొడ్డలి పార్టీ అధ్యక్షుడు ఇబ్బంది పెడుతున్నారని ధ్వజమెత్తారు. రెండేళ్లలో జగన్ చేసిన పర్యటనలతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని వెల్లడించారు. పరామర్శల పేరుతో విధ్వంసం, అరాచకం సృష్టిస్తున్నారని ధ్వజ మెత్తారు. ఆయన భూటకపు పరామర్శలు చేస్తూ ప్రజలను ఇబ్బం దులు పెడుతున్నారని మండిపడ్డారు. మంచి, చెడు రెండింటిని ప్రజలు గమనిస్తారని తెలిపారు. ఈ రెండేళ్లలో రెండు వేర్వేరు నడవడిక ఉన్న నాయకులను ప్రజలు చూశారని చెప్పుకొచ్చారు.

**చంద్రబాబు రోజుకు 18 గంటలు కష్టపడుతున్నారు**

సీఎం చంద్రబాబు రోజుకు 18 గంటలు కష్టపడుతున్నారని వ్యాఖ్యానించారు. సీఎం కృషితోనే పరిశ్రమలు, పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్నాయని వివరించారు. ఏపీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కూడా సపోర్టు చేస్తోందని వెల్లడించారు. మరోవైపు గొడ్డలి పార్టీ అధ్యక్షుడు బయట అడుగుపెడితే విధ్వంసం, అరా చకం జరుగుతోందని ఆగ్రహించారు. ఆయన బయట అడుగుపె డితే మహిళలకు రక్షణ లేదని, సామాన్య ప్రజలు వ్యాపారాలు చేసుకోలేరని చెప్పుకొచ్చారు. పోలీసులను సైతం బెదిరించి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆగ్రహించారు. ఏపీలో అభివృద్ధిని చూసి ఓర్వలేక ఏదో ఒక పరామర్శ పేరుతో ప్రజలను ఇబ్బంది లు పెడుతున్నారని దుయ్యబట్టారు. భవిష్యత్తు మన బిడ్డలదని... మన చుట్టూ ఎలాంటి నాయకులు ఉన్నారో గమనించాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ధర్నాలు, నిరసనలు చేసే హక్కు ప్రతిపక్షానికి ఉందని చెప్పుకొచ్చారు. ఆ పార్టీ నేతలు బాధ్యతాయు తమైన ప్రశ్నలు అడగాలని.. తాము సమాధానం చెబుతామని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే ఏ ఒక్క పనినైనా ఆయన చేస్తున్నారా ప్రజలు ఆలోచించాలని పేర్కొన్నారు.

**దిశా చట్టం లేకుండానే పోలీస్ స్టేషన్లు పెట్టారు**

దిశా బిల్లు ఉపసంహరణపై హోంమంత్రి అనిత మాట్లాడారు. జగన్ హయాంలో దిశా చట్టం లేకుండానే పోలీసుస్టేషన్లు పెట్టార ని, పోలీసులకు బాధ్యతలు ఇచ్చారని చెప్పుకొచ్చారు. పోలీసులకు ఫింగర్ ప్రింట్ అథంటికేషన్ ఎక్విప్‌మెంట్ కూడా వైసీపీ హయాంలో ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. జగన్ పర్యటనలో ఎంతమంది వస్తారు, బారికేడ్లు ఎంత ఎత్తులో ఉండాలో పోలీసు లే చెబుతారని పేర్కొన్నారు. చట్టాలను గౌరవించే వారికి అవి వర్తిస్తాయని చెప్పారు. వారు నిబంధనలను ఎందుకు పాటించడం లేదని ప్రశ్నించారు. విధ్వంసం సృష్టించాలనే ఆయన బయటకు వస్తున్నారని మండిపడ్డారు. 2019కు ముందు ఒక్క ఛాన్స్ అని చెప్పి అరాచకం సృష్టించారని ఆగ్రహించా రు. శు క్రవారం వస్తే చాలు ఎవరిని జైల్లో పెడతారో తెలియని పరిస్థితి వైసీపీ హయాం లో ఉందని ఆరోపించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన దగ్గర నుంచి తాము చేసిన అభివృద్ధి, సంక్షేమ పనుల గురించి చెప్పుకోవడానికి ఎన్ని పేజీలైనా సరిపోవని తెలిపారు. ఏపీలో జరుగుతున్న అభివృద్ధిని జగన్ చూడలేకపోతు న్నారని దుయ్య బట్టారు. ఆయన ఎక్కడికి వచ్చినా విధ్వంసాలు, ఉద్రేకాలు సృష్టిస్తున్నారని ఫైర్ అయ్యారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అనుసరించే తాము చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ప్రజలు ఈ రెండేళ్లలో ప్రశాంతంగా ఉన్నారా? లేదా? అని ప్రశ్నించారు. జగన్ వెనుక ఉన్నది జెన్‌జీలు కాదని.. గంజాలు అని ఎద్దేవా చేశారు.

**జగన్‌కు అర్హత మేరకే సెక్యూరిటీ కల్పించాం**

జగన్‌కు అర్హత మేరకే సెక్యూరిటీ కల్పించామని స్పష్టం చేశారు. డీఎస్సీ విషయంలో ఎలాంటి అవకతవకలు జరగలేదని కోర్టులు చెప్పాయని ప్రస్తావించారు. అయినా ఏమీలేని దానికి డీఎస్సీని భూతద్దంలో జగన్ అండ్ కో చూపుతున్నాయని ధ్వజమెత్తారు. వైసీపీ నేతలకు మంత్రి నారా లోకేష్ అంటే భయమని విమర్శిం చారు. ఆ పార్టీ చేపట్టిన డీఎస్సీ ధర్నాలో ఎంతమంది అభ్యర్థులు ఉన్నారని నిలదీశారు. గొడ్డలి పార్టీ విన్యాసాలను చూసి రాష్ట్రం సిగ్గుపడుతోందని విమర్శించారు. భస్మాసురుడికి అహం తలకెక్కి నట్లే జగన్ ప్రవర్తన ఉందని ఎద్దేవా చేశారు. ఆయనకు ఒక్క అవకాశం ఇచ్చిన ప్రజల నాశనాన్ని కోరుకున్నారని ఆగ్రహించారు.

**భస్మాసురుడికి పట్టిన గతే జగన్‌కి పడుతుంది**

భస్మాసురుడికి పట్టిన గతే గొడ్డలి పార్టీ అధ్యక్షుడికి పడుతుందని సెటైర్లు గుప్పించారు. విజనరీ నాయకుడు చంద్రబాబు ఏపీని అభివృద్ధి చేస్తున్నారని ఉద్ఘాటించారు. ఆయన విధ్వంసం, అరాచ కాలు సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. జగన్ పర్యటనల్లో సామా న్యుల జీవితాలను ఇబ్బంది పెట్టారని, వారి ఆస్తులను విధ్వంసం చేశారని మండిపడ్డారు. మిర్చి రైతుల పరామర్శ పేరుతో గుంటూ రు మిర్చియార్డుకు వెళ్లి రైతులను తన బౌన్సర్లతో కొట్టించారని ఆగ్రహించారు. మిర్చి టిక్కీలను ఫ్యాన్ పార్టీ నేతలు దొంగతనం చేశారని ఆరోపించారు. పరామర్శ పేరుతో బల ప్రదర్శనలు చేసి రైతులను కొట్టి.. దొంగతనాలు చేస్తారా? ఇదేం తీరు? అని ప్రశ్నించారు. గంజాయి తాగండి... మహిళలను ఏడ్పించండి అని జగన్ జనాలకు చెప్పాలనుకుంటున్నారా? అని ఎద్దేవా చేశారు. జగన్ సొంత బాబాయ్ హత్యలో ఆయన వ్యవహరించిన తీరు చూశారని తెలిపారు. తల్లిదండ్రులు యువతను గొడ్డలి పార్టీ కార్యక్రమాలకు పంపొద్దని సూచించారు.

# రైతుల పట్ల జగన్‌ది కపట ప్రేమ!

వైసీపీ అధినేత జగన్ రెడ్డి అధికారం కోసం అలమటించి పోతున్నారు. ఆయన దిగిపోగానే రైతులకు కష్టాలు వచ్చినట్లు అభినయాలు ప్రదర్శిస్తున్నారు. ఆయన పాలనలో రైతులకు నమ్ముకున్న నాగళ్లే ఉరి కొయ్యలుగా మారిన విషయాన్ని గుర్తించాలి. అధికారంలో వున్నప్పుడు పరదాలు కట్టుకొని తిరుగుతూ ప్రజలు, రైతుల ముఖం చూడటానికి కూడా ఇష్టపడని పెద్దమనిషి నేడు రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తూ పొగాకు రైతులకు మద్దతుగా బయలు దేరడం ఆయన దళారి తనానికి అద్దం పడుతుంది. తన బాధని రైతుల బాధగా చిత్రించాలని చూస్తున్నారు. ఐదేళ్ళ అధికారంలో ఉండి పొగాకు రైతులకు తాను చేసిన మేలు ఏమిటో జగన్ ఆత్మ పరిశీలన చేసుకోవాలి. వారికి గిట్టు బాటుధర కాదు, మద్దతు ధర కూడా దక్క లేదు. రైతుల జీవితాలను నాశనం చేసి, వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టిన జగన్ రెడ్డి ఉన్నఫళంగా రైతు బాంధవుడి అవతారం ఎత్తగానే రైతులు ఆయన వెంట పరుగులు తీస్తారు అనుకోవడం అత్యాశే అవుతుంది. రైతుల ఉసురు తగిలే 2024లో జరిగిన ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదన్నది వాస్తవం. జగన్ రెడ్డి జపించేది రైతు ప్రయోజనం, తపించేది మాత్రం తన ప్రయోజనం. రాష్ట్రంలో పొగాకు రైతులు ఎదుర్కొంటున్న అంతర్జాతీయ మార్కెట్ సమస్యలను, ధరల సరళిని తన రాజకీయ లబ్ది కోసం వాడుకుంటూ, కూటమి ప్రభుత్వంపై అవాస్తవ, నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం పై విమర్శలు చేసే ముందు అయిదేళ్ల వైసీపీ పాలనలో రైతులు పడ్డ నరక యాతనను జగన్ ఒకసారి గుర్తు తెచ్చుకోవాలి. పొగాకు ధరలు కేవలం రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణలో ఉండవు. అది పూర్తిగా అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్, ఎగుమతులు, టొబాకో బోర్డు (భారత ప్రభుత్వ రంగ సంస్థ) ఆధ్వర్యంలో నడిచే ప్రక్రియ. ప్రపంచవ్యాప్తంగా డిమాండ్‌లో వచ్చే మార్పుల వల్ల ధరల్లో హెచ్చుతగ్గులు సహజం. గతంలోనూ గ్లోబల్ మార్కెట్‌లో డిమాండ్ తగ్గినప్పుడు ధరలు మారిన ఉదాహరణలు స్పష్టంగా ఉన్నాయి. దీనిని కావాలనే కూటమి ప్రభుత్వానికి ఆపాదిస్తూ రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం జగన్ కుట్ర రాజకీయాలకు నిదర్శనం.

**రైతుల బలహీనతలను అడ్డం పెట్టుకుని..**

వర్జీనియా పొగాకు పంట సాగు, వేలాలు, కొనుగోళ్ల అన్నీ కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని టొబాకో బోర్డు నియమ, నిబంధనల ప్రకారమే జరుగుతాయి. బోర్డు నిర్దేశించిన పరిమితులు, మార్కెట్ సిండికేట్లు లేదా అంతర్జాతీయ కొనుగోలుదారుల వ్యాపార ధోరణులపై మాట్లాడని జగన్, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం సీఎం చంద్రబాబు నాయుడుపై నిందలు వేయడం సిగ్గుచేటు. జగన్ పాలనలో జరిగిన మోసాలను రైతులు ఇంకా మరచిపోలేదు. నాణ్యత లేని పొగాకును కొనుగోలు చేస్తామని చెప్పి చివరికి రైతులను రోడ్డున పడేసింది వైసీపీ ప్రభుత్వం కాదా? ఈ-నామ్ వేలం ప్రక్రియలోనూ, బార్న్ ల అనుమతుల్లోనూ రైతులు పడిన ఇబ్బందులు జగన్ పాలనలో తారస్థాయికి చేరాయి. నేడు కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు ముందుకు వచ్చింది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగాన్ని గాడిన పెట్టేందుకు, రైతులకు అండగా నిలిచేందుకు నిరంతరం కృషి చేస్తోంది. ధరల స్థిరీకరణ అంశంలోనూ, టొబాకో బోర్డు అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ రైతులకు గరిష్ట ప్రయోజనం చేకూర్చేలా చర్యలు తీసుకొంటున్నది. జగన్ రెడ్డి కేవలం రాజకీయ ప్రయోజనాలకోసం రైతుల బలహీనతలను అడ్డం పెట్టుకుని మొసలి కన్నీరు కారుస్తూ రైతులు పై కపట ప్రేమ చూపిస్తున్నారు. అధికారం కోల్పోయి నిరాశ, నిస్పృహలో ఉన్న జగన్ రెడ్డి ప్రతీ అంశాన్ని రాజకీయం చేస్తూ రైతులను మభ్యపెట్టాలని చూస్తున్నారు. పొగాకు రైతుల సంక్షేమం పట్ల కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులను వక్రీకరించి రైతులను రెచ్చగొట్టే ప్రయత్నాలను రాష్ట్ర ప్రజలు, రైతులు గమనిస్తూనే ఉన్నారు.

**ఆదుకున్నది తెలుగుదేశం ప్రభుత్వమే**

పొగాకు రైతుల సమస్యల పట్ల జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవాలు. నిజంగా పొగాకు రైతుల పట్ల బాధ్యత ఉంటే వాస్తవాలు, గణాంకాలతో బహిరంగ చర్చకు రావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు బహిరంగ సవాల్ విసిరారు. రైతులపై నిజమైన ప్రేమఉంటే ఆ సవాలును స్వీకరించి రైతుల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. పొగాకు రైతులు సంక్షోభంలో ఉన్న ప్రతిసారీ వారిని ఆదుకున్నది తెలుగుదేశం ప్రభుత్వమే అని జగన్ తెలుసు కోవాలి. గత ఏడాది బర్లీ పొగాకు రైతుల నుంచి 25 మిలియన్ కిలోల పొగాకును కొనుగోలు చేసి, సుమారు రూ.280 కోట్లు ఖర్చు చేసింది. 2014-15లో కూడా ఎఫ్‌సీవీ పొగాకు ధరలు పడిపోతే, వాణిజ్య పంట అయినప్పటికీ రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో ప్రతి కిలోకు రూ.20 ఆర్థిక సహాయం అందించింది. చరిత్రలోనే ఇది ఒక కీలక నిర్ణయం. గత జగన్ ప్రభుత్వ హయాంలో 2019 లో సుమారు 124 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి కాగా, ధర కిలోకు రూ.121-123కు పడిపోయింది. అయినా జగన్ ప్రభుత్వం కేవలం 11.8 మిలియన్ కిలోలను మాత్రమే కొనుగోలు చేసి మిగిలిన పంటను గాలికి వదిలేసింది మర్చి పోయారా? తర్వాత ఏడాది సుమారు 128 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి అయింది. ధర కిలోకు రూ.123కు పడిపోయినా జగన్ ప్రభుత్వం ఒక్క కిలో కూడా కొనుగోలు చేయలేదు. రైతులకు ఎలాంటి అదనపు ఆర్థిక సహాయమూ చెయ్యలేదు. పొగాకు ధరల విషయంలో వాస్తవాలు ఇలా ఉంటే జగన్ పొగాకు రైతులను ఉద్ధరించినట్లు చెప్పుకోవడం సిగ్గు చేటు. పొగాకు 2019లో కేజీ రూ.142 - 2020లో రూ.140- 2021లో రూ.161- 2022లో రూ.192- 2023లో రూ.248-2024 లో కూటమి ప్రభుత్వ హయాంలో రూ.326- 2025లో రూ.300- 2026లో రూ.275 ధర పలుకుతుంది..

**రాజకీయానికి రాక్షసత్వానికి తేడా తెలియని జగన్ రెడ్డి!**

ఈ ఏడాది టొబాకో బోర్డు లక్ష్యం 131 మిలియన్ కిలోలు మాత్రమే కాగా, రైతులు సుమారు 241 మిలియన్ కిలోలు ఉత్పత్తి చేశారు. అధిక ఉత్పత్తితో ఇబ్బందులు ఎదురైన రైతులను ఆదుకోవడానికి కూటమి ప్రభుత్వ సిద్ధమై సుమారు 100 మిలియన్ కిలోల పొగాకుకు ప్రతి కిలోకు రూ.10 చొప్పున మొత్తం రూ.100 కోట్ల ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించింది. అంతేకాదు అంచనాకు మించి పొగాకు వచ్చినా, దానికి కూడా ప్రతి కిలోకు రూ.10 చొప్పున సహాయం అందించడానికి ప్రభుత్వం ముందుకొచ్చింది. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు, కేంద్ర ప్రభుత్వం ప్రతి పొగాకు బ్యారన్‌కు రూ.50,000 వడ్డీలేని రుణం అందించాలని నిర్ణయించాయి. పొగాకు రైతుల ఇబ్బందులు నిజమే. రైతుకు గిట్టుబాటు ధర రావాలనే ఆకాంక్ష అందరిదీ. అయితే రైతు సమస్యలను రాజకీయ ఆరోపణలకు వేదికగా మార్చడం దారుణం. పొగాకు సాధారణ వ్యవసాయ పంట కాదు. ఇది అంతర్జాతీయ మార్కెట్‌తో అనుసంధానమై ఉంటుంది. ఎగుమతి ఆర్డర్లు తగ్గినా, ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ తగ్గినా, ఉత్పత్తి ఎక్కువైనా ధరలపై ప్రభావం పడుతుంది. ఈ వాస్తవాలను విస్మరించి రాష్ట్ర ప్రభుత్వమే ధరలు నిర్ణయిస్తుందని చెప్పడం సరైనది కాదు. ఒక సీజన్‌లో ఉత్పత్తి అధికంగా ఉండి, కొనుగోలుదారులు తక్కువగా ఉంటే వేలం ధరలు సహజంగానే తగ్గుతాయి. కావున రైతు కష్టాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకోవడం కంటే, రైతుకు ఉపయోగపడే పరిష్కారాలు సూచించడం ప్రతిపక్ష బాధ్యత. ఏది ఏమైనా ఇత్తడిని ఎంత తోమినా పుత్తడిగా మారదు అన్నట్లు జగన్ కూడా అంతే. రాజకీయానికి రాక్షసత్వానికి తేడా తెలియని జగన్ రెడ్డి ఎంత నటించినా రైతు పక్షపాతి మాత్రం కాలేరు.


- నీరుకొండ ప్రసాద్

# ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వం - కూటమి ప్రభుత్వం

సమాజ నిర్మాణంలో ప్రభుత్వ ఉద్యోగులు కేవలం ఉద్యోగులు మాత్రమే కాదు... రాష్ట్ర అభివృద్ధికి మూల స్తంభాలు. విద్య, ఆరోగ్యం, రైతు సంక్షేమం, పరిపాలనా సేవలు అన్నింటిలోనూ వారి నిజాయితీ, కృషి, బాధ్యతాయుత పనితీరే ప్రజల జీవితాలను మార్చే శక్తి. ఉద్యోగులు బలంగా ఉంటేనే ప్రభుత్వం బలపడుతుంది, సమాజం ముందుకు సాగుతుంది. అలాంటి ఉద్యోగులను గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి వారిని చీకటి రాజ్యంలోకి నెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగా లేకపోయినా ఉద్యోగులకు సంక్షేమ సారథిగా నిలిచి, 'ఇది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వం' అని నిరూపించింది. 10,715 మంది ప్రభుత్వ ఉద్యోగుల 23 ఏళ్ల కలను, ఆకాంక్షలను నెరవేర్చి చారిత్రక నిర్ణయం తీసుకున్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. సీపీఎస్ నుంచి ఓపీఎస్‌కు మార్చడం ద్వారా ఆ ఉద్యోగుల జీవితాల్లో కొత్త ఆశలు నింపారు. ఓపీఎస్ నిర్ణయంతో ఒక్కో సీపీఎస్ ఉద్యోగికి వారి హోదా, సర్వీసు కాలాన్ని బట్టి రూ.1 కోటి నుంచి రూ.3 కోట్ల వరకు లబ్ధి లభిస్తుంది. కేంద్ర ప్రభుత్వం 2020, 2023లో ఇచ్చిన స్పష్టమైన మార్గదర్శకాలను అమలు చేసిన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ మొదటిది. ఉద్యోగులకు పెండింగ్ డీఏలను 2024 నుంచి 2027 వరకు 16 విడతల్లో ఉద్యోగులకు చెల్లిస్తామని హామీ ఇచ్చింది.

గత ప్రభుత్వం పెట్టిన బకాయిల్లో రూ.30,849 కోట్లు విడుదల చేసి ఉద్యోగులకు అండగా నిలిచారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. ఎన్నికల సమయంలో రెండు డీఏలు ప్రకటించి ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా గత ప్రభుత్వం చేతులు దులుపుకుంటే.. కూటమి ప్రభుత్వం ఆ రెండు డీఏలతో పాటు మరో డీఏ కూడా చెల్లించి ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు సకాలంలో చెల్లించి, సీపీఎస్ మ్యాచింగ్ గ్రాంట్ జమ చేసి, సచివాలయంలో సీపీఎస్ ఉద్యోగులకు 60 నెలల డీఏ బకాయిలు చెల్లించింది.

పదవీ విరమణ పొందిన తరువాత పెండింగ్ బిల్లులు రూ.7,358 కోట్ల మేర విడుదల కాని ఉద్యోగులు కుటుంబాలకు అండగా నిలిచారు సీఎం




కరెంట్ అనాలిసిస్
తెలుసుకుందాం | విశ్లేషిద్దాం | సిద్ధమవుదాం
- మంగినపల్లి ఎలీషా, అనలిస్ట్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్

చంద్రబాబు నాయుడు. ఇందులో ప్రావిడెంట్ ఫండ్ బకాయిలు రూ.1,848 కోట్లు ఇప్పటికే ఉద్యోగుల ఖాతాల్లో జమ అయ్యాయి. అలాగే గ్రాట్యుటీ కింద రూ.3,411 కోట్లు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ కింద రూ.1,800 కోట్లు విడుదలయ్యాయి. గ్రూప్ ఇన్సూరెన్స్, పోలీసు సరెండర్ లీవ్ వంటి ఇతర బకాయిలు కూడా ఇందులో భాగంగా ఉన్నాయి.

ఉద్యోగ సంఘాల భవిష్య నిధి, పెన్షన్ ప్రక్రియలను ఉద్యోగులకు అనుగుణంగా సులభతరంగా మార్చి కాగిత రహితం చేసింది. మినీ అంగన్వాడీలను మెయిన్ అంగన్వాడీలుగా మార్చింది. అంగన్‌వాడీ, ఆశ వర్కర్లకు అనేక సౌకర్యాలతో పాటు ప్రభుత్వ పథకాలు వర్తింపచేసింది. ఈ-డిపిసి మాడ్యూల్ ద్వారా ఉద్యోగుల ప్రమోషన్ల ప్రక్రియ ఆన్లైన్ చేసింది.

జీవో నెం 21 ద్వారా మహిళా ఉద్యోగుల ఉద్యోగుల వ్యక్తిగత జీవితాలలో సమతుల్యతను పెంపొందించే దిశగా, సర్వీసులో ఎప్పుడైనా పిల్లల సంరక్షణ సెలవులను (చైల్డ్ కేర్ లీవ్ ) పొందేందుకు వీలుగా పిల్లల వయోపరిమితిని తొలగించింది.

### 2014-19 టీడీపీ ప్రభుత్వంలో..

రాష్ట్ర విభజన జరిగి ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 10వ పీఆర్సీలో 43 శాతం ఫిట్‌మెంట్ అమలు చేశారు. 10 నెలల పీఆర్సీ బకాయిల ద్వారా ఒక్కో ఉద్యోగికి రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు లబ్ధి చేకూరింది. సీపీఎస్ ఉద్యోగుల కుటుంబాలకు గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్ మంజూరు చేసి దేశంలోనే మొట్టమొదటి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచింది. ఉద్యోగి మరణించిన సందర్భంలో కారుణ్య నియామకం అవకాశం లేనప్పుడు కుటుంబాలకు రూ.10 లక్షల వరకు ఎక్స్‌గ్రేషియా పెంచారు. విభజన తర్వాత కూడా హైదరాబాద్‌లో పొందుతున్న 30 శాతం, 24 శాతం హెచ్ఆర్ఏ, సీసీఏను కొనసాగించారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, పొరుగు సేవల ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్‌తో ఉద్యోగ భద్రత కల్పించారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేశారు.

### వైసీపీ హయాంలో అన్యాయం

ఐదేళ్ల పాలనలో సీపీఎస్ ఉద్యోగులపై గొడ్డలిపోటు వేసిన జగన్ రెడ్డి, కేంద్రం స్పష్టత ఇచ్చినా పట్టించుకోకుండా మానసిక క్షోభకు గురిచేశారు. 2019 ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తే వారం రోజుల్లో సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తామని మాట ఇచ్చి మోసం చేశారు. ఒక డీఏ కూడా సరిగ్గా ఇవ్వకుండా, డీఏలు-పీఆర్సీ-మెడికల్ బిల్లులు-ఈఎల్స్-సీపీఎస్ కాంట్రిబ్యూషన్‌ను ఎగ్గొట్టి, జీతాలు-పెన్షన్లు కూడా సమయానికి ఇవ్వకుండా ఉద్యోగులను వేధించారు. ఐఆర్ 27 శాతం కంటే 4 శాతం తగ్గించి 23 శాతం ఫిట్‌మెంట్ అమలు చేసి హెచ్ఆర్ఏలో కోతలు పెట్టారు. చరిత్రలో లేని విధంగా "రివర్స్ పీఆర్సీ" ఇచ్చి ఉద్యోగులను ఇబ్బందుల పాలు చేశారు. ఉద్యోగులు తమ జీతం నుంచి దాచుకున్న జీపీఎఫ్ సొమ్మును కూడా దారి మళ్లించారు. జగన్ దిగిపోయే నాటికి ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన వివిధ బకాయిలు రూ.28 వేల కోట్లు పెట్టారు. ఉద్యోగులను బానిసల మాదిరిగా మద్యం దుకాణాల వద్ద కాపలా పెట్టారు. అధికారంలో ఉన్న సమయంలో ఉద్యోగులను సెకండ్ గ్రేడ్ పౌరుల్లా చూశారు తప్ప, ప్రభుత్వ ఉద్యోగ సంఘాలను ఏ ఒక్క రోజు కూడా సీఎం హోదాలో జగన్ కలవలేదు, మాట్లాడలేదు. రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకపోగా, 2014-19లో చంద్రబాబు నాయుడు మంజూరు చేసిన అదనపు పెన్షన్ ను కూడా ఎత్తివేసి రిటైర్డ్ ఉద్యోగులకు తీవ్రమైన అన్యాయం చేశారు.

నాడు-నేడు ఉద్యోగుల సంక్షేమానికి అండగా నిలిచిన చంద్రబాబు నాయుడు.. ఉద్యోగుల దీర్ఘకాలిక కోరికను నెరవేర్చి వారి జీవితాల్లో వెలుగులు నింపారు. ఇది కేవలం నిర్ణయం కాదు, ఉద్యోగులపై నిజమైన ప్రేమ, బాధ్యత. ఉద్యోగుల పట్ల ఫ్రెండ్లీ ప్రభుత్వం అని చెప్పడానికి నిదర్శనం.

# మత్స్యకారుల రక్షణకు పెద్దపీట

- **చేపల వేటకు సాంకేతిక తోడు**
- **బోట్లకు ట్రాన్స్‌పాండర్ పరికరాలు**
- **ప్రమాద సమయంలో ఉపయోగకరం**
- **బటన్ నొక్కితే గస్తీ దళానికి సమాచారం**
- **మత్స్యకారుల జాడ తెలిపే టెక్నాలజీ**

ఒంగోలు (చైతన్యరథం): వేట సాగిస్తూ ఎంతోమంది మత్స్యకా రులు సంద్రంలోనే ప్రాణాలు కోల్పోతుంటారు. ఇక నుంచి మత్స్యకారుల ప్రాణాలకు భరోసా కల్పిస్తూ ఇస్రో తయారు చేసిన ట్రాన్స్‌పాండర్ అనే పరికరం వారికి అందుబాటులోకి రానుంది. ఈ పరికరం మత్స్యకారులకు ఎంతోమేలు చేయనుంది. వేట సాగించే సమయంలో ముప్పు ఏ విధంగా వచ్చినా కాపాడేందుకు ఈ పరికరం పనిచేస్తుంది. మత్స్యకారులు ఈ పరికరంలో ఉన్న బటన్ నొక్కితే చాలు ఆ సమాచారం తీరంలోని గస్తీ దళానికి, ఇతర రక్షణ రంగాలకు క్షణంలో చేరిపోతుంది. ఇలా సమాచారం అందిన వెంటనే ఆ బోటు ఏ ప్రాంతంలో ఉందో గుర్తించి అక్కడి కి గస్తీ దళాన్నో లేక ఇతర రక్షణ దళాన్నో పంపించి కాపాడతారు. ఇందుకోసం ఇస్రో శాస్త్రవేత్తలు రూపొందించిన ట్రాన్స్‌పాండర్‌ను మత్స్యకారులు వేట సాగించే అన్ని బోట్లకు అమర్చే ప్రక్రియ ప్రస్తుతం



కొనసాగుతోంది. ప్రధాన మంత్రి మత్స్యయోజన కింద కేంద్ర ప్రభుత్వం జిల్లాలోని అన్ని తీర ప్రాంతాల్లో ఉన్న మత్స్యకా రుల బోట్లకు వీటిని ప్రస్తుతం అమర్చుతోంది. వీటి విలువ రూ.30 వేలకు పైగానే ఉండగా ప్రభుత్వం ఉచితంగానే ఇస్తోంది.

### బహుళ ప్రయోజనాలు

ట్రాన్స్‌పాండర్‌లను మత్స్యకారులు వేటకు ఉపయోగించే ఇన్‌బోట్ మోటార్లు, అవుట్ బోట్ మోటార్లు, యంత్రీకరణ జరిగిన ఇతర రకాల బోట్లకు ప్రభుత్వం అమర్చుతుంది. ఈ పరికరం ఉన్న బోటులో వేట సాగించే మత్స్యకారులకు నిరంతరం సముద్రంలోని వాతావరణ సమాచారం చేరుతుంది. వేట సాగించే ప్రాంతంలో ప్రమాదకర పరిస్థితులు ఉంటే వెంటనే అప్రమత్తం చేస్తుంది. ఇక ప్రమాదంలో చిక్కుకుంటే వెంటనే ఆ విషయాన్ని గస్తీ దళాలకు, దగ్గర్లో ఉన్న అన్ని రక్షణ ప్రాంతాలకు క్షణాల్లో చేరవేస్తుంది. ప్రమాదస్థాయిని బట్టి వాయు మార్గంలో వెళ్లి కూడా రక్షించే అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తోంది.

### మత్స్య సంపద సమాచారం కూడా..

ఇప్పటివరకు మత్స్యకారులు రోజంతా సముద్రంలో వేట సాగిం చినా చేప పిల్ల కూడా వలకు చిక్కని ఘటనలు ఉన్నాయి. ప్రస్తు తం బోట్లకు అమర్చుతున్న ట్రాన్స్‌పాండర్ సముద్రంలో ఏదిశలో ఎక్కువగా జలపుష్పం సంచరిస్తుందన్న విషయాన్ని కూడా బోటు లోని మత్స్యకారులకు చేరవేస్తుంది. దీంతో ఆ దిశలోనే వేట సాగించే అవకాశం ఉంది. దీని ద్వారా మత్స్యకారులకు వేట ఇక నుంచి లాభదాయకంగా మారనుంది. సముద్రంలో కిలోమీటర్ల మేర వేట సాగిస్తూ డీజిల్ ఖర్చు, శ్రమ వృథా కాకుండా చేపలు పడే ప్రాంతంలోనే వేట సాగించి తక్కువ సమయంలోనే తిరిగి తీరానికి చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### ప్రకాశం జిల్లాలో రెండు వేల బోట్లు

మత్స్యశాఖ లెక్కల ప్రకారం ప్రకాశం జిల్లాలో రెండు వేల బోట్లు రిజిస్టర్ అయి ఉన్నాయి. తొలివిడత ప్రభుత్వం మత్స్యశాఖ ద్వారా ఈ బోట్లకు ట్రాన్స్‌పాండర్ పరికరాన్ని ఉచితంగానే అమర్చు తోంది. వాటిని వినియోగించే విధానాన్ని మత్స్యశాఖ అధికారులు వారికి వివరిస్తున్నారు. త్వరలోనే అన్ని బోట్లకు ట్రాన్స్‌పాండర్ సౌకర్యం అందుబాటులోకి వచ్చి మత్స్యకారులకు వేటలో దిక్సూచి లా సేవలు అందించటంతో పాటు వారి ప్రాణాలకు భరోసా కల్పించనుంది.

చైతన్యరథం




# డిజిటల్ విప్లవానికి రాజధానిగా విశాఖ

- డేటా సెంటర్ల నగరంగా గుర్తింపు
- 51 వేలకు పైగా ఉద్యోగాల సృష్టి
- 2.33 కోట్ల చదరపు అడుగుల రియల్ ఎస్టేట్ డిమాండ్
- ఏపీ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఇంధనం
- స్వేవ్ యార్డ్స్ తాజా నివేదికలో వెల్లడి

అమరావతి (చైతన్యరథం): "డేటా కొత్త చమురు" అంటున్న ప్రపంచం.. ఇప్పుడు ఆ డేటా భవిష్యత్తుకు కేంద్రంగా విశాఖ పట్నం వేగంగా రూపుదిద్దుకుంటోంది. ఒకప్పుడు పోర్ట్ సిటీగా గుర్తింపు పొందిన విశాఖ.. ఇప్పుడు దేశంలోనే అతిపెద్ద డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హబ్‌గా ఎదిగే దిశగా దూసుకెళుతోంది. ప్రపంచ వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ విశ్లేషణలకు పేరుగాంచిన స్వేవ్ యార్డ్స్ విడుదల చేసిన హౌ ఇండియా డేటా సెంటర్ రివల్యూషన్ ఈజ్ రీరైటింగ్ రియల్ ఎస్టేట్ నివేదికలో విశాఖ భవిష్యత్తుపై ఆశాజనకమైన అంచనాలు వెలువడ్డాయి. ఈ నివేది క ప్రకారం విశాఖలో ప్రతిపాదిత డేటా సెంటర్ ప్రాజెక్టులు 51,840 ఉద్యోగాలను సృష్టించనున్నాయి. అంతేకాదు ఈ అభివృ ద్ధి కారణంగా 2.33 కోట్ల చదరపు అడుగుల నివాస రియల్ ఎస్టేట్‌కు డిమాండ్ ఏర్పడనుంది.

**డేటా సెంటర్లు..ఉద్యోగాల మహా విప్లవం**

డేటా సెంటర్లు అంటే కేవలం కంప్యూటర్లు నిల్వ చేసే భవనాలు మాత్రమే కావు. అవి వేలాది ఉపాధి అవకాశాలకు, అనుబంధ పరిశ్రమలకు కేంద్ర బిందువులు. స్వేవ్ యార్డ్స్ నివేదిక ప్రకారం 3,240 ప్రత్యక్ష ఉద్యోగాలు, 48,600 పరోక్ష ఉద్యోగాలు సృష్టించబడనున్నాయి. నిర్మాణం, ఎలక్ట్రికల్ వర్క్స్, లాజిస్టిక్స్, వేర్‌హౌసింగ్, ట్రాన్స్‌పోర్ట్, హాస్పిటాలిటీ, రిటైల్, నిర్వహణ సేవ లు, సపోర్ట్ సర్వీసులు వంటి అనేక రంగాల్లో భారీస్థాయిలో ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి.

**రియల్ ఎస్టేట్‌కు భారీ ఊపు**

ఉద్యోగాల కోసం, వ్యాపార అవకాశాల కోసం వేలాది మంది విశాఖకు తరలిరానుండటంతో 2.33 కోట్ల చదరపు అడుగుల నివాస గృహాల డిమాండ్ ఏర్పడనుందని అంచనా వేసింది. కమర్షియల్ స్పేస్‌లకు భారీ అవసరం ఉందని తెలిపింది. వేర్ హౌస్‌లు, రిటైల్ సెంటర్లు, ఆధునిక పట్టణ మౌలికసదుపాయాల కు పెరుగుతున్న డిమాండ్ విశాఖ రియల్ ఎస్టేట్ రంగా న్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లనున్నాయి.

**ఏపీ అభివృద్ధికి కొత్త ఇంజన్**

ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ సేవల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో డేటా సెంటర్లు దేశ ఆర్థికాభివృద్ధికి కొత్త చోదకశక్తిగా మారుతున్నాయి. అలాంటి సమయంలో విశాఖలో ఇప్పటికే ప్రకటించిన అంతర్జాతీయ స్థాయి పెట్టుబడులు, డేటా సెంటర్ ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్‌ను దేశ డిజిటల్ మ్యాప్‌పై అగ్రస్థానంలో నిలబెట్టనున్నాయి. స్వేవ్ యార్డ్స్ నివేదిక ప్రకారం విశాఖ కేవలం డేటా సెంటర్ల నగరంగా మాత్రమే కాకుండా ఆంధ్రప్రదేశ్ తదుప రి మౌలిక సదుపాయాల ఆధారిత అభివృద్ధికి, భారీ ఉద్యోగాల సృష్టికి, ఆర్థిక పురోగతికి కేంద్రంగా మారే అవకాశాలు అత్యంత బలంగా ఉన్నాయి.



**విశాఖ చుట్టూ కొత్త ఆర్థిక ఎకోసిస్టమ్**

డేటా సెంటర్లు వచ్చిన చోట కేవలం ఒక పరిశ్రమ మాత్రమే పెరగదు..ఒక సంపూర్ణ ఆర్థిక వ్యవస్థ రూపుదిద్దుకుంటుంది. విద్యుత్ మౌలికవసతులు, ఫైబర్ కనెక్టివిటీ, యుటిలిటీ సేవలు, లాజిస్టిక్స్, కమర్షియల్ స్పేస్, వేర్‌హౌసింగ్, రిటైల్ వ్యాపారాలు, హోటళ్లు, సేవారంగం ఇలా అనేక రంగాల్లో పెట్టుబడులు వెల్లువె త్తనున్నాయని నివేదిక స్పష్టం చేసింది.







**భవిష్యత్ విశాఖదే.. భవిష్యత్ ఆంధ్రప్రదేశ్‌దే**

ఒకప్పుడు పరిశ్రమల నగరంగా గుర్తింపు పొందిన విశాఖ... ఇప్పుడు డిజిటల్ ఎకానమీకి హృదయంగా రూపుదిద్దుకుంటోంది. లక్షలాది యువతకు ఉద్యోగాలు, వేల కోట్ల పెట్టుబడులు, రియల్ ఎస్టేట్ వృద్ధి, అనుబంధ పరిశ్రమల విస్తరణ.. ఇవన్నీ కలిపి విశాఖను దేశంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న డిజిటల్ నగరాల్లో ఒకటిగా నిలబెట్టనున్నాయి. డేటా సెంటర్లతో ప్రారంభ మైన ఈ డిజిటల్ విప్లవం.. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు కొత్త బలాన్ని, యువతకు కొత్త భవిష్యత్తును అందించబోతోంది.


2 ఏళ్ల నమ్మకం
అభివృద్ధి, సంక్షేమం



**ఒక రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని కొలిచే ప్రధాన ప్రమాణాల్లో రహదారి మౌలిక వసతులు అత్యంత కీలకం. పరిశ్రమలు రావాలన్నా, వ్యవసాయ ఉత్పత్తులు మార్కెట్‌కు చేరాలన్నా, పర్యాటకం అభివృద్ధి చెందాలన్నా, గ్రామీణ ప్రాంతాలు పట్టణాలతో అనుసంధానం కావాలన్నా నాణ్యమైన రహదారులే బలమైన పునాది. అందుకే రోడ్లు కేవలం ప్రయాణ మార్గాలు మాత్రమే కాదు... ఒక రాష్ట్ర ప్రగతికి ప్రతీకలు. అయితే గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర రహదారులు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. వేల కిలోమీటర్ల మేర రోడ్లు గుంతలమయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహనచోదకులు ప్రమాదాలకు గురయ్యారు. రవాణా వ్యయం పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు మందగించాయి. ఈ పరిస్థితిని పూర్తిగా మార్చాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో రోడ్లు, భవనాల శాఖలో విస్తృత సంస్కరణలు చేపట్టింది.**

# 'స్మార్ట్' రహదారులు

- గుంతల నుంచి గ్లోబల్ ప్రమాణాల దిశగా రోడ్లు, భవనాల శాఖ వేగవంతమైన అడుగులు
- ఏఐ సాంకేతికత, నానో కాంక్రీట్‌తో మారుతున్న రహదారుల రూపురేఖలు
- ఏపీలో వేగంగా విస్తరిస్తున్న పారిశ్రామిక, ఈస్ట్-వెస్ట్ కనెక్టివిటీ కారిడార్లు
- 24 గంటల్లో రికార్డు స్థాయిలో బిటుమినస్ కాంక్రీట్ రోడ్డు నిర్మాణం
- గిన్నిస్ రికార్డులతో ప్రపంచవ్యాప్త గుర్తింపు



### మిషన్ పాత్ హోల్ ఫ్రీ

ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల నుంచి ఎక్కువగా వచ్చిన ఫిర్యాదుల్లో రహదారుల దుస్థితి ప్రధానంగా నిలిచింది. దీనిని అత్యవసర అంశంగా గుర్తించిన ప్రభుత్వం "మిషన్ పాత్ హోల్ ఫ్రీ" కార్యక్రమాన్ని ప్రారంభించింది. రూ. 861 కోట్ల వ్యయంతో రాష్ట్రవ్యాప్తంగా 20,060 కిలోమీటర్ల మేర రహదారుల మరమ్మతులకు శ్రీకారం చుట్టింది. 2024 నవంబరులో ప్రారంభమైన ఈ కార్యక్రమం కేవలం తొమ్మిది నెలల్లోనే గణనీయమైన ఫలితాలిచ్చింది. గుంతలతో నిండిపోయిన రహదారులు మళ్లీ ప్రయాణానికి అనువుగా మారాయి. ప్రజలకు తక్షణ ఉపశమనం లభించింది.

### రెండో ఏడాదిలో మరింత వేగం

రహదారుల నిర్వహణ ఒక నిరంతర ప్రక్రియ అనే దృక్పథంతో ప్రభుత్వం రెండో ఏడాది కూడా భారీ నిధులు కేటాయించింది. రూ.2,500 కోట్లతో 6,054 కిలోమీటర్ల మేర 922 రహదారి పనులను ప్రారంభించింది. ఇప్పటికే రూ.417.30 కోట్లతో 1,326 కిలోమీటర్ల మేర 221 పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు వేగంగా కొనసాగుతూ ఈ నెలాఖరుకు పూర్తికానున్నాయి. ప్రభుత్వం నిర్దేశించుకున్న 21,037 కిలోమీటర్ల లక్ష్యంలో ఇప్పటివరకు 20,967 కిలోమీటర్ల రహదారులను గుంతల రహితంగా మార్చడం ఈ కార్యక్రమ విజయాన్ని చాటుతోంది.

### టాస్క్‌ఫోర్స్‌తో నిలిచిపోయిన ప్రాజెక్టులకు ఊపు

రహదారి నిర్మాణాల్లో ప్రధాన ఆటంకాలైన భూసేకరణ, అటవీ అనుమతులు, కోర్టు వివాదాలు, శాంతిభద్రతల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసింది. దీని ద్వారా ఇప్పటివరకు 413 కిలోమీటర్ల ప్రాజెక్టులకు సంబంధించిన 2,640 ఎకరాల భూ సేకరణ సమస్యలు పరిష్కారమయ్యాయి. ఫలితంగా సంవత్సరాలుగా నిలిచిపోయిన అనేక ప్రాజెక్టులు మళ్లీ గాడిలో పడ్డాయి.

### రాబోయే ఏడాదికి భారీ కార్యాచరణ

రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ఇప్పటికే స్పష్టమైన కార్యాచరణ రూపొందించింది. రూ.2,083 కోట్లతో 4,728 కిలోమీటర్ల మేర 701 రహదారుల అభివృద్ధి, రూ.514.50 కోట్లతో 4,164 కిలోమీటర్ల మేర తీవ్రంగా దెబ్బతిన్న రహదారుల మరమ్మతులు చేపట్టనుంది. 2026-27 సంవత్సరానికి సాధారణ మరమ్మతుల ద్వారా 22,602 కిలోమీటర్ల మేర గుంతల రహదారులను పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించింది.

### గ్రామీణ రోడ్లు, వంతెనలకు ప్రత్యేక ప్రణాళిక

గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని రూ.439 కోట్లతో 398 కిలోమీటర్ల మేర 72 రహదారి పనులు చేపట్టనున్నారు. ఉమ్మడి గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో రూ.926.6 కోట్లతో 444.53 కిలోమీటర్ల మేర 430 సీసీ రోడ్లు నిర్మించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోయిన 13 వంతెనల నిర్మాణానికి రూ.85.68 కోట్లు, ప్రమాదకర స్థితిలో ఉన్న 124 వంతెనల పునర్నిర్మాణానికి రూ.1,480 కోట్లు కేటాయించడం ద్వారా భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

### పీపీపీ విధానంలో కొత్త రహదారి కారిడార్లు

ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంతో రాష్ట్రంలో 405 కిలోమీటర్ల మేర రూ.2,506 కోట్లు విలువైన ఆరు కీలక రహదారి ప్రాజెక్టులు ప్రతిపాదించబడ్డాయి. ఒంగోలు-బెస్తవారిపేట, నర్సీపట్నం-తాళ్లపాలెం, ప్యాపిలి-బనగానపల్లి, జమ్మలమడుగు-కొలిమిగుండ్ల, చిలకపాలెం-రాంభద్రాపురం-రాయగడ, సోమందేపల్లి-హిందూపూర్ కారిడార్లు భవిష్యత్ పారిశ్రామికాభివృద్ధికి బలమైన పునాదిగా నిలవనున్నాయి.

### సాంకేతికతతో స్మార్ట్ రోడ్ల వైపు

రహదారుల నిర్మాణం, నిర్వహణలో ప్రభుత్వం అత్యాధునిక సాంకేతికతను ప్రవేశపెడుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా డ్యాష్‌క్యామ్ సర్వేలు నిర్వహిస్తూ రహదారుల స్థితిని విశ్లేషించే పైలట్ ప్రాజెక్టు ప్రారంభమైంది. Eco-Fix టెక్నాలజీ ద్వారా వేగంగా గుంతల మరమ్మతులు, CRRI సహకారంతో తరచూ దెబ్బతినే రహదారులపై శాస్త్రీయ అధ్యయనాలు, IIT తిరుపతితో కలిసి నానో కాంక్రీట్ రోడ్ల నిర్మాణం, SRM యూనివర్సిటీతో ఫ్లైయాష్ వినియోగం, ప్లాస్టిక్ రోడ్లు, స్టీల్ స్లాగ్ మిశ్రమాలు వంటి వినూత్న ప్రయోగాలు భవిష్యత్ తరాలకు మన్నికైన రహదారులను అందించే దిశగా సాగుతున్నాయి. అదే విధంగా AI హ్యాకథాన్‌ల ద్వారా స్మార్ట్ పాట్‌హోల్ డిటెక్షన్, రాష్ట్రవ్యాప్తంగా రోడ్ నెట్‌వర్క్ డిజిటలైజేషన్ కార్యక్రమాలు కూడా ప్రారంభమయ్యాయి.

### జాతీయ రహదారుల్లో రికార్డు స్థాయి పురోగతి

రాష్ట్ర అభివృద్ధికి జాతీయ రహదారులు కీలకం. గత రెండేళ్లలో NHAI ఆధ్వర్యంలో 683 కిలో మీటర్ల జాతీయ రహదారులను రూ.14,570 కోట్లతో, MoRTH ఆధ్వర్యంలో 866 కిలోమీటర్ల రహదారులను రూ.8,755 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు. మొత్తంగా 1,549 కిలోమీటర్ల జాతీయ రహదారుల అభివృద్ధికి రూ.23,325 కోట్లు వెచ్చిస్తు న్నారు. ఇప్పటికే 61 ప్రాజెక్టుల ద్వారా 1,515 కిలోమీటర్ల జాతీయ రహదారులను రూ.35,799 కోట్లతో పూర్తి చేయడం రాష్ట్రానికి మరో ముఖ్యమైన విజయం. జాతీయ రహదారులపై కేంద్ర పెట్టుబ డుల విషయంలో చిన్న రాష్ట్రం అయిన ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ తర్వాత దేశంలో మూడో స్థానంలో నిలవడం రాష్ట్రానికి దక్కిన విశేష గౌరవం.

### భవిష్యత్ లక్ష్యాలు మరింత ప్రతిష్టాత్మకం

2026-27 సంవత్సరంలో రూ.12వేల కోట్లతో 784 కిలో మీటర్ల జాతీయ రహదారుల నిర్మాణాన్ని పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రూ.30,781 కోట్ల విలువైన 79 ప్రాజెక్టుల ద్వారా 1,467 కిలోమీటర్ల కొత్త జాతీయ రహదారులను పూర్తిచేసే దిశగా కార్యాచరణ కొనసాగుతోంది.


### స్వర్ణాంధ్రకు బలమైన రవాణా మౌలిక వసతులు

గత రెండేళ్లలో రోడ్లు, భవనాల శాఖలో జరిగిన మార్పులు కేవలం గుంతలు పూడ్చడం వరకు మాత్రమే పరిమితం కాలేదు. అత్యాధునిక సాంకేతికత వినియోగం, శాస్త్రీయ నిర్వహణ, పారదర్శక ప్రణాళిక, భారీ పెట్టుబడులు, జాతీయ రహదారుల విస్తరణ, ప్రపంచ స్థాయి నిర్మాణ ప్రమాణాలు, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కొత్త కారిడార్ల అభివృద్ధి... ఇవన్నీ కలిసి ఆంధ్రప్రదేశ్ రవాణా రంగానికి కొత్త దిశను చూపిస్తున్నాయి.

రోడ్లు మెరుగుపడితే ప్రయాణ సమయం తగ్గుతుంది. పరిశ్రమలకు రవాణా ఖర్చులు తగ్గుతాయి. రైతులకు మార్కెట్లు చేరువవుతాయి. పర్యాటకం విస్తరిస్తుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుంది. పెట్టుబడులు పెరుగుతాయి. ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయి. అందుకే రోడ్లు, భవనాల శాఖలో గత రెండేళ్లలో చేపట్టిన సంస్కరణలు కేవలం మౌలిక వసతుల అభివృద్ధి మాత్రమే కాదు... స్వర్ణాంధ్ర నిర్మాణానికి వేసిన బలమైన పునాదులుగా నిలుస్తున్నాయి.

**శశికుమార్**
తెలుగుదేశం సైనికుడు






### రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులు

రహదారుల నిర్మాణంలో వేగం, నాణ్యతకు ఆంధ్రప్రదేశ్ కొత్త ప్రమాణాలు సృష్టిస్తోంది. బెంగళూరు-కడప-విజయవాడ ఆరు వరుసల కారిడార్ నిర్మాణంలో NHAI-రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ సంయుక్తంగా రెండు గిన్నిస్ ప్రపంచ రికార్డులు సాధించాయి. 24 గంటల్లోనే 28.95 లేన్ కిలోమీటర్ల నిరంతర బిటుమినస్ కాంక్రీట్ రహదారి నిర్మాణం, 10,675 మెట్రిక్ టన్నుల బిటుమినస్ కాంక్రీట్ పరచడం ద్వారా ప్రపంచ స్థాయి గుర్తింపు లభించింది. ఇది దేశంలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్ సామర్థ్యాన్ని చాటిచెప్పింది.

# జీఎంఆర్ గ్రూప్ సంస్థ ఛైర్మన్‌ను కలిసి ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



విజయనగరం (చైతన్యరథం):జీఎంఆర్ గ్రూప్ ఛైర్మన్ గ్రంధి మల్లికార్జునరావుతో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు గురువారం భేటీ అయ్యారు. తన కుటుంబ సభ్యులతో కలిసి న్యూఢిల్లీలోని జీఎంఆర్ కార్పొరేట్ కార్యాలయంలో గ్రంధి మల్లికార్జునరావుని ఎంపీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మించిన ఆ సంస్థకు కలిశెట్టి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్న కూటమి ప్రభుత్వం

**● వేమూరు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు వెల్లడి**



వేమూరు (చైతన్యరథం): 'రెండేళ్ల నమ్మకం- అభివృద్ధి, సంక్షేమం' ప్రచారంలో భాగంగా వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు బాపట్ల జిల్లా చుండూరు మండలం తోట్టెంపూడి గ్రామంలో గురువారం ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన తల్లికి వందనం, మహిళా శక్తి, అన్నదాత సుఖీభవ, దీపం-2, ఎన్టీఆర్ భరోసా, సూపర్ సిక్స్ తదితర సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. తోట్టెంపూడి గ్రామంలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలతో పాటు గ్రామాభివృద్ధికి కూడా విశేష ప్రాధాన్యం ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. గ్రామాభివృద్ధిలో భాగంగా రూ.6 లక్షలతో నిర్మించిన సీసీ డ్రైన్లు, రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. రూ.8 లక్షలతో కమ్యూనిటీ హాల్ కాంపౌండ్ వాల్ నిర్మాణం పురోగతిలో ఉందన్నారు. ప్రజల సంక్షేమం, గ్రామాల సమగ్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నక్కా ఆనంద్బాబు తెలిపారు. తోట్టెంపూడిలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని, ఇవి గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తూ ప్రతి కుటుంబానికి భరోసా కల్పిస్తున్నాయని పేర్కొన్నారు.

# పరిశ్రమలకు ప్రోత్సాహం... మహిళలకు సాధికారత... ఇదే కేంద్రం కార్యాచరణ!

**●కృష్ణా జిల్లాలో కీలక క్లస్టర్ ప్రాజెక్టుల పురోగతిపై పూర్తి వివరాల వెల్లడి**

**●ఎంపీ కేశినేని శివనాథ్ ప్రశ్నకు కేంద్ర సహాయ మంత్రి శోభా కరంద్లాజే లిఖితపూర్వక సమాధానం**



న్యూఢిల్లీ/ విజయవాడ (చైతన్యరథం): ప్రజా సమస్యలు, ఉపాధి అవకాశాలు, పారిశ్రామికాభివృద్ధి, మహిళా సాధికారత వంటి అంశాలను పార్లమెంట్ వేదికగా నిరంతరం ప్రస్తావిస్తున్న విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ మరో కీలక అంశాన్ని లోక్‌సభలో లేవనెత్తారు. Micro & Small Enterprises--Cluster Development Programme (MSE-CDP) అమలుపై ఆయన అడిగిన ప్రశ్నకు కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే సమగ్ర లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో క్లస్టర్ ప్రాజెక్టుల అమలు నుంచి మహిళా పారిశ్రామికవేత్తల శిక్షణ వరకు పలు కీలక అంశాలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన వివరాలను సభ ముందుంచింది. చిన్ని ప్రశ్నల్లో దేశవ్యాప్తంగా, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో MSE-CDP కింద ఆమోదించిన క్లస్టర్ ప్రాజెక్టులు, వాటికి కేటాయించిన నిధులు, విడుదల చేసిన గ్రాంట్లు, వినియోగం, పనుల పురోగతి, మహిళా పారిశ్రామికవేత్తలకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, పథకం అమలులో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార చర్యలు వంటి కీలక అంశాలు ఉన్నాయి. దీనిపై కేంద్రం పూర్తి వివరాలను సభకు అందించింది.

**మహిళా సాధికారతకు కేంద్రం పెద్దపీట!**

ఈ సమాధానంలో ప్రత్యేకంగా నిలిచిన అంశం మహిళా పారిశ్రామికవేత్తలకు అందిస్తున్న ప్రోత్సాహం. కేంద్ర మంత్రి వెల్లడించిన వివరాల ప్రకారం, గత ఐదేళ్లలో 42,211 నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. వాటి ద్వారా 19,54,701 మందికి శిక్షణ అందించగా, వారిలో 6,66,327 మంది మహిళలు ఉన్నారు. వస్త్ర పరిశ్రమతో పాటు పలు రంగాల్లో మహిళలు స్వయం ఉపాధి క్లస్టర్లు ఏర్పాటు చేసుకునేలా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు కేంద్రం వెల్లడించింది. మహిళల ఆర్థిక స్వావలంబనకు, పారిశ్రామిక రంగంలో వారి భాగస్వామ్యాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఈ గణాంకాలు అద్దం పడుతున్నాయి.

# సీఎం చంద్రబాబు విజన్.. జగన్ పాయిజన్ : ఎమ్మెల్యేనసీర్



గుంటూరు (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌కు సీఎం చంద్రబాబు నాయుడు విజనరీ అని, జగన్ విధానం పాయిజన్ అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ ఛైర్మన్ నసీర్ అన్నారు. గురువారం స్థానిక 55వ వార్డు కాకుమానువారితోటలో రెండేళ్ల పాలనపై నమ్మకం-అభివృద్ధి, సంక్షేమంలో భాగంగా మన ఇంటికి-మన నసీర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ... రెండేళ్ల కాలంలో రాష్ట్రంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగాయని, ఒకవైపు పెట్టుబడుల ఆకర్షణ, మౌలిక సదుపాయాల కల్పన, ఉద్యోగావకాశాల సృష్టి కొనసాగుతుండగా మరోవైపు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకంటే ఎక్కువ స్థాయిలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని తెలిపారు. ప్రజల్లో ఎలాంటి అసంతృప్తి లేకుండా అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమన్వయం చేస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. సమాజంలో ఇప్పటికీ ప్రజలను తప్పుదోవ పట్టించే విధ్వంసకర శక్తులు ఉన్నాయని, అందుకే ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజలకు నేరుగా వివరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి బూత్, ప్రతి గడపకు చేరుకుని ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని తెలిపారు. వర్షాకాలంలో మోకాళ్ల లోతు నీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడిన పరిస్థితులను మార్చేశామన్నారు. డివిజన్ వ్యాప్తంగా రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టి దూర ప్రాంతాల వరకు మౌలిక సదుపాయాలు కల్పించామని తెలిపారు. స్థానికులు మా దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యనూ పరిష్కరిస్తున్నామన్నారు. సంక్షేమ రంగంలో తల్లికి వందనం, సీఎం రిలీఫ్ ఫండ్, ఉచిత వైద్య శిబిరాలు తదితర పథకాల ద్వారా ప్రజలకు అండగా నిలుస్తున్నామని చెప్పారు. శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించామని, గత ప్రభుత్వ హయాంలో దశాబ్దకాలంగా నిర్లక్ష్యానికి గురైన పూడికతీత పనులను ప్రత్యేక డ్రైవ్ ద్వారా పూర్తి చేశామని అన్నారు.

# విశాఖలో ఎమ్మెల్యే వెలగపూడి ఇంటింటి ప్రచారం

**● కూటమి పాలన చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించిన ప్రజాప్రతినిధి**



విశాఖ తూర్పు (చైతన్యరథం): నియోజకవర్గం 18వ వార్డు అప్పుఘర్ మరియు వాసవాణిపాలెం పరిసరాల్లో టీడీపీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం కార్యక్రమాన్ని తూర్పు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు చేపట్టారు. సదరు కార్యక్రమంలో గోలగాని పోలారావు, కారి రామారావు, వాసుపల్లి సింహాద్రి, పేర్ల హరి, వాసుపల్లి పోలారావు, కారి మురళి, టీడీపీ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి కూటమి ప్రభుత్వం చేపట్టిన రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికీ చేరేలా చూస్తామని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ అందుబాటులో ఉంటామని తెలిపారు.

# వావిలిపాడులో నూతన రామాలయ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి



శృంగవరపుకోట (చైతన్యరథం): మండల పరిధిలోని వావిలిపాడు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ సీతారామాలయ నిర్మాణ పనులను ఎస్.కోట శాసనసభ్యురాలు కోళ్ల లలిత కుమారి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు, గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి నిర్మాణ పనుల పురోగతిని, ఆలయ రూపకల్పనను పరిశీలించారు. గ్రామస్తులందరూ ఐకమత్యంతో ఇటువంటి పవిత్ర కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారాన్ని ఎల్లప్పుడూ అందిస్తానని ఈ సందర్భంగా ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మరియు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డీఎస్సీపై వైసీపీ అసత్య ప్రచారాలు మానుకోవాలి

**● ఏపీ విద్య సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు**



అమరావతి (చైతన్యరథం): 1996 నుండి 2025 వరకూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు పనిచేసిన కాలంలో తొమ్మిది సార్లుకు అత్యంత పారదర్శకంగా డీఎస్సీ పరీక్షలు నిర్వహించి 2,16,179 మంది ఉపాధ్యాయ నియామకాలను చేపట్టిన ఘనత ఆయనకు దక్కుతుందని ఏపీ విద్య సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు వ్యాఖ్యానించారు. గత వైకాపా పాలనలో విద్యా వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయిందని, విద్యార్థుల బ్యాగులు, బెల్టులు, పిల్లలు తినే చిక్కీలపై కూడా జగన్మోహన్ రెడ్డి ఫోటోలు వేసుకున్నారని మండిపడ్డారు. చదువులు చెప్పే గురువులను మద్యం దుకాణాల వద్ద కాపలా ఉంచడమే కాకుండా ఉపాధ్యాయులతో మరుగుదొడ్ల నిర్వహణ పనులు అప్పగించడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యా రంగంలో వినూత్న మార్పులు వచ్చాయన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 16 వేలకు మందికిపైగా ఉపాధ్యాయులను ఎంపిక చేయడం జరిగిందని, నో బ్యాగ్ డే, టీచర్ ట్రాన్స్ఫర్ యాక్ట్, సెంట్రలైజడ్ స్మార్ట్ కిచెన్, ఎన్ సి ఇ ఆర్ టి కరిక్యులం, బైలింగ్వల్ సిలబస్, తల్లికి వందనం, లీప్ స్కూల్, ఒకే తరగతి ఒకే టీచర్, విద్యా మిత్ర కిట్లు, మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్, ముస్తాబు కార్యక్రమం లాంటి ఎన్నో సంస్కరణలు తీసుకు వచ్చి దేశంలోనే ఆంధ్రప్రదేశ్ విద్యా వ్యవస్థను అగ్రగామిగా నిలిపిన కూటమి ప్రభుత్వానికి విద్యావ్యవస్థ పట్ల ఉన్న చిత్తశుద్ధిని తెలియజేశారని అన్నారు. మెగా డీఎస్సీపై ఆరోపణలు చేస్తున్న వైసీపీ నాయకులు దమ్ముంటే ఆధారాలు చూపించాలన్నారు.

# ఆపదలో ఉన్నవారికి సీఎంఆర్ఎఫ్ అభయ హస్తం

భీమవరం: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కుటుంబాలకు సీఎం సహాయనిధి అభయహస్తం వంటిదని రాజ్యసభ మాజీ సభ్యురాలు, భీమవరం నియోజకవర్గం టీడీపీ ఇన్‌ఛార్జ్ తోట సీతారామలక్ష్మి అన్నారు. భీమవరంలోని టీడీపీ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా వీరవాసరం మండలం నేలపోగుల గ్రామానికి చెందిన చింతపల్లి లీల కుమారికి నెలలు నిండకుండా పుట్టిన చిన్నారి చికిత్స నిమిత్తం రూ.5,04,895, భీమవరం మండలం ఎల్విన్పురానికి చెందిన మల్లాడి రాధకుమారి ఊపిరితిత్తుల వ్యాధి చికిత్స నిమిత్తం రూ.2,58,062 చొప్పున లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్వోసీ) పత్రాలను బాధిత కుటుంబాలకు అందించారు.

జోన్ - 2
(కాకినాడ, అమలాపురం, నర్సాపురం, రాజమహేంద్రవరం, ఏలూరు)
చైతన్యరథం

## ప్రత్యేక అవసరాల పిల్లలు ఎప్పుడూ ఒంటరివారు కాదు

**● ప్రభుత్వం వారి ప్రతి అడుగులో తోడుంటుంది : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు ఎప్పుడూ ఒంటరివారు కారని, వారి విద్య, అభివృద్ధి, భవిష్యత్తు కోసం ప్రభుత్వం ప్రతి అడుగులో అండగా నిలుస్తుందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. పాఠశాల విద్యాశాఖ -సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఎస్‌కెవీటీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచిత ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అలవెన్సులు, విద్యా అవకాశాలు, ఆటిజం పిల్లలకు ప్రత్యేక చర్యలు, తల్లిదండ్రులకు అందిస్తున్న సహకారం గురించి వివరించి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సమాన విద్యావకాశాలు కల్పించడం, వారి విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా అవసరమైన ఉపకరణాలు, ఆర్థిక సహాయం, అలవెన్సులు అందించడంలో పూర్తి చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. గతంలో రూ.3,000గా ఉన్న అలవెన్స్‌ను రూ.6,000కు పెంచి నేరుగా తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. ఆటిజం ఉన్న చిన్నారుల కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని, రాష్ట్ర ఐటీ... విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో రాజమహేంద్రవరం ఇన్నీసుపేటలో ఆటిజం సెంటర్ ప్రారంభించబడిందని చెప్పారు. ఆటిజం ఉన్న పిల్లలకు మెరుగైన విద్య, అవసరమైన పరికరాలు, వారి ప్రతిభను వెలికితీసే అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఈ అంశంపై ఏర్పాటైన కమిటీలో ఉన్న శాసనసభ్యుడు స్వయంగా ఆటిజం సమస్యను కుటుంబంలో అనుభవిస్తున్న వ్యక్తి కావడంతో మరింత అంకితభావంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల్లో అపారమైన ప్రతిభ దాగి ఉంటుందని, ఈ కార్యక్రమంలో చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అందుకు నిదర్శనమన్నారు. సీఎస్ఆర్ నిధులను వినియోగించి వారి ప్రతిభను మరింత ప్రోత్సహించగలిగితే ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు. పిల్లలు ఒంటరిగా ఉండకుండా ఏదో ఒక సృజనాత్మక కార్యక్రమంలో పాల్గొంటే వారి ప్రవర్తనలో కూడా సానుకూల మార్పులు వస్తాయని పేర్కొన్నారు.

## అనపర్తిలో ఇంటింటి టీడీపీ కార్యక్రమం చేపట్టిన నల్లమిల్లి మనోజ్‌రెడ్డి



అనపర్తి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా రాష్ట్ర ప్రజలకు అందుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేస్తూ చేపట్టిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ నల్లమిల్లి మనోజ్‌రెడ్డి చేపట్టారు. అనపర్తి గ్రామ పంచాయితీ కొత్తూరులో ప్రతి ఇంటికి వెళ్ళిన ఆయన రెండేళ్ల కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. రాబోయే మూడేళ్లలో కూటమి ప్రభుత్వం చేపట్టబోతున్న అంశాలను తెలియజేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన అనంతరం రాష్ట్రాభివృద్ధి వేగంగా సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పంచారామ క్షేత్రాలను జాతీయ టెంపుల్ టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలి

**●కేంద్ర పర్యాటక శాఖ మంత్రికి ఎంపీ సానా సతీష్ బాబు విజ్ఞప్తి**

న్యూఢిల్లీ / కాకినాడ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లోని పంచారామ క్షేత్రాలను 'స్వదేశ్ దర్శన్ 2.0' కింద జాతీయ టెంపుల్ టూరిజం – పంచారామ శివ టెంపుల్ సర్క్యూట్ గా అభివృద్ధి చేయాలని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ను గురువారం న్యూఢిల్లీలో కలిసి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రికి ప్రాజెక్ట్ సమగ్ర వివరాలను ఎంపీ సానా సతీష్ బాబు వినతిపత్రంతో అందజేశారు. ఈ సందర్భంగా అమరారం, ద్రాక్షారామం, సోమారం, కుమారారామం, క్షీర రామం క్షేత్రాలను ఒకే ఆధ్యాత్మిక, పర్యాటక సర్క్యూట్‌గా అభివృద్ధి చేస్తే రాష్ట్రంలో ఆధ్యాత్మిక పర్యాటకం, ఉపాధి అవకాశాలు, స్థానిక ఆర్థిక వ్యవస్థకు విశేష ప్రోత్సాహం లభిస్తుందని ఎంపీ సానా సతీష్ బాబు కేంద్రమంత్రికి వివరించారు. బౌద్ధ, కృష్ణ సర్క్యూట్ల తరహాలో 'పంచారామ శివ సర్క్యూట్'ను దేశవ్యాప్తంగా గుర్తింపు పొందేలా తీర్చిదిద్దాలని, ఇందుకోసం స్వదేశ్ దర్శన్ 2.0 పథకంలో చేర్చి ప్రత్యేక ప్రాజెక్టు నివేదిక రూపొందించాలని కోరారు. అలాగే పంచారామ క్షేత్రాలను అనుసంధానించే అమరావతి--ద్రాక్షారామం, సామర్లకోట--ద్రాక్షారామం, పాలకొల్లు--భీమవరం రహదారులను నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయడానికి కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ, ఎన్‌హెచ్ఏఐతో సమన్వయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రతి ఊరికి అభివృద్ధి ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిది

**● కొంతమూరు గ్రామంలో "రెండేళ్ల నమ్మకం అభివృద్ధి-సంక్షేమం" డోర్ టు డోర్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గోరంట్ల**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): ప్రతి ఇంటికి సంక్షేమం ప్రతి ఊరికి అభివృద్ధి ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. ఈరోజు కొంతమూరు గ్రామంలో సానిటోరియం ప్రాంతం నందు "రెండేళ్ల నమ్మకం అభివృద్ధి-సంక్షేమం" డోర్ టు డోర్ కార్యక్రమంలో ఎమ్మెల్యే గోరంట్ల పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి రెండేళ్ల సంక్షేమ విజయాలను ప్రజలకు తెలియజేస్తూ ప్రజల నుండి అభిప్రాయాలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ అడుగడుగున హారతులు పట్టారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ కూడా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, ఇచ్చిన వాగ్దానాలు మాత్రమే కాకుండా సుమారు 100 రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఆనందోత్సాహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కొంతమూరు, కోలమూరు, రాయుడుపాకల ప్రాంతాల్లో సుమారు 12 కోట్ల రూపాయల పనులు మొదలుపెట్టడం జరిగిందని, చిన్న చిన్న సమస్యలు పరిష్కరిస్తూ త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే చందన లేవుట్ ప్రాంత వాసుల చిరకాల కోరిక ఎన్నో ఏళ్లుగా రోడ్డు సమస్య పరిష్కారం చేయాలని కాలనీవాసులు తిరిగారని ఈరోజుకి సమస్యకు పరిష్కారం దొరికి రోడ్డు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ కాలనీ వాసులకు రోడ్డు ఏర్పాటుకు మైనార్టీ సంఘం వారు కొంత భూమిని కేటాయించారని, దానికి బదులుగా మైనార్టీ సోదరులకు పిన్నమరెడ్డి ఈశ్వరుడు కొంత భూమిని కేటాయించారని తెలిపారు. ఈ రోడ్డు ఏర్పాటుకు కృషి చేసిన గ్రామ పార్టీ అధ్యక్షులు పిన్నమరెడ్డి ఈశ్వరుడుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అలాగే వారికి సహకరించిన అధికారులకు, ముస్లిం సోదరులకు, స్థానిక ప్రజలకు అభినందనలు తెలిపారు. కాలనీవాసులు మహిళలు ఎమ్మెల్యే గోరంట్లకు జీవితాంతం రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రతీ కుటుంబానికి సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**●ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో కుడుపూడి సత్తిబాబు**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): రాజమహేంద్రవరం నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆదేశాల మేరకు, స్థానిక మూడో వార్డు బూత్ నెం.130 పరిధిలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు ఆధ్వర్యంలో "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కుడుపూడి సత్తిబాబు మాట్లాడుతూ... "తెలుగుదేశంపార్టీ అధికారంలో ఉన్నప్పుడే రాష్ట్ర సమగ్ర అభివృద్ధితో పాటు ప్రజల జీవన ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడతాయన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేస్తూ ప్రజలకు మెరుగైన పాలన అందించడం కూటమి ప్రభుత్వం లక్ష్యమని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో వేగంగా దూసుకుపోతుండగా, ప్రతి కుటుంబం ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పొందేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రజల ఆశీస్సులు, విశ్వాసంతో రాష్ట్రాన్ని మరింత ప్రగతి దిశగా తీసుకెళ్లేందుకు తెలుగుదేశం పార్టీ నిరంతరం పనిచేస్తుంది" అని అన్నారు.

## ప్రజలతో మమేకం కావడానికి టీడీపీ డోర్‌టూడోర్ కార్యక్రమం దోహదం

**●ప్రతి ఇంటికి వెళ్ళి వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్నాం : ఎమ్మెల్యే గద్దె రామమోహన్**



విజయవాడ (చైతన్యరథం): టీడీపీ డోర్-టు-డోర్ కార్యక్రమంలో భాగంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్ళి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించడం ద్వారా ప్రజలతో మమేకం కావడానికి దోహదం చేస్తుందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. గురువారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 5వ డివిజన్‌లో క్రీస్తురాజపురం, అరుణ్‌నగర్ ఏరియాల్లో టీడీపీ డోర్-టు-డోర్ కార్యక్రమం జరిగింది. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ డోర్-టు-డోర్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ద్వారా వారికి అందుతున్న సంక్షేమ కార్యక్రమాలు, అందని సంక్షేమ పథకాల గురించి తెలుసుకుంటున్నామని చెప్పారు. ఆ సంక్షేమ పథకాలు ఏ కారణం చేత వారికి అందడం లేదో అధికారులను అడిగి వారికి తెలియజేస్తున్నామన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చాలా మంచి పథకం అని చాలా మంది మహిళలు చెప్పారని, ఈ పథకంలో భాగంగా తాము చాలా దేవాలయాలకు వెళ్ళామని చాలా సంతోషంతో చెప్పారన్నారు. అదే విధంగా తల్లికి వందనం పథకంలో భాగంగా పిల్లలను బడికి పంపుతున్న ప్రతి తల్లి ఖాతాకు ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున ఎంత మంది విద్యార్థులు ఉంటే వారందరికి నగదు అందచేశామని చెప్పారు. గ్యాస్ సబ్సిడీ మొత్తం కొంత మంది బ్యాంకు ఖాతాలకు జమ కాలేదని ఈ ప్రాంతంలో ఆరుగురు మహిళలు చెప్పారని, వెంటనే సివిల్ సప్లైస్ అధికార్లతో మాట్లాడి మహిళల వివరాలను వారికి అందచేశామని అన్నారు. హడావుడిగా కాకుండా ఇంటింటికీ వెళ్ళి వారితో ప్రత్యేకంగా మాట్లాడి సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నించాలని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు.

## డీఎస్సీపై దీక్షలు చేసే నైతిక అర్హత వైసీపీకి లేదు: ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు (చైతన్యరథం): డీఎస్సీ పేరుతో దీక్షలు చేసే నైతిక అర్హత వైసీపీకి ఏమాత్రం లేదని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో యువతకు ఒక్క ఉద్యోగం కూడా కల్పించలేని వైసీపీ, ఇప్పుడు డీఎస్సీ నియామకాలపై అనవసర అపోహలు సృష్టిస్తూ యువతలో ఆందోళన కలిగించే ప్రయత్నం చేయడం దురదృష్టకరమని అన్నారు. డీఎస్సీ నియామక ప్రక్రియపై తప్పుడు ప్రచారం చేస్తూ నిరుద్యోగ యువతను తప్పుదోవ పట్టించేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందని, ఇటువంటి రాజకీయాలను యువత, ప్రజలు తీవ్రంగా తిరస్కరిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు అధికారం ఇవ్వలేదనే అక్కసుతో రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే కుట్రలకు జగన్ పాల్పడుతున్నారని, అలాంటి రాజకీయాలను ప్రజలు ఎప్పటికీ సమర్థించరని ఎమ్మెల్యే అన్నారు. అమరావతి మండలం ఉంగుటూరులో నిర్వహించిన 2 ఏళ్ల నమ్మకం ఇంటింటి ప్రచారం కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు దేగల ప్రభాకర్ తో కలిసి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.

## విద్యార్థుల విజ్ఞప్తితో కాలింగ్ పేట గుడివాడ స్పెషల్ స్టూడెంట్ బస్సు సర్వీసు

●సమస్య పరిష్కరించిన ఎమ్మెల్యే రాముకు ధన్యవాదాలు చెప్పిన... విద్యార్థులు మరియు తల్లిదండ్రులు



నందివాడ (చైతన్యరథం): గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము చొరవతో నందివాడ మండల విద్యార్థులకు స్పెషల్ స్టూడెంట్ బస్సు సర్వీస్ గురువారం ప్రారంభమైంది. గత శనివారం ప్రజావేదికలో విద్యార్థులు జనరల్ బస్సుల్లో ఖాళీ లేక పడుతున్న అవస్థలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, కేవలం ఐదు రోజుల్లోనే ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. కాలింగ్ పేటలో ప్రారంభమైన ఈ స్పెషల్ బస్సులో మండల కేంద్రం నందివాడ వద్ద ఎమ్మెల్యే రాము ఎక్కి విద్యార్థులతో కలిసి గుడివాడ వరకు ప్రయాణించారు. ప్రయాణంలో విద్యార్థులతో స్నేహపూర్వకంగా మాట్లాడిన ఎమ్మెల్యే, స్కూళ్ల కాలేజీల్లో వసతులు, ఎదురవుతున్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు ఉత్సాహంగా సమాధానాలు ఇవ్వగా, ఎమ్మెల్యే చలోక్తులకు అందరూ నవ్వుల్లో మునిగిపోయారు. భవిష్యత్ లో ఏ సమస్య వచ్చినా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు తన వ్యక్తిగత మొబైల్ నెంబర్ ను కూడా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ, "విద్యార్థులు చూపిన చైతన్యం వల్లే ఐదు రోజుల్లో ఈ బస్సు సమస్య పరిష్కారమైందన్నారు. ఇదే స్ఫూర్తితో మీ గ్రామాల్లోని ఇతర సమస్యలను కూడా అధికారులు లేదా నా దృష్టికి తీసుకురావాలన్నారు. "విద్యార్థుల భవిష్యత్తు కోసం ఏమైనా చేసేందుకు మేము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. చదువులో మీరు రాణించాలంటే మౌలిక వసతులు తప్పనిసరని,అందుకే ముందుగా రవాణా సమస్యను పరిష్కరించాం" అని పేర్కొన్నారు. విద్యార్థులకు ఇబ్బంది అంటే అది నాకు ఇబ్బందే" అని స్పష్టం చేశారు. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొనే ఈ స్పెషల్ బస్సును ఏర్పాటు చేశామని, బస్సు సక్రమంగా నడవాలని, కాలింగ్ పేట నుండి గుడివాడ వరకు ఉదయం, సాయంత్రం ప్రతి స్టాప్ లో తప్పనిసరిగా ఆపాలని ఆర్టీసీ అధికారులకు స్పష్టమైన సూచనలు చేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో కొద్దిమంది సాధారణ ప్రయాణికులకు కూడా ఈ బస్సులో అవకాశం ఇవ్వాలని సూచించారు.

## రెండేళ్లలో రెండింతల అభివృద్ధి.. రెట్టింపు సంక్షేమం : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

● చిలకలూరిపేట, యడ్లపాడు మండలాల్లో టీడీపీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ తెలుగుదేశం



చిలకలూరిపేట (చైతన్యరథం): రెండేళ్లలోనే ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడంతో పాటు.. రెండింతల అభివృద్ధి, రెట్టింపు సంక్షేమాన్ని సాధించామని, ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవమే ప్రజలకు, రాష్ట్రానికి నిజమైన బలమని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. గురువారం ఆయన చిలకలూరిపేట, యడ్లపాడు మండలాల్లో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. చిలకలూరిపేట మండలం మానుకొండవారిపాలెంలో స్వయంగా ఇళ్లకు వెళ్లిన ప్రత్తిపాటి.. ప్రజలతో మాట్లాడి ప్రభుత్వ రెండేళ్ల విజయాలను వివరించే కరపత్రాలను వారికి అందచేశారు. అధికారుల పనితీరుపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం యడ్లపాడు మండలం సందెపూడి, తుర్లపాడు గ్రామాల్లో ఇంటింటికీ తెలుగుదేశంలో పాల్గొన్న ప్రత్తిపాటి.. స్థానికుల్ని ఉద్దేశించి మాట్లాడారు.

**రూ.25 లక్షల కోట్ల పెట్టుబడులు గ్రౌండ్ అయితే.. ప్రభుత్వానికి రూ.7.50 లక్షల కోట్ల ఆదాయం.**

ప్రభుత్వం పదేపదే చెబుతున్న పెట్టుబడులపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని, బడా పారిశ్రామికవేత్తలు, గొప్ప గొప్ప కంపెనీలు రాష్ట్రంలో ఏర్పాటుచేసే తమ కంపెనీలు, సంస్థల ద్వారా కొన్ని లక్షల కోట్లను పెట్టుబడులు పెడతాయని, వాటివల్ల రాష్ట్రానికి, ప్రజలకు ఆదాయం పెరుగుతుందని ప్రత్తిపాటి పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధి, యువతకు మంచి భవిష్యత్ పెట్టుబడులతోనే ముడిపడి ఉన్నాయన్నారు. పెట్టుబడులు వచ్చినప్పుడే యువతకు మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రభుత్వం సాధించిన రూ.25 లక్షల కోట్ల పెట్టుబడులు గ్రౌండింగ్ అయితే.. రాష్ట్రానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు రూ.7.50 లక్షల కోట్ల ఆదాయం వస్తుందని ప్రత్తిపాటి చెప్పారు. ఆ విధంగా ప్రభుత్వానికి ఆదాయం వచ్చినప్పుడే ప్రజల ఆదాయం పెరుగుతుందన్నారు.

**ప్రాధాన్యతాక్రమంలో ఎత్తిపోతల పథకాల ఆధునికీకరణ...**

నియోజకవర్గ ప్రజల సాగు, తాగునీటి అవసరాలు తీర్చే ఎత్తిపోతల పథకాల (లిఫ్టుల) నిర్వహణపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని, ప్రాధాన్యతాక్రమంలో అన్నింటినీ ఆధునీకరిస్తామని ప్రత్తిపాటి తెలిపారు. జేజేఎమ్ (జల్ జీవన్ మిషన్) కింద నియోజకవర్గ తాగునీటి సమస్యను పరిష్కరించబోతున్నట్లు ఆయన చెప్పారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు ఎలాంటి సమస్యలు రానీయమని, గత ప్రభుత్వంలా కూటమిప్రభుత్వం ప్రజల్ని గాలికొదిలేసి, గాల్లో పాలన చేయదని ప్రత్తిపాటి స్పష్టంచేశారు.

## అమరావతి పికిల్‌బాల్ లీగ్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా మంత్రి మండిపల్లి

●ఆగస్టు 7 నుంచి 9 వరకు విజయవాడ నైట్రో పికిల్ బాల్ కేఫ్‌లో ప్రతిష్ఠాత్మక అమరావతి పికిల్‌బాల్ లీగ్



విజయవాడ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా నిర్వహిస్తున్న అమరావతి పికిల్‌బాల్ లీగ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ మేరకు తాడేపల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో గద్దె క్రాంతి కుమార్ మంత్రిని కలిసి అధికారికంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ... "ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా నిర్వహిస్తున్న అమరావతి పికిల్‌బాల్ లీగ్ రాష్ట్ర క్రీడా చరిత్రలో ఒక ప్రత్యేక ఘట్టంగా మారుతుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తూ యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేలా ఆధునిక క్రీడా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తోందన్నారు. అమరావతి, విజయవాడ ప్రాంతాలు కేవలం పరిపాలనా కేంద్రాలుగానే కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడలకు ఆతిథ్యం ఇచ్చే కేంద్రాలుగా అభివృద్ధి చెందుతున్నాయి. ఇలాంటి లీగ్‌లు యువ క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీసి రాష్ట్రానికి మంచి గుర్తింపు తీసుకొస్తాయి. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలను అమరావతి--విజయవాడ వేదికగా నిర్వహించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందన్నారు. గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుతూ... ఆగస్టు 7 నుంచి 9 వరకు విజయవాడలోని నోవాటెల్ హోటల్ సమీపంలోని నైట్రో పికిల్‌బాల్ కోర్టుల్లో మూడు రోజుల పాటు నిరంతరాయంగా అమరావతి పికిల్‌బాల్ లీగ్ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ లీగ్‌లో దేశంలోని ప్రముఖ జాతీయ స్థాయి (నేషనల్) క్రీడాకారులు పాల్గొని ప్రేక్షకులకు అత్యున్నత స్థాయి పోటీలను అందించనున్నారని చెప్పారు. ఈ లీగ్ ప్రత్యేకత ఏమిటంటే, వివిధ జట్లకు ప్రముఖ సినీ నిర్మాతలు, సినీ నటులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు ఫ్రాంచైజీ యజమానులుగా (టీమ్ ఓనర్స్‌గా) వ్యవహరిస్తున్నారని తెలిపారు. వారు ఆటగాళ్లను వేలం (ఆక్షన్) ద్వారా ఎంపిక చేసుకుని తమ జట్లను రూపొందించారని, దీంతో ఈ లీగ్‌కు మరింత ప్రతిష్ఠ, ఆకర్షణ పెరిగిందన్నారు.

## అమరావతి జీపీఆర్‌ఏ భవన నిర్మాణానికి టెండర్లు

●పెమ్మసాని చొరవతో ప్రాజెక్టుకు వేగంగా ముందడుగు

●అమరావతిలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం రూ.1,083 కోట్లతో భారీ గృహ సముదాయం : కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



అమరావతి (చైతన్యరథం): అమరావతిలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం అత్యాధునిక వసతులతో నిర్మించనున్న జనరల్ పూల్ రెసిడెన్షియల్ అకామడేషన్ గృహ సముదాయానికి టెండర్లు ఆహ్వానించడం ప్రాజెక్టు నిర్మాణంలో కీలక ముందడుగుగా నిలిచింది. ఈ ప్రాజెక్టు ఇంత వేగంగా టెండర్ దశకు రావడం వెనుక కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ నిరంతర చొరవ, కేంద్ర ప్రభుత్వ శాఖలతో సమన్వయం, ప్రాజెక్టు పురోగతిపై ఆయన ఎప్పటికప్పుడు చేసిన పర్యవేక్షణ కీలకంగా నిలిచింది. అమరావతి అభివృద్ధిలో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించాలన్న లక్ష్యంతో ఈ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై పెమ్మసాని సంబంధిత కేంద్ర శాఖల అధికారులతో సమన్వయం చేస్తూ, పనులు వేగంగా ముందుకు సాగేలా ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ ప్రతి దశలోనూ అవసరమైన సమన్వయాన్ని వేగవంతం చేయడంపై పెమ్మసాని ప్రత్యేక దృష్టి పెట్టారు. తుళ్లూరు మండలం ఐనవోలు గ్రామంలో ఈ GPRA గృహ సముదాయాన్ని EPC Mode-I విధానంలో నిర్మించనున్నారు. మొత్తం ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.1,083.14 కోట్లు. నిర్మాణ పనులను మొత్తం 28 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇందులో మూడు నెలలు ప్రణాళిక, డిజైన్‌కు, 25 నెలలు నిర్మాణ పనుల అమలుకు కేటాయించారు. అర్హత కలిగిన బిడ్డర్ల కోసం ఆగస్టు 12, 2026 ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని సుల్తాన్ బజార్ (కోటి) నిర్మాణ్ భవన్‌లోని CPWD కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రీ-బిడ్ సమావేశం నిర్వహించనున్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఆధునిక గృహ వసతులు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా అమరావతిలో ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థకు మరింత బలమైన మౌలిక వసతులు ఏర్పడనున్నాయి. ఈ ప్రాజెక్టు విషయంలో మొదటి నుంచి ప్రత్యేక శ్రద్ధ చూపుతూ... కేంద్ర శాఖలతో నిరంతరం సమన్వయం చేస్తూ... పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ... ప్రాజెక్టును వేగంగా టెండర్ దశకు తీసుకురావడంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చొరవ కీలకంగా నిలిచింది.

## రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు కేటాయించనున్న ప్రభుత్వం: చీఫ్ విప్ జీవి



వినుకొండ (చైతన్యరథం) : నియోజకవర్గంలోని ఆర్ అండ్ బి రోడ్లు, బ్రిడ్జిలు, రోడ్లపై చప్టాల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరుతూ ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు గురువారం తాడేపల్లిలోని రోడ్లు, భవనాలు శాఖ మంత్రి జనార్దన్‌రెడ్డిని తన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. వినుకొండ నుండి వయా ఏనుగుపాలెం అద్దంకి వెళ్ళు రహదారి సింగిల్ రోడ్డు కావడంతో ప్రజల రాకపోకలకు, రవాణా సౌకర్యాలకు అనేక ఇబ్బందులు నెలకొంటున్నాయని, పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకొని వినుకొండ నుండి కొప్పెరపాడు వరకు రోడ్డు విస్తరణ (డబల్ రోడ్డు) చేయాల్సి ఉందన్నారు. ఈ రోడ్డు అధ్వానంగా ఉండటం వలన అనేక ప్రమాదాలు సమవిస్తున్నాయని, డబల్ రోడ్డు నిర్మిస్తే ప్రమాదాలు తగ్గి వాహనాల రాకపోకలు సాఫీగా సాగుతాయని, వ్యాపార అభివృద్ధికి సంబంధించి చుట్టుపక్కల గ్రామాల మధ్య రాకపోకలు వేగవంతమై స్థానిక ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని పేర్కొన్నారు. శావల్యాపురం మండలం కారుమంచి వద్ద ఎన్‌ఎస్పి కాలువపై బ్రిడ్జి నిర్మించాలని, నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బి రోడ్లపై అవసరమైన చోట చప్టాలు నిర్మించాలని, వినుకొండ పట్టణంలోని ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్ నిర్మాణాలకు నిధులు కేటాయించాలని చీఫ్ విప్ జీవి ఆంజనేయులు మంత్రికి విన్నవించారు. రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సానుకూలంగా స్పందించారు.

## గళ్ళా మాధవి జన్మదినాన్ని సేవా దినోత్సవంగా మార్చిన పార్టీ శ్రేణులు

గుంటూరు (చైతన్యరథం): పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యురాలు, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి జన్మదిన వేడుకలు నియోజకవర్గవ్యాప్తంగా ఘనంగా నిర్వహించబడ్డాయి. ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపు మేరకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహిస్తూ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిచ్చారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ డివిజన్లలో మొత్తం 2,500 మొక్కలను నాటి గళ్ళా మాధవి జన్మదినాన్ని హరితోత్సవంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పొగాకు రైతు సమస్యల పరిష్కారానికి కృషి

## పొదిలి పొగాకు కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి



మార్కాపురం (చైతన్యరథం): నియోజకవర్గ శాసనసభ్యులు, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ అంచనాల కమిటీ సభ్యులు కందుల నారాయణ రెడ్డిమార్కాపురం జిల్లా పొదిలి పొగాకు కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం అధికారులు బయ్యర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పొగాకు కేంద్రంలోని కార్యకలాపాలు, రైతులకు అందుతున్న సేవలు, పొగాకు కొనుగోళ్ల ప్రక్రియపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పొగాకు బేళ్లకు నో బిడ్‌లు లేకుండా చూడాలి, బయ్యర్లు రైతుల బేళ్లను సక్రమంగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే బ్రైట్ రకం పొగాకుకు క్వింటాల్‌కు కనీసం రూ.24,000 తగ్గకుండా ధర లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులు, బయ్యర్లు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి సూచించారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. రైతుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ఒంగోలు నగరంలోని పార్టీ కార్యాలయం నందు మత్స్యకారుల కుటుంబాలకు 35 లక్షల 62 వేలు విలువ గల 13 ఇంజన్లు, 87 ట్రాన్స్‌పాండర్ అందజేసే కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పాము కాటు మరణాలకు చెక్

## 108 వాహనాల్లోనే వాక్సిన్ అందుబాటు

చిత్తూరు (చైతన్యరథం): ఇప్పటి వరకు పాము కాటుకు గురైన వ్యక్తిని 108 అంబులెన్స్‌లో సమీప ప్రభుత్వాస్పత్రికి తరలించడం వరకే అత్యవసర సేవలు పరిమితమయ్యేవి. ఆస్పత్రికి చేరాకే చికిత్స అందించేవారు. ఈలోపు శరీరమంతా విషం వ్యాపించి పరిస్థితి విషమించే సందర్భాలు ఎక్కువగా ఉండేవి. ఇప్పుడు 108 అంబులెన్సులలోనే ప్రభుత్వం స్నేక్ యాంటీ వీనం (పాము కాటు మందును) అందుబాటులో ఉంచింది. దీంతో పాము కాటు సమాచారంతో వెంటనే బాధితుడి వద్దకు 108 అంబులెన్సు వస్తుంది. బాధితుడి లక్షణాలు, పాము కాటు జరిగిన సమయం, రక్తపోటు, శ్వాస, గుండె స్పందన తదితర వివరాలను సిబ్బంది 108 కాల్‌సెంటర్‌లోని వైద్యులకు తెలియజేస్తారు. వారిచ్చే సూచనల మేరకు బాధితుడికి స్నేక్ యాంటీ వీనం ఇవ్వడంతో పాటు ఇతర చికిత్సనూ ప్రారంభిస్తారు. అదే సమయంలో సమీప ప్రభుత్వాస్పత్రికీ తరలిస్తారు. ఇలా గోల్డెన్ అవర్‌లో బాధితులకు వైద్యం అందించడం వల్ల ప్రాణాపాయం నుంచి తప్పించవచ్చు. జిల్లా వ్యవసాయ ఆధారిత ప్రాంతం. వర్షాకాలంలో రైతులు, వ్యవసాయ కూలీలు, పశువుల కాపరులు, గ్రామీణ ప్రజలు ఎక్కువగా పాముకాటుకు గురవుతుంటారు. అనేక గ్రామాల నుంచి సమీపంలోని ప్రభుత్వాస్పత్రులకు చేరుకోవడానికి గంటకుపైగా సమయం పడుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో అంబులెన్సులోనే చికిత్స ప్రారంభం కావడం వల్ల మరణాలను గణనీయంగా తగ్గించే అవకాశం ఉందని వైద్యులు భావిస్తున్నారు. జిల్లాలో ఏడాదికి సుమారు 531 పాము కాటు ఘటనలు నమోదవుతుండగా.. సుమారు మూడు మరణాలు నమోదవుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. పాము కాటు వేయగానే ప్రజలు మూఢనమ్మకాలను ఆశ్రయించకుండా వెంటనే 108కు సమాచారం ఇవ్వాలని వైద్యులు సూచిస్తున్నారు. గాయాన్ని కోయడం, విషాన్ని నోటితో పీల్చడం, గట్టిగా తాడు కట్టడం వంటి చర్యలు ప్రమాదాన్ని మరింత పెంచుతాయని హెచ్చరిస్తున్నారు. బాధితుడిని ప్రశాంతంగా ఉంచి వీలైనంత తక్కువ కదిలిస్తూ 108 సిబ్బందికి అప్పగిస్తే సకాలంలో చికిత్స అందే అవకాశం ఉంటుంది.

# చురుగ్గా చెరువుల పనులు

మార్కాపురం (చైతన్యరథం): జిల్లాలోని చెరువుల అభివృద్ధి పనులు చకచకా జరుగుతున్నాయి. వేసవికి ముందుగానే ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా టెండర్ల ప్రక్రియలో జాప్యమైంది. దీంతో వర్షా కాలాని కంటే ముందు ఈ పనుల పూర్తి ప్రశ్నార్థకంగా కనిపించింది. అయితే ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో సకాలంలో వానలు కురవకపోవడంతో ఆటంకం లేకుండా పనులు సాగుతున్నాయి. చెరువు కట్టల పటిష్టత, సప్లై చానళ్ల మరమ్మతులు, ఇతర కాంక్రీట్ పనులు వేగవంతమయ్యాయి. నీటి సంరక్షణపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అందుకు అవసరమైన చర్యలు చేపట్టింది. చెరువుల మరమ్మతులకు ప్రాధాన్యం ఇచ్చి వేసవిలోనే నిధులను మంజూరు చేసింది. వర్షాకాలంలోపు వాటిని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. అయితే టెండర్ల ప్రక్రియ, కాంట్రాక్టర్‌లతో అగ్రిమెంట్ విషయంలో కొంత ఆలస్యమైంది. ప్రస్తుతం పనులు ప్రారంభమై వేగంగా జరుగుతున్నాయి. జల సంరక్షణకు దోహదపడే చెరువులను గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. చెరువులు, కాలువలు, కుంటలు దేనికీ ఒక్కపైసా ఇవ్వకుండా నీటి వనరులను నిర్వీర్యం చేసింది. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని రంగాలతోపాటు చెరువులు, కాలువల మరమ్మతులు, అభివృద్ధిపై దృష్టి సారించింది. చెరువుల పునరుద్ధరణ ద్వారా నీటి నిల్వ సామర్థ్యం పెంచడం, భూగర్భ జల మట్టం మెరుగుప ర్చాలన్నది ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం. అందుకోసం ట్రిపు ల్ ఆర్ (రిపేర్, రినోవేషన్, రిస్టొరేషన్) ద్వారా జిల్లాలో 22 చెరువులకు రూ.13.47 కోట్లు మంజూరు చేయగా పనులు జరుగుతున్నాయి. మరో 41 చెరువుల పనులకు ఓ అండ్ ఎం (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) కింద రూ.5.25 కోట్లతో పనులు కొనసాగుతున్నాయి. ట్రిపుల్ ఆర్ ద్వారా దోర్నాల మండలం పెద్దబొమ్మలాపురం చెరువుకు రూ.4.92 కోట్లు, ఎర్రగొండపాలెం మండలం మురారిపల్లె చెరువుకు రూ.1.72 కోట్లు, మార్కాపురం చెరువుకు రూ.1.17 కోట్లు, త్రిపురాంతకం మండలం దూపాడు చెరువుకు రూ.66.50 లక్షలు, పెద్దారవీడు మండలం బద్వీడు చెరువుకు రూ.51 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఎర్రగొండపాలెం చెరువుకు రూ.43 లక్షలు, బోడపాడు బంధనం వాగుకు రూ.23లక్షలు, తంగిరాలపల్లి చెరువుకు రూ.13 లక్షలు, బోడిరెడ్డిపల్లి చెరువుకు రూ. 46.50 లక్షలు, దేవరాజుగట్టు చెరువుకు రూ.15లక్షలు, సానికవరం కోనప్పచెరువుకు రూ.14లక్షలు, పెద్దారవీడు చెరువుకు రూ.25 లక్షలు, త్రిపురాంతకం చెరువుకు రూ.39లక్షలు కేటాయించింది. సోమేపల్లి చెరువుకు రూ.36లక్షలు, లేళ్లపల్లిలోని రుద్రప్ప చెరువుకు రూ.12లక్షలు, కంకణాలపల్లి చెరువుకు రూ.22 లక్షలు, అమానిగుడిపాడు చెరువుకు రూ.25లక్షలు, గంగపాలెం చెరువుకు రూ.28.50లక్షలు, కొలుకుల చెరువుకు రూ.27లక్షలు, పెద్దనాగులవరం చెరువుకు రూ.22.50 లక్షలు, భూపతిపల్లి చెరువుకు రూ.17లక్షలు, పేరూర్ చెరువు (వైడీపాడు)కు రూ.40లక్షలు మంజూరు చేసింది.



# పొదిలి నగర పంచాయతీ ప్రగతిపై సమీక్ష

## పాల్గొన్న ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి

మార్కాపురం (చైతన్యరథం): జిల్లాలోని పొదిలి నగర పంచాయతీ పరిధిలో ప్రజల ప్రధాన సమస్యలైన తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణపై మార్కాపురం నియోజకవర్గ శాసనసభ్యులు, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ అంచనాల కమిటీ సభ్యులు కందుల నారాయణ రెడ్డి స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులు లతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, ప్రజల నుండి వస్తున్న వినతులపై ఆయన సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు సూచించారు.





# రెండేళ్ల పాలనపై ఇంటింటా ప్రచారం

## పాల్గొన్న ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

కావలి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బోగోలు మండలం కోవూరుపల్లి గ్రామంలో ఇంటింటా ప్రచార కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలు, కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, కోవూరుపల్లి గ్రామ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. గ్రామంలో ఈరోజు రైతులకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేసినట్లు గుర్తు చేశారు. అలాగే విద్యుత్ సౌకర్యాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకొని, గ్రామ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రతి సంక్షేమ పథకం అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేస్తున్నామని, ప్రజల సహకారంతో కోవూరుపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో బోగోలు మండల పార్టీ అధ్యక్షులు మాలపాటి నాగేశ్వరరావు, నాగులవరం సింగల్ విండో అధ్యక్షులు చిలకపాటి వెంకటేశ్వర్లు, క్లస్టర్ ఇంచార్జ్ రామ్మోహన్ రెడ్డి, కోవూరు పల్లి సీనియర్ నాయకులు శీనయ్య, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి లేళ్లపల్లి సుధీర్ బాబు, జిల్లా కార్యదర్శి కోడూరు వెంకటేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

# రాయితీ బియ్యం పంపిణీ

## పాల్గొన్న మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి



మడకశిర (చైతన్యరథం): నియోజకవర్గంలో నిర్వహించిన రాయితీ బియ్యం పంపిణీ కార్యక్రమంలో మడకశిర శాసనసభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిపాల్గొన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని తక్కువ ధరకు అందించాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ పథకం కింద ధీూ రకం బియ్యం మార్కెట్ ధర కిలోకు ?62 ఉండగా, ప్రజలకు కిలోకు 52కే అందుబాటులోకి తీసుకువచ్చారు. అలాగే మరో రకం బీపీటీ బియ్యం మార్కెట్ ధర రూ, 58 ఉండగా, కిలో 50కే అందిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన బియ్యం అందుబాటు ధరల్లో లభించడంతో వారి కుటుంబ వ్యయ భారం గణనీయంగా తగ్గనుంది. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం!



నందికొట్కూరు (చైతన్యరథం): పట్టణ పరిధిలోని 20వ వార్డులో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ నిర్వహించిన ఇంటింటికి ప్రచార కార్యక్రమంలో నందికొట్కూరు శాసనసభ్యుడు గిత్త జయసూర్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన ప్రజాహిత పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి స్థానికులకు వివరించి, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల విశ్వాసమే తమకు బలమని, ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందేలా కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు పట్టణ నాయకులు కార్యకర్తలు పట్టణ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, అబ్జర్వర్ వెంకట శివుడు, పాణ్యం వేణుగోపాలు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# మార్కాపురం జిల్లాలో చెరువులకు మహర్దశ

దోర్నాల (చైతన్యరథం): ట్రిపుల్ ఆర్ ద్వారా దోర్నాల మండలం పెద్దబొమ్మలాపురం చెరువుకు రూ.4.92 కోట్లు, ఎర్రగొండపాలెం మండలం మురారిపల్లె చెరువుకు రూ.1.72 కోట్లు, మార్కాపురం చెరువుకు రూ.1.17 కోట్లు, త్రిపురాంతకం మండలం దూపాడు చెరువుకు రూ.66.50 లక్షలు, పెద్దారవీడు మండలం బద్వీడు చెరువుకు రూ.51 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఎర్రగొండపాలెం చెరువుకు రూ.43 లక్షలు, బోడపాడు బంధనం వాగుకు రూ.23లక్షలు, తంగిరాలపల్లి చెరువుకు రూ.13 లక్షలు, బోడిరెడ్డిపల్లి చెరువుకు రూ. 46.50 లక్షలు, దేవరాజుగట్టు చెరువుకు రూ.15లక్షలు, సానికవరం కోనప్పచెరువుకు రూ.14లక్షలు, పెద్దారవీడు చెరువుకు రూ.25 లక్షలు, త్రిపురాంతకం చెరువుకు రూ.39లక్షలు కేటాయించింది. సోమేపల్లి చెరువుకు రూ.36లక్షలు, లేళ్లపల్లిలోని రుద్రప్ప చెరువుకు రూ.12లక్షలు, కంకణాలపల్లి చెరువుకు రూ.22 లక్షలు, అమానిగుడిపాడు చెరువుకు రూ.25లక్షలు, గంగపాలెం చెరువుకు రూ.28.50లక్షలు, కొలుకుల చెరువుకు రూ.27లక్షలు, పెద్దనాగులవరం చెరువుకు రూ.22.50 లక్షలు, భూపతిపల్లి చెరువుకు రూ.17లక్షలు, పేరూర్ చెరువు (వైడీపాడు)కు రూ.40లక్షలు మంజూరు చేసింది. మురారిపల్లి చెరువుకు టెండరు వేసిన కాంట్రాక్టరు ఇంకా పనులు ప్రారంభించ లేదు. మిగిలిన చెరువుల పనులు ప్రారంభమై వివిధ దశల్లో ఉన్నాయి. ఓఅండ్ఎం (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) కార్యక్రమం కింద 41 పనులకు రూ.5.25 కోట్లు మంజూరయ్యాయి. కనిగిరి నియోజకవర్గంలో హనుమంతునిపాడు చెరువుకు రూ.2 కోట్లు, గిద్దలూరు నియోజకవర్గంలోని కంభం, బేస్తవారపేట, అర్ధవీడు, గిద్దలూరు, రాచర్ల, కొమరోలులోని మొత్తం 19 చెరువులకు రూ.1.54కోట్లు విడుదలయ్యాయి. మార్కాపురం, తర్లుపాడు మండలాల్లోని 15 చెరువులకు రూ. 75లక్షలు, దోర్నాల చెరువుకు రూ. 50లక్షలతోపాటు బేస్తవారపేట, కంభం మండలాల్లో 5 మీడియం ఇరిగేషన్ చెరువులకు రూ.46లక్షలు కేటాయించారు.



ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమంలో భాగంగా 11వ రోజు బేతంచర్ల మండలంలోని కోలుమలపల్లె గ్రామంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.



వెలుగోడు మండలంలో ఇంటింటికి తెలుగుదేశం - రెండేళ్ల పాలన - సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమ డోర్ టు డోర్ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి

# ముళ్లపంది వేటలో గాయాలతోనే పులి మృతి

## నంద్యాల అటవీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విగ్నేశ్ అప్పావ్ వెల్లడి

నంద్యాల (చైతన్యరథం): జిల్లాలోని ఆత్మకూరు అటవీ డివిజన్‌లో పులి మృతిపై ఉన్నత స్థాయి కమిటీ క్షేత్రస్థాయి విచారణ చేపట్టిందని డిప్యూటీ డైరెక్టర్ విగ్నేశ్ అప్పావ్ పేర్కొన్నారు. ముళ్లపందిని వేటాడే క్రమంలో ముళ్లు గుచ్చుకుని తీవ్ర గాయాలతోనే ఆడపులి మృతి చెందినట్లు వెల్లడించారు. ఆ పులి శరీర అవయవాలన్నీ భద్రంగానే ఉన్నాయని తెలిపారు. వేటగాళ్ల హస్తం గానీ, ఎలాంటి కుట్ర గానీ లేదని విగ్నేశ్ అప్పావ్ స్పష్టం చేశారు. పులి గర్భవతి అని, పిల్లలు కనిపించడం లేదంటూ వస్తున్న వార్తల్లో నిజం లేదని అటవీ శాఖ అధికారులు తేల్చిచెప్పారు. గత నెల 20, 21, 22 తేదీల కెమెరా ట్రాప్ దృశ్యాల ద్వారా పులిపై ముళ్ల పంది గాయాలున్నట్లు గుర్తించామని అన్నారు. అటవీ ప్రాంతంలో డ్రోన్ గస్తీ, బేస్ క్యాంప్‌లు, ఏపీఎస్పీడీసీఎల్ సమన్వయంతో రక్షణ చర్యలు ముమ్మరం చేశామని విగ్నేశ్ అప్పావ్ పేర్కొన్నారు.



# మొక్కల పెంపకం సామాజిక బాధ్యతగా భావించాలి

## మార్కాపురం ఎమ్మెల్యే కందుల పిలుపు, పాల్గొన్న కలెక్టర్ విజయ సునీత



మార్కాపురం (చైతన్యరథం): నియోజకవర్గ పరిధిలోని గజ్జలకొండలో 2026, 27 సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన 'నెట్ జీరో ఆరోగ్యకరమైన ప్రాంగణం' కార్యక్రమంలో మార్కాపురం నియోజకవర్గ శాసనసభ్యులు, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ అంచనాల కమిటీ సభ్యుడు కందుల నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయ సునీతతో కలిసి ఆయన మొక్కలు నాటారు. వీబీ జీ రామ్ జీ ఉద్యానవన పెంపకం కార్యక్రమంలో భాగంగా ఈ "అతి అధిక సాంద్రతతో మొక్కల పెంపకం"కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, కార్బన్ ఉద్గారాలను తగ్గించడం నీటి సంరక్షణలో మొక్కల పెంపకం అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కలను పెంచే ఈ నూతన 'అతి అధిక సాంద్రత' విధానం ద్వారా పచ్చదనాన్ని వేగంగా విస్తరించవచ్చని పేర్కొన్నారు. "ఈ రోజు పచ్చదనం రేపటి మెరుగైన భవిష్యత్తు" అనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించి, భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రవాసాంధ్ర

NRI TDP

చైతన్యరథం



# అమెరికాలో 'కూచిపూడి' వైభవం

## తెలుగు కీర్తిని ఇనుమడింపచేస్తున్న విభా యాదవల్లి

**టెక్సాస్:** భారతీయ సనాతన శాస్త్రీయ నృత్యరూపమైన కూచిపూడిని అమెరికాలో ప్రచారం చేస్తూ తెలుగు కీర్తిని ఇనుమడింపజేస్తున్నారు యువ నర్తకి విభా యాదవల్లి. టెక్సాస్‌లోని లేక్ టావిస్ హైస్కూల్ వర్సిటీలో జూనియర్ విద్యార్థినిగా చదువుతున్న విభా... 16 సంవత్సరాల వయసులోనే నాట్య రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఆమె నాట్య ప్రయాణం కాలిఫోర్నియాలో లక్ష్మీభవానీ కొండూరు వద్ద ప్రారంభమైంది. అక్కడ కూచిపూడికి బలమైన పునాది వేసుకున్న విభా 2021లో టెక్సాస్‌కు మకాం మార్చాక ప్రముఖ నాట్యాచార్యులు రాజీ రాయప్రోలు, పసుమర్తి వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకుంది. తల్లిదండ్రులు జోత్న, శ్రీరాం యాదవెల్లి ప్రోత్సాహంతో గురువుల అండదండలతో ఆమె నృత్యంలో అభినయం, భంగిమలు, లయబద్ధత సంప్రదాయ సౌందర్యం మరింత



పరిపూర్ణమయ్యాయి.

### కథకురాలిగా, కళాకారిణిగా విజయాలు

ఆస్టిన్ పరిసర ప్రాంతాల్లో జరిగిన అనేక సాంస్కృతిక కార్యక్రమాలు, నాట్య నాటికలు, రిసైటిల్స్‌లో సామాజిక వేదికలపై ప్రదర్శనలు ఇస్తూ విభా ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తోంది. తన హావభావాలతో పాత్రలకు జీవం పోస్తూ మంచి కథకురాలిగానూ ఆహూతుల ప్రశంసలు అందుకుంది. కేవలం కూచిపూడికే పరిమితం కాకుండా తన హైస్కూల్ వర్సిటీ డ్యాన్స్ టీమ్‌లోనూ క్రియాశీలక సభ్యురాలిగా రాణిస్తున్నారు. ఇది ఆమెలో నాయకత్వ లక్షణాలు, టీమ్ వర్క్, క్రమశిక్షణ పెంపొందించింది. శాస్త్రీయ, కంటెంపరరీ (సమకాలీన) నృత్యాలను సమపాళ్లలో అభ్యసిస్తూ తన కళా దృష్టిని మరింత విశాలం చేసుకుంది. తన విజయానికి గురువులతో పాటు కుటుంబ సభ్యులు నిత్యం అండగా నిలిచారని చెప్తోంది. సంవత్సరాల తరబడి చేసిన కఠిన సాధన తాలూకు ఫలాలను ఆస్వాదిస్తూ కూచిపూడి వైభవాన్ని భావితరాలకు చాటిచెప్పడమే తన లక్ష్యం అంటోంది.



# శ్రీకృత్ నోట గీతా ప్రవాహం

**భగవద్గీతలో 700 శ్లోకాలను ఏకధాటిగా పఠించిన ఐదేళ్ల బాలుడు**

**బంగారు పతకం బహూకరించిన మైసూరు దత్త పీఠాధిపతి**

**డల్లాస్:** ఓనమాలు దిద్దే వయసులోనే అపారమైన జ్ఞాపక శక్తితో ఓ తెలుగు బాలుడు అందరినీ అబ్బురపరిచాడు. భగవద్గీతలోని 700 శ్లోకాలను ఏకధాటిగా పఠించి దత్త పీఠాధిపతి నుంచి బంగారు పతకం అందుకున్నాడు. అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం డల్లాస్‌లో మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి ఆధ్వర్యంలో భగవద్గీత సంపూర్ణ పారాయణ మహాయజ్ఞం నిర్వహించారు. 18 దేశాల నుంచి వేలాది మంది ప్రవాస భారతీయులు రాగా టెక్సాస్‌లోని ఆస్టిన్‌లో నివసిస్తున్న శరణ్-శృతి దంపతుల ఐదేళ్ల కుమారుడు శ్రీకృత్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. భగవద్గీతలోని 18 అధ్యాయాలకు చెందిన 700 శ్లోకాలను స్పష్టమైన ఉచ్చారణతో ఏకధాటిగా పఠించి అక్కడ ఉన్నవారందరినీ ఆశ్చర్యపరిచాడు. బాలుడి అద్భుత ప్రతిభకు ముగ్ధుడైన గణపతి సచ్చిదానందస్వామి శ్రీకృత్‌కు స్వర్ణ పతకం బహూకరించి ఆశీర్వదించారు.

యానాం జవహర్ నవోదయ విద్యాలయం మాజీ ప్రిన్సిపల్ టీవీఎస్ ప్రకాశరావు (శృతి తండ్రి) మనవడే ఈ శ్రీకృత్. యానాంలో జన్మించిన శ్రీకృత్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులైన తన తల్లిదండ్రులతో కలిసి ఐదేళ్ల క్రితం ఆస్టిన్ వెళ్లాడు. తమ కుమారుడికి చిన్నతనం నుంచే భారతీయ సంస్కృతి, సనాతన ధర్మంపై అవగాహన కల్పిస్తూ భగవద్గీత శ్లోకాలను కంఠస్థం చేయించినట్టు శ్రీకృత్ తల్లిదండ్రులు చెప్పారు.

# ఖతార్ ప్రయాణికులకు బిగ్ రిలీఫ్

**'కంట్రోల్డ్ మెడిసిన్స్'కు ఈ-పర్మిట్ వ్యవస్థ ప్రారంభం**

**దోహా:** ఖతార్‌లోకి ప్రవేశించే లేదా అక్కడి నుంచి విదేశాలకు వెళ్లే ప్రయాణికులకు ఆ దేశ ప్రజారోగ్య మంత్రిత్వ శాఖ తీపి కబురు అందించింది. వ్యక్తిగత వినియోగానికి 'కంట్రోల్డ్ మెడిసిన్స్'ను వెంట



తీసుకెళ్లేందుకు వీలుగా కొత్తగా ఆన్‌లైన్ 'ఎలక్ట్రానిక్ పర్మిట్' వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. ఇకపై ప్రయాణికులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఇంటి నుంచే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు పురోగతిని ఎప్పటికప్పుడు ట్రాక్ చేసుకునే వెసులుబాటు కూడా కల్పించారు. అనుమతి మంజూరైన తర్వాత ఈ-పర్మిట్ డిజిటల్ రూపంలోనే అందుబాటులోకి వస్తుంది. ప్రయాణ తేదీకి కనీసం ఐదు పని దినాల ముందే దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. 'నేషనల్ ఆథెంటికేషన్ సిస్టమ్' ద్వారా లాగిన్ అయి చెల్లుబాటయ్యే వైద్యుల ప్రిస్క్రిప్షన్‌తో పాటు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. పత్రాలన్నీ సమర్పించిన తర్వాత మూడు పని దినాల్లో దరఖాస్తును పరిశీలించి నిర్ణయం తీసుకుంటారు. ప్రజారోగ్య మంత్రిత్వ శాఖలోని ఫార్మసీ-డ్రగ్ కంట్రోల్ విభాగం ఈ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా అనుమతులు జారీ చేస్తుంది. ప్రభుత్వ సేవలను పూర్తిగా డిజిటలీకరించి ప్రయాణికులకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించాలనే లక్ష్యంతోనే ఈ కొత్త వ్యవస్థను ప్రవేశపెట్టినట్టు ఖతార్ ప్రజారోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇందుకు సంబంధించిన సమగ్ర మార్గదర్శకాలు, నిబంధనలు, అనుమతించిన మందుల జాబితాను తమ అధికారిక పోర్టల్‌లో అందుబాటులో ఉంచినట్టు తెలిపింది.

# ప్రవాసాంధ్రుడి కుటుంబానికి ఏపీఎన్ఆర్టీ అండ

**కువైట్‌లో ముమ్మిడివరపు శ్రీను ఆకస్మిక మృతి... కో-ఆర్డినేటర్లు, ఎన్నారై టీడీపీ నేతల చొరవతో స్వదేశానికి మృతదేహం**

**ముమ్మిడివరం/అమరావతి (చైతన్యరథం):** ఉపాధి కోసం కువైట్ వెళ్లిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం ప్రాంతానికి చెందిన ముమ్మిడివరపు శ్రీను ఆకస్మికంగా మృతి చెందాడు. క్లిష్ట సమయంలో అతడి కుటుంబానికి ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ అండగా నిలిచింది. వేగవంతమైన చర్యలు చేపట్టి భౌతికకాయాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చింది. కువైట్‌లోని భారత రాయబార కార్యాలయంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ మృతదేహం తరలింపు ప్రక్రియను వేగవంతం చేశారు. ఏపీఎన్ఆర్టీఎస్ రీజినల్ కో-ఆర్డినేటర్లు ముస్తాక్ ఖాన్, దివాకర్‌నాయుడు ఓలేటి, ఎన్నారై టీడీపీ సెంట్రల్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాచూరి మోహన్, సీనియర్ నాయకుడు మురళి దుగ్గినేనితో పాటు ఎన్ఆర్టీ కో-ఆర్డినేటర్లు దొడ్డిపల్లి సుబ్బరాజు, మాబు బాష, దొర్ల సాయిబాబా తదితరులు క్షేత్రస్థాయిలో అవసరమైన సహాయక చర్యలు అందించారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, ఎన్ఆర్ఐ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ నాయకత్వంలో ప్రవాసాంధ్రుల సంక్షేమానికి ఏపీ ప్రభుత్వం



అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ప్రతినిధులు తెలిపారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని ఏపీఎన్ఆర్టీ అధ్యక్షుడు డాక్టర్ రవికుమార్ వేమూరి, గల్ఫ్, ప్రాచ్య దేశాల ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి రావి రాధాకృష్ణ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ మార్గదర్శకాలను అందించారు. ఏపీఎన్ఆర్టీ డైరెక్టర్ (ఆపరేషన్స్ & సర్వీసెస్) నాగేంద్రబాబు అక్కిలి విభిన్న వర్గాల మధ్య సమన్వయం పునర్నిర్మిస్తూ ప్రక్రియ వేగవంతం కావడంలో కీలక పాత్ర పోషించారు.

ముమ్మిడివరపు శ్రీను ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని



ఏపీఎన్ఆర్టీ వర్గాలు ప్రగాఢ సానుభూతి తెలియజేశాయి.

# గోబర్ధన్ పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం



ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన గురువారం కేంద్ర మంత్రిమండలి సమావేశం జరిగింది. ఈ కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులకు ప్రధాని దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు కేంద్ర కేబినెట్‌లో ప్రధాని మోదీ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బయోగ్యాస్ ఉత్పత్తిని ప్రోత్సహించాలని నిర్ణయించారు. రూ.23,731 కోట్ల 'గోబర్ధన్' జాతీయ సర్క్యులర్ బయోఎనర్జీ పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. 2026-27 నుంచి 2035-36 వరకు కేంద్రం అమలు చేయనుంది. వ్యవసాయ అవశేషాలు, పశువుల పేడ, సేంద్రీయ వ్యర్థాలతో కంప్రెస్డ్ బయోగ్యాస్ ఉత్పత్తి చేయనుంది. దేశీయ సీబీజీ ఉత్పత్తిని దాదాపు పది రెట్లు పెంచడమే లక్ష్యమని కేంద్ర మంత్రులు తెలిపారు. దిగుమతి సహజవాయువుపై ఆధారాన్ని తగ్గించి ఇంధన భద్రతకు బలం చేకూర్చనుందని వెల్లడించారు. రైతులు, గ్రామీణ పారిశ్రామికవేత్తలు, సహకార సంఘాలకు కొత్త ఆదాయ అవకాశాలు వస్తాయని మంత్రులు పేర్కొన్నారు. అస్సాంలో నాలుగు లేన్ల నేషనల్ హైవేకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. రూ.8,970 కోట్లతో అస్సాంలో నేషనల్ హైవే నిర్మించాలని మంత్రులు నిర్ణయించారు.



# విమాన ఇంధనంలో ఇథనాల్ కలిపే ప్రసక్తి లేదు

## తేల్చి చెప్పిన కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

విమాన ఇంధనంలో ఇథనాల్ కలిపే ప్రసక్తే లేదని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తేల్చి చెప్పారు. ఇథనాల్ కలుపుతున్నారంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని ఆయన పేర్కొన్నారు. ప్రయాణికుల్లో అనవసర ఆందోళనలు కలిగించేలా బాధ్యతారాహిత్యంగా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయొద్దని విజ్ఞప్తి చేశారు. విమాన ఇంధనంలో ఇథనాల్ బ్లెండింగ్ చేపడుతున్నారనే వార్తల్లో ఎలాంటి నిజం లేదని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. ఇథనాల్, సస్టైనబుల్ ఏవియేషన్ ఫ్యూయల్ పూర్తిగా వేరని, రెండింటికీ ఎలాంటి సంబంధం లేదని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఇథనాల్‌ను విమాన ఇంధనంగా



ఉపయోగించడం లేదని, ఎస్ఏఎఫ్ అనేది అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ప్రత్యేకంగా తయారుచేసే ప్రత్యామ్నాయ విమాన ఇంధనమని వివరించారు. ప్రయాణికుల భద్రతే కేంద్ర ప్రభుత్వానికి తొలి ప్రాధాన్యమని రామ్మోహన్ నాయుడు పునరుద్ఘాటించారు. విమానయాన భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, అన్ని నిర్ణయాలు అత్యున్నత భద్రతా ప్రమాణాల మేరకే తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా కేంద్ర పౌర విమానయాన శాఖ కూడా కీలక ప్రకటన విడుదల చేసింది. విమాన ఇంధనంలో ఇథనాల్ కలుపుతున్నారనే ప్రచారాన్ని ఆ శాఖ ఖండించింది. అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ ఆమోదించిన కఠినమైన భద్రతా ప్రమాణాలకు అనుగుణంగానే సస్టైనబుల్ ఏవియేషన్ ఫ్యూయల్ ఉందని పేర్కొంది. విమానయాన భద్రతకు సంబంధించిన అంశాలపై నిర్ధారణ లేని సమాచారాన్ని నమ్మవద్దని, అసత్య ప్రచారాలతో ప్రజల్లో భయాందోళనలు సృష్టించవద్దని విజ్ఞప్తి చేసింది.

# విడాకులిచ్చే అధికారం మత సంస్థలకు లేదు

## స్పష్టం చేసిన మధ్యప్రదేశ్ హైకోర్టు




మసీదు కమిటీ ఫత్వాపై మధ్యప్రదేశ్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. వివాహాన్ని రద్దు చేసే అధికారం ఏ మతపరమైన సంస్థలు, కమిటీలు, లేదా సెమినరీలకు లేదని స్పష్టం చేసింది. కేవలం మసీదు కమిటీ జారీ చేసిన ఫత్వా ఆధారంగా వివాహ బంధం రద్దు అయినట్లు పరిగణించలేమని తేల్చిచెప్పింది. చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించి రాజ్యాంగబద్ధమైన ఫ్యామిలీ కోర్టుల ద్వారానే విడాకులు పొందాల్సి ఉంటుందని న్యాయస్థానం పేర్కొంది. ఈ సందర్భంగా జస్టిస్ వివేక్ జైన్ ధర్మాసనం తీర్పు వెలువరించింది. విచారణ సందర్భంగా భోపాల్ 'దారుల్ దఫా మసాజిద్ కమిటీ' జారీ చేసిన ఫత్వా ఆధారంగా తన వివాహ బంధం రద్దు అయినట్లు ప్రకటించాలని కోరిన ఓ భర్త అభ్యర్థనను ధర్మాసనం తిరస్కరించింది. ఫత్వాకు స్వతంత్రంగా చట్టపరమైన గుర్తింపు లేదని, అది కోర్టు తీర్పునకు ప్రత్యామ్నాయం కాదని స్పష్టం చేసింది. వివాహ రద్దు వంటి అంశాల్లో తుది నిర్ణయం తీసుకునే అధికారం కేవలం కోర్టులకే ఉంటుందని వెల్లడించింది. అయితే, విడాకులు కోరే వ్యక్తికి చట్టప్రకారం సంబంధిత ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించి విడాకులు పొందే హక్కు ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. వివాహ రద్దు పిటిషన్ దాఖలు చేస్తే, దానిని సంబంధిత కోర్టు నిబంధనల ప్రకారం విచారిస్తుందని పేర్కొంది. కాగా, ఈ తీర్పు మతపరమైన ఫత్వాల చట్టబద్ధత, వివాహ రద్దు ప్రక్రియపై కీలకమైన స్పష్టతను ఇచ్చిందని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# నీట్, యూజీ పరీక్ష విధానంలో మార్పులపై కేంద్రం కసరత్తు




నీట్, యూజీ పరీక్ష విధానంలో మార్పులపై కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో కీలక అఫిడవిట్ దాఖలు చేసింది. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణలో సమూల మార్పులకు సన్నాహాలు చేస్తున్నట్లు కేంద్రం పేర్కొంది. పెన్, అండ్, పేపర్ విధానానికి స్వస్తి పలికి ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత (సీబీటీ) పరీక్ష నిర్వహణపై తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు అఫిడవిట్‌లో వెల్లడించింది. జేఈఈ తరహాలో నీట్ నిర్వహణకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపింది. నందన్ నిలేకని నేతృత్వంలోని హైపవర్ టాస్క్‌ఫోర్స్ సిఫార్సుల ఆధారంగానే తుది నిర్ణయం ఉంటుందని కేంద్రం పేర్కొంది. అలాగే, నీట్ అక్రమాల కేసుపై సీబీఐ విచారణ కొనసాగుతోందని ధర్మాసనానికి తెలిపింది. ఎన్టీఏ స్థానంలో స్వతంత్ర, బలమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని దాఖలైన పిటిషన్ల విచారణ నేపథ్యంలో కేంద్రం ఈ అఫిడవిట్ దాఖలు చేసింది. ఈ సందర్భంగా కేంద్రం సమర్పించిన అఫిడవిట్‌పై పిటిషనర్లను సుప్రీంకోర్టు సమాధానాలు కోరింది. అనంతరం కేసు తదుపరి విచారణను జస్టిస్ పీఎస్ నరసింహ ధర్మాసనం ఆగస్టు 19కి వాయిదా వేసింది. మరోవైపు, కంప్యూటర్ ఆధారిత విధానంలోకి మారితే ముందుగానే స్పష్టత ఇవ్వాలని కేంద్రానికి వైద్యుల సంఘం విజ్ఞప్తి చేసింది. పేపర్ లీకేజీలు, అక్రమాల నివారణకు 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ అమెండ్‌మెంట్ యాక్ట్-2026'ను కఠినంగా అమలు చేయాలని కోరింది. కాగా, పేపర్ లీక్ ఆరోపణలతో మే 3న నీట్ పరీక్ష రద్దవ్వగా.. జూన్ 21న ఎన్టీఏ రీ టెస్ట్ నిర్వహించి ఫలితాలు వెల్లడించింది.

# ఎయిర్‌గన్‌తో టెకీ వీరంగం

## పెల్లెట్లతో కాల్పులకు తెగబడడంతో బెంబేలెత్తిన స్థానికులు





బెంగళూరులో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఎయిర్ గన్‌తో రెచ్చిపోయాడు. విచక్షణారహితంగా కాల్పులు జరిపి పలువురిని తీవ్ర భయాందోళనలకు గురి చేశాడు. పలు వాహనాలు, సెక్యూరిటీ గార్డులపై పెల్లెట్ల వర్షం కురిపించడంతో టెకీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మద్యం మత్తులో నిందితుడు చేసిన ఈ పని స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. అనేకల్ శివారు బందాపూర్‌లోని సిపానీ అపార్ట్‌మెంట్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అనురాగ్ తివారీ (40) గత ఎనిమిది నెలలుగా అద్దెకు ఉంటున్నాడు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నోఅతడి స్వస్థలం కాగా గురువారం మధ్యాహ్నం మద్యం మత్తులో తివారీ రెచ్చిపోయాడు. తోటి అపార్ట్‌మెంట్ వాసులను తీవ్ర ఇబ్బందులకు గురి చేశాడు. తొలుత ఫోన్ మాట్లాడిన అతను.. గట్టిగట్టిగా కేకలు వేస్తూ అతవలి వ్యక్తిపై కోపగించాడు. అనంతరం బాల్కనీలోకి వెళ్లి ఎయిర్ గన్‌తో బీభత్సం సృష్టించాడు. పార్కింగ్ ఏరియాలో ఉన్న కార్లపై పెల్లెట్ల వర్షం కురిపించాడు. కాల్పుల శబ్దం విన్న అపార్ట్‌మెంట్ సెక్యూరిటీ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకున్నారు. అతడిని ఆపే ప్రయత్నం చేయగా.. వారిపైనా తివారీ కాల్పులకు తెగబడ్డాడు. భయాందోళనలకు గురైన సెక్యూరిటీ సిబ్బంది, అపార్ట్‌మెంట్ వాసులు వెంటనే సూర్యనగర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చే వరకు దాదాపు 45 నిమిషాల పాటు తివారీ కాల్పులు జరుపుతూనే ఉన్నాడు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు.. నిందితుడు తివారీని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి ఎయిర్ గన్ సహా పెల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తివారీ కాల్పులకు పాల్పడటానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

# సుంకాల బాదుడు సొమ్ము వెనక్కిస్తున్న అమెరికా

**- ఇప్పటికి 100 బిలియన్ల డాలర్ల మేర వాపస్**

ప్రపంచ దేశాలపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన అడ్డగోలు టారిఫ్‌లను అమెరికా సుప్రీంకోర్టు ఇటీవల కొట్టివేసిన నేపథ్యంలో తీర్పునకు ముందువరకు వసూలు చేసిన సుంకాలను ఆ దేశ ప్రభుత్వం రిఫండ్ చేస్తోంది. ఇప్పటివరకు 100 బిలియన్ డాలర్ల (రూ.9.5 లక్షలకోట్లకు పైగా) మేర సొమ్మును దిగుమతిదారులకు వెనక్కి ఇచ్చేసింది. రెండోదఫా అధికారంలోకి వచ్చిన తర్వాత అంతర్జాతీయ ఆర్థిక అధికారాల చట్టాన్ని ట్రంప్ ప్రయోగించారు. దానికింద పలు దేశాలపై భారీ సుంకాలతో విరుచుకుపడ్డారు. ఈ టారిఫ్ ల రూపంలో 166 బిలియన్ల డాలర్లను ట్రంప్ యంత్రాంగం వసూలు చేసింది. అయితే, ఇప్పుడు సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో ఆ సుంకాలు కట్టిన దిగుమతిదారులకు 100 బిలియన్ల డాలర్లను వాపసు ఇచ్చింది. కోర్టుకు సమర్పించిన నివేదికలో ఈ విషయాన్ని ట్రంప్ యంత్రాంగం వెల్లడించింది.

అధ్యక్షుడు ట్రంప్ తన పరిమితులను దాటి ఈ సుంకాలను విధించారని ఈ ఏడాది ఫిబ్రవరిలో సుప్రీం కోర్టు తన తీర్పులో పేర్కొన్న సంగతి తెలిసిందే. అధిక సుంకాల కింద కంపెనీల నుంచి వసూలుచేసిన




సొమ్ము వాపసు చేయాల్సిందేనని నాడు న్యాయస్థానం స్పష్టం చేసింది. కాగా.. కోర్టు తీర్పుతో చైనా, భారత్, జపాన్, దక్షిణ కొరియా, తైవాన్ లాంటి కీలకమైన ఆసియా దేశాలకు భారీ ఊరట లభించింది.

**ట్రంప్‌నకు త్రుటిలో తప్పిన ముప్పు**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు త్రుటిలో ప్రమాదం తప్పింది. ట్రంప్ ప్రయాణిస్తున్న మెరైన్ వన్ హెలికాప్టర్.. ప్రయాణికుల విమానానికి అతి సమీపానికి వెళ్లింది. ఆ సమయంలో అందులో ట్రంప్ ఉండటం.. ఇంకోవైపు ప్రయాణికుల విమానం కావడంతో తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. అమెరికా రాజధాని వాషింగ్‌టన్ గగనతలంలో ఒక మైలుకంటే తక్కువ దూరంలోకి హెలికాప్టర్, విమానం వచ్చాయి. అమెరికా కాలమానం ప్రకారం ఈ నెల నాలుగున ఈ ఘటన జరిగింది. ఎయిర్ ట్రాఫిక్ సిబ్బందితో కమ్యూనికేషన్ సరిగా లేకపోవడం వల్లే ఇలా జరిగినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత వెంటనే రెండింటి మధ్య నిర్దేశిత దూరం భారీగా తగ్గిందని గుర్తించిన ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ వెంటనే పైలట్లను అప్రమత్తం చేశారు. దాంతో ప్రమాదం తప్పింది. నిబంధనల ప్రకారం రెండు ఎయిర్‌క్రాఫ్ట్ మధ్య కనీసం మైలున్నర దూరం ఉండాలి.

ఈ ఘటనపై నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్, అమెరికా విమానయాన నియంత్రణసంస్థ దర్యాప్తు చేపట్టాయి. సమీక్ష జరిపి, తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించాయి. ఈ ఘటనపై వైట్ హౌస్ స్పందించింది. మెరైన్ వన్ హెలికాప్టర్లను అత్యంత ప్రతిభావంతులైన పైలట్లు నడుపుతారని, అధ్యక్షుడు ట్రంప్‌నకు ఎలాంటి ప్రమాదం జరగలేదని వెల్లడించింది. ఆ సమయంలో ట్రంప్ కాలిఫోర్నియాకు ప్రయాణిస్తున్నారు.

# రక్షణమంత్రిపై ట్రంప్ కస్సుబుస్సు!

**- ఇరాన్ యుద్ధం తెచ్చిన విభేదాలు**

అమెరికా– ఇరాన్ మధ్య ఘర్షణలు అటు ప్రపంచాన్ని.. ఇటు ఆ రెండు దేశాలను అన్ని రకాలుగా దెబ్బతీస్తున్నాయి. అంతే కాకుండా ఈ యుద్ధం అమెరికా అగ్రనాయకుల మధ్య విభేదాలకు కారణమవుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. గత నాలుగు నెలలుగా కొనసాగుతున్న యుద్ధం కారణంగా సైనిక శక్తి అయిన అగ్రరాజ్యం వద్ద క్షిపణి నిల్వలు పడిపోతున్నాయని ఇప్పటికే పలు కథనాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ మధ్య వాగ్వాదం జరిగిందని సమాచారం. అధ్యక్షుడి అధికారిక నివాసం క్యాంప్ డేవిడ్‌లో ఇటీవల జరిగిన సమావేశంలో ఇదే అంశంపై డొనాల్డ్ ట్రంప్, రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ మధ్య వాగ్వాదం జరిగిందని అమెరికా మీడియాలో వార్తలు వచ్చాయి. తరిగిపోతున్న నిల్వలపై తనకు పూర్తి సమాచారం ఎందుకు ఇవ్వలేదని మంత్రిపై అధ్యక్షుడు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు అమెరికా మీడియా కథనం వెల్లడించింది. ఇరాన్ యుద్ధం ప్రారంభమైన దగ్గరి నుంచి అధ్యక్షుడు, రక్షణమంత్రి మధ్య పెరుగుతోన్న అంతరాన్ని ఈ వ్యవహారం వెల్లడి చేస్తోందని పేర్కొంది.

కీలకమైన ఆయుధాల కొరత కారణంగా ఇరాన్‌పై పూర్తిస్థాయిలో దాడులు చేపట్టలేని పరిస్థితి వచ్చిందంటూ హెగ్సెత్‌పై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఆయుధాల కొరత సమస్య పరిష్కారమవుతుందని తాను భావించానని, కానీ అది పరిష్కారం కాలేదో తనకు సమాధానం ఇవ్వాలని మండిపడినట్లు ట్రంప్ సన్నిహిత వర్గాలను ఉటంకిస్తూ మీడియా కథనం పేర్కొంది.

కాగా, అధ్యక్షుడు, రక్షణ మంత్రి మధ్య విభేదాలంటూ వచ్చిన వార్తలను అధ్యక్ష భవనం వైట్‌హౌస్ ఖండించింది. ఈ కథనం పూర్తిగా అసత్యమని, మీడియా ప్రచారం చేస్తున్న సమాచారం వాస్తవాలకు విరుద్ధమని స్పష్టం చేసింది. ట్రంప్–హెగ్సెత్ మధ్య ఎలాంటి వాగ్వాదం జరగలేదని, అధ్యక్షుడికి అవసరమైన అన్ని భద్రతా వివరాలు క్రమం తప్పకుండా అందుతున్నాయని పేర్కొంది. అమెరికా సైనిక సామర్థ్యంపై ప్రజలు



ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కూడా స్పష్టం చేసింది.

**చౌక డ్రోన్లతో బెంబెలెత్తిస్తున్న ఇరాన్**

ప్రస్తుత యుద్ధంలో ఇరాన్ చౌకగా తయారు చేసిన డ్రోన్లను భారీ సంఖ్యలో వినియోగిస్తోంది. ఒక్కో డ్రోన్ ధర కేవలం 20 వేల నుంచి 50వేల డాలర్లలోపే. అయితే వీటిని ఎదుర్కోవడానికి అమెరికా వినియోగిస్తున్న ఒక్కో ఇంటర్‌సెప్టార్ క్షిపణి ధర మాత్రం 1.5 మిలియన్ డాలర్ల పైమాటే. అంతే కాకుండా గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు తీవ్రం వేయడంతో అమెరికాకు చెందిన అనేక స్థావరాలు దెబ్బతిన్నాయి. వాటిని రక్షించడానికి పేట్రియాట్ ఎయిర్ డిఫెన్స్ ఇంటర్‌సెప్టార్లు, ఇతర ఆయుధాలను పెద్ద మొత్తంలో ఉపయోగించింది. ఫలితంగా థాడ్, పేట్రియాట్ వంటి క్షిపణుల కొరత ఏర్పడిందని ఇప్పటికే వార్తలు వచ్చాయి.

ఇరాన్‌పై భీకర దాడులు చేస్తామని, అవి రెండో ప్రపంచం యుద్ధం తర్వాత జరిగే శక్తిమంతమైన దాడులని హెచ్చరించిన ట్రంప్ తర్వాత చర్చలు జరుగుతాయని ప్రకటించారు. ఆయుధాల కొరత వార్తల తర్వాతే అమెరికా దాడులకు విరామం ఇవ్వడం గమనార్హం.

# ఇమ్రాన్‌కు న్యాయం జరగాలి

**- పాక్ ప్రభుత్వానికి పీటీఐ సెప్టెంబర్ 17 డెడ్ లైన్**



*పాక్ మాజీ ప్రధాని, పాకిస్థాన్ తెహ్రీకే ఇన్సాఫ్ (పీటీఐ) పార్టీ అధ్యక్షుడు ఇమ్రాన్‌ఖాన్‌కు న్యాయం చేయాలంటూ ఆ పార్టీ నేతలు ఆందోళనల బాటపట్టారు. ఇమ్రాన్ అరెస్టు అయి మూడేళ్లవుతోంది. ఈ క్రమంలోనే ఆయనను వెంటనే విడుదల చేయాలని, జైల్లో ఉన్న ఆయన హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ.. పాక్ వ్యాప్తంగా మళ్లీ నిరసనలు చోటుచేసుకున్నాయి. ఈ సందర్భంగా జరిగిన ఘర్షణల్లో 100 మందికి పైగా అరెస్టయ్యారు.*

*ఈ నిరసనలు ప్రధానంగా పీటీఐ పార్టీ అధికారంలో ఉన్న ఖైబర్ పఖ్తుంఖ్వాలో ప్రారంభమయ్యాయి. ఇమ్రాన్ కు తన హక్కులను తిరిగి కల్పించాలంటూ లాహోర్, రావల్పిండి, కరాచీ సహా పలు నగరాల్లో ఆయన మద్దతుదారులు భారీ ప్రదర్శనలు నిర్వహించారు. వారిని చెదరగొట్టడానికి పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. బాష్పవాయువును ప్రయోగించారు.*

*సెప్టెంబర్ 27 డెడ్లైన్..*

*ఖైబర్ పఖ్తుంఖ్వా ముఖ్యమంత్రి, పీటీఐ నేత ముహమ్మద్ సోహైల్ అఫ్రిదీ.. పాక్ ప్రభుత్వానికి సెప్టెంబర్ 27 డెడ్‌లైన్ విధించారు. ఇమ్రాన్, ఆయన సతీమణిపై పెట్టిన కేసుల్లో న్యాయపరమైన విచారణ జరగాలని, తన న్యాయవాదులను, వైద్యసిబ్బందిని మాజీ ప్రధాని కలుసుకునేందుకు అనుమతించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు రాజధాని నగరం పెషావర్ లో పార్టీ మద్దతుదారులతో మాట్లాడారు. ఆయనకు న్యాయం దక్కకపోతే పాక్ ప్రజలు సెప్టెంబర్ 27న ఇస్లామాబాద్‌కు దండయాత్రగా వస్తారని హెచ్చరించారు.*

*ఇదిలా ఉంటే.. జైల్లో ఉన్న ఇమ్రాన్‌కు సరైన వైద్య సహాయం అందడం లేదని, చూపు మందగించిందని ఆయన కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తోన్న సంగతి తెలిసిందే. గత మూడేళ్లుగా ఇమ్రాన్ ఖాన్‌కు న్యాయమైన విచారణ హక్కును తిరస్కరించారని, సుదీర్ఘకాలం పాటు ఏకాంత నిర్బంధంలో ఉంచారని మానవ హక్కుల సంస్థ అమ్నెస్టీ ఇంటర్నేషనల్ కూడా ఆరోపించింది.*

# అదృష్టం అంటే ఆమెదే!

**- చెత్తలో పారేసిన లాటరీ టికెట్ తిరిగి చేతికి**

**- వరించిన రూ.11 కోట్ల నగదు బహుమతి**

చెత్తబుట్టలో పారేసిన లాటరీ టికెట్ తిరిగి దొరికి రూ.11 కోట్ల నగదు చేతికందటంతో ఆ మహిళ ఆనందం వర్ణణాతీతం. ఇటలీలో ఓ మహిళకు దాదాపు రూ.11 కోట్ల లాటరీ తగిలినా.. ఆ విషయం తెలియక టికెట్‌ను చెత్తబుట్టలో పడేసింది. అయితే పారిశుద్ధ్య కార్మికుల అంగుళం అంగుళం వెతికిన తరువాత టికెట్ తిరిగి దొరకడంతో ఆమె ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.



దక్షిణ ఇటలీలోని బిటోంటో పట్టణానికి చెందిన ఓ మహిళ ఎప్పటిలాగే తనకు ఇష్టమైన నంబర్లతో లాటరీ టికెట్ కొనుగోలు చేసింది. ఫలితాలు చూసేందుకు ఓ దుకాణానికి వెళ్లగా.. "నాన్ పేయబుల్" అని కనిపించింది. దానిని తప్పుగా అర్థం చేసుకున్న ఆ మహిళ టికెట్‌కు బహుమతి రాలేదని భావించి.. దానిని అక్కడే చెత్తబుట్టలో పడేసింది. ఇంటికి చేరుకున్న తర్వాత కుటుంబ సభ్యులు అసలు విషయం చెప్పారు. భారీ మొత్తంలో బహుమతి వచ్చినప్పుడు దుకాణంలో లాటరీ తగిలిన వారికి ఇచ్చేందుకు అవసరమైన నగదు లేనప్పుడు "నాన్ పేయబుల్' అనే సందేశం వస్తుందని వివరించారు. వెంటనే పరిగెత్తుకుంటూ టికెట్ పడేసిన ప్రాంతానికి వెళ్లిన ఆమెకు అక్కడ నిరాశే ఎదురైంది. అప్పటికే పారిశుద్ధ్య కార్మికులు అక్కడ ఉన్న చెత్తను తరలించారు. దీంతో ఆమె వెంటనే వ్యర్థాల నిర్వహణ సంస్థ అధికారులను ఆశ్రయించారు. పారిశుద్ధ్య కార్మికులు రెండురోజుల పాటు శ్రమించి టికెట్‌ను గుర్తించారు. టికెట్ దొరికిందని తెలిసి మహిళ ఆనందంతో కన్నీళ్లు పెట్టుకుందని అధికారులు తెలిపారు.

# తొలిరోజు నుంచే దీటుగా బదులిద్దాం

మొన్నటి వరకు వన్డేలు, టీ 20లు ఆడిన భారత జట్టు ఇప్పుడు టెస్టు ఫార్మాట్‌లో రంగంలోకి దిగేందుకు సిద్ధమైంది. ఇందుకోసం ఇప్పటికే శ్రీలంకకు చేరుకొన్న టీమిండియా.. ఆ జట్టుతో రెండు టెస్టుల సిరీస్‌ను ఆడనుంది. ఆగస్టు 15 నుంచి గాలె వేదికగా మొదటి టెస్టు ప్రారంభం కానుంది. దానికంటే ముందు.. శుక్రవారం నుంచి మూడు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్ ఆడనుంది. కొలంబో క్రికెట్ క్లబ్ మైదానంలో శ్రీలంక ఎలెవన్‌తో జరిగే వార్మప్ మ్యాచ్‌లో భారత్ తలపడనుంది. ఈ మ్యాచ్ ఉదయం 10 గంటలకు మొదలుకానుంది. స్పిన్‌కు అనుకూలించే శ్రీలంక పిచ్‌లను అర్థం చేసుకోవడానికి వార్మప్ మ్యాచ్ టీమ్ ఇండియాకు బాగా ఉపయోగపడనుంది.

ఈ క్రమంలో టీమ్ ఇండియా ఆటగాళ్లకు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ కీలక సూచనలను చేశాడు. ఆ వీడియోను బీసీసీఐ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది. మన ముందు ఏ లక్ష్యం ఉందో మనకు తెలుసు. ఎందుకోసం ఆడుతున్నామో తెలుసు. పరిమితులను అధిగమించగలం, ఏదైనా సాధించగలం. అన్ని విభాగాల్లోనూ సత్తా చూపించగలం. బ్యాటింగ్, బౌలింగ్ ఏదైనా సరే.. ఆగస్టు 15 ఉదయం నుంచి మనకు ఎదురయ్యే ప్రతి సవాలుకు జవాబు ఇచ్చేందుకు సిద్ధంగా ఉండాలి. ఇప్పట్నుంచే అందుకోసం సన్నద్ధమవుదాం. ఇప్పుడు మనతోపాటు ఇద్దరు కొత్త ప్లేయర్లు ఉన్నారు. వారిద్దరికి శుభాకాంక్షలు చెబుతున్నా. సారాంశ్ ఇక్కడి వరకు వచ్చేందుకు చాలా కష్టపడ్డావు. ఎప్పుడు అవకాశం వచ్చినా దేశం, కుటుంబం గర్వపడేలా చేస్తావని ఆశిస్తున్నా. ఇక ఆకిబ్ నబీకి స్వాగతం. గత సీజన్లో అదరగొట్టావు. జమ్ముకశ్మీర్ జట్టు రంజీ ట్రోఫీని నెగ్గడంలో కీలక పాత్ర పోషించావు. ఇక, మనతోపాటు పనిచేసేందుకు శుభదీప్ ఘోష్ (ఫీల్డింగ్ కోచ్) వచ్చారు. చాలా జట్లతో గత కొన్నేళ్లుగా ఆయన వర్క్ చేశారు. ఆయన నిబద్ధత, ఎనర్జీ లెవల్స్ అద్భుతం. తన ప్రతిభతో మనందరిని లక్ష్యం దిశగా తీసుకెళ్తారని ఆశిస్తున్నా అని గౌతమ్ గంభీర్ వ్యాఖ్యానించాడు.

**ప్రాక్టీస్ మ్యాచ్‌కు శ్రీలంక జట్టు ప్రకటన**

భారత్‌తో ప్రాక్టీస్ మ్యాచ్ కోసం 15 మందితో శ్రీలంక జట్టును ప్రకటించింది. యువ బౌలింగ్ ఆల్‌రౌండర్ సోనల్ దినూషను కెప్టెన్‌గా ఎంపిక చేశారు. ప్రధాన జట్టులో చోటు దక్కించుకోవడం కోసం పోటీపడుతున్న ఏడుగురు కీలక ఆటగాళ్లు శ్రీలంక ఎలెవన్ టీమ్‌లో ఉన్నారు. కెప్టెన్ దినూషతో పాటు పేసర్లు లహిరు కుమార, విశ్వ ఫెర్నాండో, ఆఫ్ స్పిన్నర్ రమేశ్ మెండిస్, నిషాన్ మదుష్క, పవన్ రత్నాయకే అంజల బండార ఈ జాబితాలో ఉన్నారు. ఇంతకు ముందు ఇండియా ఏతో మ్యాచ్‌లో 10 వికెట్లు తీసి ఆకట్టుకున్న లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ దిలుమ్ సుదీర, ఐదు వికెట్లు పడగొట్టిన కేసర నువాంత వంటి ప్రతిభావంతులు కూడా శ్రీలంక ఎలెవన్ జట్టులో చోటు దక్కించుకున్నారు. ఆగస్టు 15 నుంచి మొదలుకానున్న రెండు టెస్టుల సిరీస్ కోసం శ్రీలంక ఇంకా అధికారికంగా జట్టును ప్రకటించలేదు.



## సీఓఈ తీరుపై బీసీసీఐ ఆగ్రహం

**- చీఫ్ ఫిజియోపై ప్రశ్నల వర్షం**



ఆటగాళ్ల గాయాల విషయంలో బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) తీరుపై విమర్శలు వస్తున్నాయి. అక్కడికి వెళ్లిన ఆటగాళ్లు బరువు అధికంగా పెరుగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. బౌలర్ హర్షిత్ రాణా సీవోఈకి వెళ్లాక నాలుగు కేజీల బరువు పెరిగాడట. దీనివల్లే అతడు ఇంగ్లాండ్ తో వన్డే సిరీస్ సమయంలో గాయపడినట్లు వార్తలు వచ్చాయి. దీనిపై వివరణ ఇవ్వాలని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా కూడా సీఓఈని అడిగినట్లు కథనాలు వస్తున్నాయి. మరోవైపు యో-యో టెస్టు స్థానంలో అమలు చేస్తోన్న బ్రాంకో టెస్టుపైనా బీసీసీఐ పెద్దలు అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. దీంతో సీవోఈలో పెను మార్పులకు క్రికెట్ బోర్డు శ్రీకారం చుట్టబోతున్నట్లు తెలుస్తోంది.

ఆటగాళ్ల ఫిట్‌నెస్ ప్రమాణాలు పడిపోవడానికి గల కారణాల గురించి చీఫ్ ఫిజియో కమలేశ్ జైన్‌పై బీసీసీఐ ప్రశ్నల వర్షం కురిపించినట్లు క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. ఇంగ్లాండ్ పర్యటన సమయంలో పలువురు ప్లేయర్లు కండరాలు పట్టేయడం వంటి సమస్యతో బాధపడ్డారు. అలాగే అధిక బరువుతో ఉన్నప్పటికీ హర్షిత్‌కు క్లీన్‌చిట్ ఇవ్వడంపైనా ఆగ్రహం వ్యక్తమైంది. ఆటగాడి స్థాయిని చూసి కంగారు పడాల్సిన అవసరం లేదు.. సంతృప్తిగా అనిపించని అంశాలను నిర్భయంగా ప్రస్తావించాలని కమలేశ్‌కు బీసీసీఐ బాధ్యులు సూచించారు. ఎందుకంటే కొందరి ఆటగాళ్ల కదలికలు మైదానంలో సరిగ్గా లేవనిపించింది. మరీ ముఖ్యంగా సీనియర్ బ్యాటర్లు ఎక్కువ సమయం క్రీజ్‌లో ఉన్నప్పుడు.. వికెట్ల మధ్య వేగంగా పరిగెత్తడంలో ఇబ్బంది పడుతున్నారు. ఫీల్డింగ్‌లో చురుకుగా కదిలేవారి సంఖ్య తగ్గిపోయింది. ఇక హర్షిత్ రాణా బరువు 4 కిలోలు ఎక్కువగా ఉందని మేనేజ్మెంట్ గుర్తించింది. ఈ విషయంలో సీవోఈ మరింత అప్రమత్తంగా ఉండాల్సింది. అతడి బరువు 96 కిలోలకు మించకూడదని సిబ్బంది ఇప్పుడు సూచించారు. ప్రస్తుతం 94 కేజీల బరువుతో ఉన్నాడు. అయితే, ఇంగ్లాండ్ పర్యటనకు అతడిని ఎంపిక చేసినప్పుడు బరువు 97 కేజీల వరకూ ఉంది. దీనిపైనా చీఫ్ ఫిజియోను బీసీసీఐ వివరణ కోరినట్లు ఆ వర్గాలు తెలిపాయి.

## మ్యాచ్ జరుగుతుండగా మైదానంలో పిడుగు

**ఫుట్‌బాల్ క్రీడాకారుడు మృతి**





దక్షిణ థాయ్‌లాండ్‌లో ఫుట్‌బాల్ మ్యాచ్ జరుగుతుండగా ఊహించని పరిణామం చోటుచేసుకుంది. గోలోక్ ఎఫ్ఏ కప్-2026 సెమీఫైనల్ మ్యాచ్ జరుగుతుండగా, హఠాత్తుగా మైదానంలో పిడుగు పడింది. ఈ విషాదకర ఘటనలో సోఫ్వాన్(24) అనే ఫుట్‌బాల్ ప్లేయర్ మృతి చెందగా, మరో 12 మంది ఆటగాళ్లు తీవ్రంగా గాయపడ్డారు. పిడుగుపడిన దృశ్యాలు కెమెరాల్లో రికార్డయ్యాయి. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

పిడుగుపాటుకు మైదానంలోనే కుప్పకూలిన సోఫ్వాన్‌కు వైద్య బృందం సీపీఆర్ చేసేందుకు ప్రయత్నించారు. కానీ అప్పటికే అతడు మరణించినట్లు తేలింది. ఇక పిడుగు పాటుకు గాయపడ్డవారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. దక్షిణ థాయ్‌లాండ్ సరిహద్దులో జరిగే ఫుట్‌బాల్ టోర్నమెంట్లలో ఇదే అతిపెద్ద టోర్నీ. ఇందులో థాయ్‌లాండ్ సహా మలేషియా ఆటగాళ్లు కూడా తలపడుతుంటారు. అయితే మ్యాచ్‌కు ముందు భారీ వర్షం కురిసిందని స్థానికులు చెబుతున్నారు. వర్షం ఆగిపోవడంతో మ్యాచ్ నిర్వహించామని, ఇలా హఠాత్తుగా పిడుగు గ్రౌండ్‌లో పడుతుందని ఊహించలేకపోయామని, తమ సహచరుడైన సోఫ్వాన్‌ను కోల్పోవడం బాధాకరమని గోలోక్ క్లబ్ నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేశారు.

## బట్లర్.. టీ20ల్లో అత్యధిక పరుగుల హిట్టర్

**- తన రికార్డును వైభవ్ బద్దలు కొడతాడని జోస్యం**



ఇంగ్లాండ్ ఆటగాడు జోస్ బట్లర్ చరిత్ర సృష్టించాడు. టీ20ల్లో టాప్ స్కోరర్ గా నిలిచాడు. ఇప్పటి వరకు ఆ జాబితాలో విండీస్ మాజీ క్రికెటర్ కీరన్ పొలార్డ్ (14,800 పరుగులు) ఉండేవాడు. అందుకోసం పొలార్డ్ 746 మ్యాచులు తీసుకొన్నాడు. ఇప్పుడు బట్లర్ కేవలం 522 మ్యాచుల్లోనే 14,833 పరుగులు చేసి అగ్రస్థానం సాధించాడు. ప్రస్తుతం ది హండ్రెడ్ టోర్నీలో బట్లర్ ఆడుతున్నాడు. మాంచెస్టర్ సూపర్ జెయింట్స్ తరఫున బరిలోకి దిగిన అతడు వెల్ష్ ఫైర్ జట్టుపై కేవలం 20 బంతుల్లోనే 51 పరుగులు చేశాడు.

ఈ సందర్భంగా బట్లర్ మాట్లాడుతూ క్రికెట్ ఎంత వేగంగా మారుతుందో అనిపిస్తుంటుందన్నాడు. ఒక రోజు దారుణమైన పరిస్థితిని ఎదుర్కొంటాం. మరో రోజు అదృష్టం కలిసొస్తుంది. కొన్ని నెలల కిందట ఫామ్ కోసం ఇబ్బంది పడ్డా. ఇప్పుడు నా కెరీర్‌లోనే అత్యుత్తమ బ్యాటింగ్ చేస్తున్నాననిపిస్తోంది. ఆటగాడి ముందు రెండే మార్గాలు ఉంటాయి. గేమ్ ను వదిలేయడం లేదా ముందుకు సాగుతూ ఫామ్‌ను తిరిగి అందిపుచ్చుకోవడం. నేను రెండో దానిపై దృష్టిసారించా. ప్రపంచంలోనే టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలవడం సంతోషంగా అనిపిస్తోంది. అయితే, ఎవరో ఒకరు ఈ రికార్డునూ అధిగమిస్తారనుకుంటున్నా. అదీ వైభవ్ సూర్యవంశీ కావొచ్చనేది నా అంచనా. ఇప్పటికైతే ఈ ఘనత పట్ల గర్వంగా ఉందని బట్లర్ అన్నాడు.


## సౌతాఫ్రికా పర్యటనలో మూడు టీ 20లు




ఈ ఏడాది చివర్లో భారత మహిళల జట్టు సౌతాఫ్రికా పర్యటనకు వెళ్లనుంది. ఈ టూర్‌లో టీమిండియా.. దక్షిణాఫ్రికాతో ఒక టెస్టు, మూడు వన్డేలు ఆడేలా ముందుగా షెడ్యూల్ రూపొందించారు. తాజాగా ఈ షెడ్యూల్ సవరించి మూడు టీ20లను జోడించినట్లు సౌతాఫ్రికా క్రికెట్ బోర్డు గురువారం తెలిపింది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో తొలి ఐసీసీ మహిళల ఛాంపియన్స్ ట్రోఫీని నిర్వహించనున్నారు. టీ20 ఫార్మాట్‌లో మ్యాచ్లు జరగనున్నాయి. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు ఈ సిరీస్ ఇరుజట్లకు ఈ టీ20 సిరీస్ సన్నాహకంగా ఉపయోగపడనుందని సౌతాఫ్రికా క్రికెట్ బోర్డు వివరించింది.

సవరించిన షెడ్యూల్ ప్రకారం.. సౌతాఫ్రికా, భారత్ డిసెంబరు 9-12 మధ్య ఏకైక టెస్టు మ్యాచ్ లో తలపడనున్నాయి. అదే నెల 16-22 మధ్య వన్డే సిరీస్, 26-30 మధ్య టీ20 సిరీస్ నిర్వహించనున్నారు. టెస్టు మ్యాచ్‌కు గెబెరా, వన్డేలకు పార్ల్, కేప్ టౌన్, బ్లూమ్ ఫౌంటెన్ ఆతిథ్యమివ్వనున్నాయి. తొలి టీ20 బెనోనిలో, మిగిలిన రెండు టీ20లు పోచెఫ్ రూమ్‌లో జరగనున్నాయి.

# నవంబర్ 6న 'రామాయణ'




బాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతున్న 'రామాయణ' సినిమా విడుదల తేదీపై చిత్రబృందం అధికారిక ప్రకటన చేసింది. నితీశ్ తివారీ దర్శకత్వంలో రూ. 4000 కోట్ల భారీ బడ్జెట్ తో రెండు భాగాలుగా 'రామాయణ' రాబోతున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమా విడుదల తేదిని మేకర్స్ ప్రకటించారు. మొదటి భాగాన్ని నవంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు నిర్మాణ సంస్థ వెల్లడించింది. గతంలో ప్రకటించినట్లుగానే తొలి భాగం ఈ ఏడాది, రెండో భాగం వచ్చే ఏడాది దీపావళి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుని, అద్భుతమైన విజువల్స్, హాలీవుడ్ స్థాయి విఎఫ్ఎక్స్‌తో రూపొందిన ఈ ట్రైలర్ యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో నిలిచింది.

ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీతగా, యశ్ రావణుడిగా నటిస్తున్నారు. కాజల్ అగర్వాల్ మండోదరి పాత్రలో కనిపించనున్నారు. పాన్ ఇండియా స్థాయిలో  కాకుండా ప్రపంచం మొత్తం ఈసినిమా వైపుచూసేలా ఈ ఇతిహాసం తెరకెక్కిందని నిర్మాత నమిత్ మల్హోత్రా చెబుతున్నారు.  సినిమాపై అంచనాలు కూడా అలాగే ఉన్నాయి. ఈ సినిమా విడుదల తేదీ హీరో రణ్‌బీర్ కపూర్ కుటుంబానికి కూడా ప్రత్యేకంగా నిలువనుంది. అదే రోజు ఆయన కుమార్తె రాహా పుట్టినరోజు కావడం విశేషం

# మంచి వసూళ్లు.. అయినా నష్టాలే!



ఎన్నో అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఇళయదళపతి విజయ్ చివరి చిత్రం జన నాయగన్ భారీ నష్టాలను మూటగట్టుకుంటోంది. విజయ్, పూజా హెగ్డే, మమితా బైజు ప్రధాన పాత్రల్లో హెచ్. వినోద్ దర్శకత్వంలో కేవీయన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కే వెంకట నారాయణ ఈ చిత్రాన్ని దాదాపు రూ.450 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మించారు. ఈ చిత్రంపై మొదటి నుంచీ కోలీవుడ్ లో భారీ అంచనాలే ఉన్నాయి. విజయ్ సినీ కెరీర్‌లోనే ఇది ఆఖరి సినిమా కావడం ఇందుకు ప్రధాన కారణం. కానీ, తీరా విడుదయ్యాక బాక్సాఫీస్ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి.

సాధారణంగా విజయ్ సినిమా అంటే టాక్‌తో సంబంధం లేకుండా కలెక్షన్ల వర్షం కురుస్తుంది. గతంలో యావరేజ్ టాక్ తెచ్చుకున్న ది గోట్ చిత్రం కూడా ఏకంగా రూ.400కోట్లకు పైగా గ్రాస్ రాబట్టింది. అయితే, జననాయగన్ విషయంలో పరిస్థితి కాస్త భిన్నంగా కనిపిస్తోంది. ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర రూ.300 కోట్ల మార్కును అందుకోగలిగినప్పటికీ, థియేట్రికల్ రన్ దాదాపు ముగింపునకు వచ్చినట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. రూ.300 కోట్లు అనేది చిన్న విషయం కానప్పటికీ సినిమా బిజినెస్ రేంజ్ ముందు ఇది సరిపోవడం లేదనేది అసలు సమస్య. ఈ సినిమా థియేట్రికల్ బిజినెస్ దాదాపు రూ.450 కోట్లకు జరిగింది. కానీ ఈ చిత్ర వసూళ్లు రూ.300కోట్ల వద్దే ఆగిపోయే సూచనలు కనిపిస్తున్నాయి. దీనివల్ల భారీ నష్టాలను చవిచూడాల్సి వస్తుందనే ఆందోళన వ్యక్తం అవుతోంది. కలెక్షన్స్ వచ్చినా కూడా డిస్ట్రిబ్యూటర్లకు భారీ లాస్ తప్పట్లేదు.


# ఆర్‌సీ-17లో రుక్మిణి?



పెద్ది సినిమా తరువాత మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ తదుపరి సినిమా ఆర్‌సీ-17 మీదనే అందరి చూపు ఉంది. రంగస్థలం వంటి భారీ హిట్ తర్వాత రామ్ చరణ్, డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో రానున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఓ ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం ఫిలింనగర్ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం, ఈ చిత్రంలో రామ్‌చరణ్ సరసన కథానాయికగా 'సప్త సాగరాలు దాటి' ఫేమ్ రుక్మిణి వసంత్‌ను ఎంపిక చేయాలని మేకర్స్ భావిస్తున్నారు.ఇప్పటికే దీనికి సంబంధించి దర్శకనిర్మాతలు ఆమెను సంప్రదించి కథలోని పాత్ర స్వభావాన్ని వివరించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన చర్చలు చివరి దశకు చేరుకున్నాయి. ఆమె కూడా కథ నచ్చి ఓకే చెప్పడానికి సిద్ధంగా ఉందని టాక్.

రుక్మిణి వసంత్ తన సహజమైన నటన, గ్లామర్‌తో సౌత్ ఇండియా వ్యాప్తంగా మంచి గుర్తింపు తెచ్చుకోవడమే కాకుండా, ప్రస్తుతం పలు క్రేజీ ఆఫర్లతో దూసుకుపోతోంది. ఎన్టీఆర్ డ్రాగన్, యశ్ టాక్సిక్‌లో రుక్మిణి నటిస్తోంది. ఇక ఇప్పుడు చరణ్ సరసన నటించే లక్కీ ఛాన్స్ పట్టేసింది.సుకుమార్ మార్క్ విలేజ్ అండ్ వింటేజ్ బ్యాక్‌డ్రాప్ డ్రామాలో చరణ్‌కు జోడీగా రుక్మిణి అయితే పర్ఫెక్ట్‌గా సరిపోతుందని టీమ్ భావిస్తోంది. త్వరలోనే ఈ కాంబినేషన్‌పై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

# చూస్తుండగానే అంతా అయిపోయింది...



అనేక భారతీయ భాషల సినిమాల్లో మెప్పించి, రెండు రోజుల క్రితం బ్లడ్‌క్యాన్సర్‌తో మరణించిన  విలక్షణ నటుడు ప్రదీప్ రావత్ చివరి రోజుల గురించి, ఆయన అనుభవించిన వేదనను, ఐసీయూలో గడిపిన ఆఖరి క్షణాలను తలచుకుని ఆయన తనయుడు విక్రమాదిత్య భావోద్వేగానికి గురయ్యారు. 'సై' సినిమాతో తెలుగుతెరకు పరిచయమైన ప్రదీప్ రావత్ స్టార్ హీరోలు అందరి సినిమాల్లో పవర్‌ఫుల్ విలన్‌గా నటించి మెప్పించారు. అంతే కాదు ఆయనలో కామెడీ యాంగిల్ కూడా ఉందని పలు చిత్రాలతో నిరూపించారు. 'నేను శైలజా'లో మహర్షి పాత్ర అందుకు నిదర్శనం. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషలతోపాటు ఒరియా, బెంగాలీ, నేపాలీ, భోజ్‌పురి భాషల్లో నటించారు. అంతేకాదు నైట్‌ఫాల్ వంటి ఇంగ్లీష్ చిత్రంలోనూ కనిపించారు. బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన మంగళవారం సాయంత్రం కన్నుమూశారు. ప్రదీప్ రావత్ అంత్యక్రియలు ముంబయిలోని ఓషివారా శ్మశానవాటికలో పూర్తయ్యాయి. ఆమిర్ ఖాన్‌తో పాటు బాలీవుడ్ ప్రముఖులు, అభిమానులు వచ్చి నివాళులర్పించారు.

అయితే చివరి రోజుల్లో అనుభవించన వేదన, ఐసీయూలోని ఆఖరి క్షణాలను గుర్తుచేసుకుంటూ ఆయన కుమారుడు విక్రమాదిత్య భావోద్వేగానికి గురయ్యారు. తండ్రి అంత్యక్రియలు పూర్తయిన తర్వాత విక్రమ్ మీడియాతో మాట్లాడారు. 'నాన్న చాలా ఆరోగ్యంగా ఉండేవారు. మొదట ఆయనకు కడుపులో ఇన్ఫెక్షన్ అనుకున్నాం. కానీ నిర్లక్ష్యం చేయకుండా అన్ని టెస్టులు చేయించి డాక్టర్‌ను సంప్రదించాం. మెడిసిన్స్ ఇచ్చినా పని చేయలేదు.  మళ్లీ పరీక్షలు చేయించగా.. బాడీలో తెల్ల  రక్త కణాల సంఖ్య చాలా ఎక్కువగా ఉందని చెప్పారు. తదుపరి ఆయనను కోకిలాబెన్ ఆసుపత్రికి తరలించాం. అప్పుడే బ్లడ్ క్యాన్సర్ అని తేలింది. ఆ మాట వినగానే అంతా కుప్పకూలిపోయాం. ఇది అరుదైన క్యాన్సర్, వేగంగా శరీరమంతా విస్తరిస్తుంది. రెండు నెలల క్రితమే నాన్నకు అన్నీ పరీక్షలు చేయించాము. రిపోర్ట్స్ నార్మల్‌గా వచ్చాయి. కానీ ఒకటిన్నర నెలలో అంతా ఏదోలా అయిపోయిందని విక్రమాదిత్య కన్నీరుమున్నీరయ్యారు. ఐసీయూ చివరి క్షణాల గురించి చెబుతూ 'డాక్టర్లు మమ్మల్ని పిలవడంతో ఐసీయూ వైపు పరిగెత్తాం. అప్పుడు వైద్యులు నాన్నకి సీపీఆర్ చేస్తున్నారు. అది చూడగానే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలిసింది. అవే నాన్న ఆఖరి క్షణాలని, ఆశలు లేవని నాకు అర్థమైంది. ఆ సమయంలో అమ్మ గుండె పగిలేలా ఏడ్చింది. చూస్తుండగానే అంతా అయిపోయింది. నాన్న మమ్మల్ని విడిచివెళ్లిపోయారని తెలిపారు.

# సల్మాన్‌పై కేసు

బాలీవుడ్ అగ్రకథానాయకుడు సల్మాన్ ఖాన్ చిక్కుల్లో పడ్డారు. తాజాగా ఆయన న్యాయపరమైన వివాదంలో చిక్కుకున్నారు. 'బీయింగ్ హ్యూమన్' (ఎవఱఅస్త్ర ఎబఝఱఅ) జ్యువెలరీ షోరూమ్ పేరుతో మోసం జరిగిందంటూ నమోదైన కేసులో చండీగఢ్ జిల్లా కోర్టు సల్మాన్ ఖాన్, ఆయన సోదరి అల్విరా ఖాన్‌తో పాటు సంబంధిత సంస్థ డైరెక్టర్లకు నోటీసులు జారీ  చేసింది. అక్టోబర్ 5న విచారణకు హాజరుకావాలని కోర్టు ఆదేశించింది. ఈ కేసును చండీగఢ్‌కు చెందిన వ్యాపారవేత్త అరుణ్ గుప్తా దాఖలు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు 'బీయింగ్ హ్యూమన్' జ్యువెలరీ బ్రాండ్ షోరూమ్‌ను ఏర్పాటు చేయాలని కంపెనీ ప్రతినిధులు ప్రోత్సహించడంతో సుమారు రూ.3 కోట్ల పెట్టుబడి పెట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందులో షోరూమ్ అభివృద్ధి పనులకే దాదాపు రూ.1 కోటి ఖర్చు అయినట్లు చెప్పారు. ఒప్పందంలోని అన్ని నిబంధనలను పాటించినప్పటికీ, షోరూమ్ ప్రారంభమైన తర్వాత కంపెనీ నుంచి హామీ ఇచ్చిన స్థాయిలో వ్యాపార సహకారం అందలేదు.



ముఖ్యంగా 2020 ఫిబ్రవరి నుంచి నగల సరఫరా నిలిచిపోవడంతో వ్యాపారం పూర్తిగా  దెబ్బతింది. భారీ నష్టాలు వచ్చాయని ఫిర్యాదులో వివరించారు. ఈ ఆరోపణలను సంబంధిత సంస్థ ఇప్పటికే ఖండించింది. 2018లో స్థానిక వ్యాపారవేత్తతో కుదిరిన ఒప్పందంలో సల్మాన్ ఖాన్‌కు ఎలాంటి ప్రత్యక్ష సంబంధం లేదని సంస్థ స్పష్టం చేసింది. ఆయన కేవలం తమ సంస్థకు ప్రచారం మాత్రమే చేశారని తెలిపింది. ఈ వివాదంపై తదుపరి విచారణ అక్టోబర్ 5న జరగనుండగా, కోర్టు ముందు ఇరు పక్షాల వాదనలు వినిపించనున్నాయి. ఈ కేసు విచారణ ఎలాంటి మలుపు తిరుగుతుందో అన్నది ఇప్పుడు బాలీవుడ్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



# తొలిసారిగా తండ్రితో కలిసి తెరపై

'కొరియన్ కనకరాజు' తరువాత కథానాయకుడు వరుణ్ తేజ్ తన తదుపరి చిత్రం'బరి'కి సిద్ధమవుతున్నారు. ఆయన హీరోగా యదు వంశీ దర్శకత్వంలో ఈ చిత్రం రానుంది. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఆయన సోదరి నిహారిక కొణిదెల ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఓ ఆసక్తికర విషయాన్ని వరుణ్ తేజ్ పంచుకున్నారు. ఇందులో తన తండ్రి నాగబాబు నటిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు.

'కొరియన్ కనకరాజు' ప్రచారంలో భాగంగా ఎన్ఆర్ అభిమానులతో ముచ్చటించిన వరుణ్ ఈ విషయాన్ని వెల్లడించారు. దీంతో మొదటి సారి ఈ తండ్రీ కొడుకులు తెర మీద కనిపించనుండటంతో సినిమాపై ఆసక్తినెలకొంది. గ్రామీణ నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ సినిమాగా 'బరి'ని తీర్చిదిద్దుతున్నారు. ఈ చిత్రం కోసం వరుణ్ ఏడు నెలలుగా వాలీబాల్ ప్రాక్టీస్ చేస్తున్నారు. వచ్చే సంక్రాంతికి విడుదల చేయాలనే ప్రణాళికతో శరవేగంగా షూటింగ్ చేస్తున్నారు. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో రూపొందిన 'కొరియన్ కనకరాజు' శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది.